
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

నిజామాబాద్

: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-2-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 08 పేజీలు: 10+4 వెల: 8.00




## విజయంతో బోణీ

అమెరికా జట్టుపై 29 పరుగుల తేడాతో భారత్ విజయం!

7



## మోడీ సహకారంతోనే మున్సిపాలిటీల అభివృద్ధి

### కాగజ్‌నగర్‌లో మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్

### ప్రాణహిత ప్రాజెక్టుకు మహారాష్ట్ర సహకారం కోరిన ఎమ్మెల్యే హరీష్ బాబు

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కాగజ్‌నగర్, మున్సిపాలిటీల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సాధ్యమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్పీఎం క్రికెట్ గ్రౌండ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా పట్టణాభివృద్ధికి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, యుఐడిఎఫ్, 15వ ఆర్థిక సంఘం, అమృత్ పథకాల ద్వారా డ్రైనేజ్, పారిశుద్ధం, తాగునీరు, రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై తగిన దృష్టి సారించలేదని విమర్శించారు. ప్రాణహిత ప్రాజెక్ట నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని, బెల్లంపల్లి-గడ్చిరోలి జాతీయ రహదారి నిర్మాణ పనులను త్వరిత గతిన ప్రారంభించాలని సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నాగేష్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి అయితే ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తాయని, రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వాణిజ్య, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని నేతలు పేర్కొన్నారు.

ముఖ్యంగా ప్రాణహిత ప్రాజెక్ట ద్వారా సాగునీటి వసతులు విస్తరించి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి-గడ్చిరోలి రహదారి నిర్మాణం పూర్తైతే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సులభమవుతాయని అభిప్రాయపడ్డారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఫడ్నవీస్ సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీలు ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ పట్టణ ప్రజలు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒకసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


భారత్ బాటలోకి

## ప్రపంచ దేశాలు

యుఎస్, యుకె, ఆస్ట్రేలియా సహా పలు దేశాలు భారత్‌తో ట్రేడ్‌డీల్స్

ఎన్నో దేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా ఇండియా

### మలేసియా సదస్సులో ప్రధాని మోడీ



కౌలాలంపూర్‌లో మలేసియా పిఎం ఇబ్రహీంతో ప్రధాని మోడీ

**కౌలాలంపూర్, ఫిబ్రవరి 7:** వాణిజ్యం, ఆర్థికవృద్ధిలో విశ్వసనీయ భాగస్వామిగా భారత్ కొనసాగుతోందని, ఇప్పటికే పెట్టుబడులకు హబ్‌గా భారత్‌నిలిచిందని ప్రధానిమోడీ అన్నారు. ఇందుకు ఉదాహరణగా ఆయా దేశాలు భారత్‌లోచేసుకున్న ట్రేడ్ డీల్స్‌ను ఉదహరించారు. యుకె, ఈయు, యుఎస్ఎ, యుఎఇ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్ వంటి దేశాలు ఇపుడు భారత్‌ను తమకు విశ్వసనీయ భాగస్వామిగా పరిగణిస్తున్నాయని ప్రధానిమోడీ చెప్పారు. కౌలాలంపూర్‌లో జరిగిన సదసుసలో ఆయన మాట్లాడుతూ అంతకుముందు భారత్ ఒక అతిపెద్ద మార్కెట్‌గా విదేశాలు చూసేవని ఇపుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారినట్లుచెప్పారు. పైదేశాలన్నీ కూడా భారత్‌తో వాణిజ్య ఒప్పందాలుచేసుకున్నాయని గుర్తుచేసారు. అంతకుముందు >>2

### భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు

ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్న ఉభయదేశాలు 2

# 'రంగారెడ్డి'కి గోదావరి నీరు

### ప్రాజెక్టులు కట్టి సస్యశ్యామలం చేస్తాం..

### గాడిదకి గడ్డి వేసి, గోవుని పాలు అడగొద్దు

### ప్రాణహిత- చేవెళ్లను నిర్వీర్యం చేసిన కెసిఆర్

### పదేళ్ల బిఆర్ఎస్ దోపిడీ చెరిపేస్తే పోదు

### నారాయణపూర్ 'ప్రజాపాలన- ప్రగతిబాట' సభలో సిఎం రేవంత్



నారాయణపూర్ 'ప్రజాపాలన- ప్రగతిబాట' సభకు హాజరైన ప్రజలు



సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**పరిగి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా మున్సిపాలిటీలోని ఓటర్లు ఓటు వేసే ముందు ఆలోచించుకోవాలని, గాడిదకు గడ్డివేసి గోవుని పాలు అడగొద్దని ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.. శనివారం, వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని నారాయణపూర్‌లో ప్రజాపాలన ప్రగతిబాట" బహిరంగ సభకు హాజరయ్యి, ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాకు సాగునీరు అందించే భాద్యత తనపై ఉందన్నారు. >>2

## 26 లేదా మార్చి తొలి వారంలో

# బడ్జెట్ అసెంబ్లీ



### 10 నుంచి 15 రోజులు సమావేశాలు జరిగే అవకాశం

### కొత్తబడ్జెట్‌లో గ్యారంటీలు, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టిన దృష్ట్యా రాష్ట్రంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు రేవంత్‌సర్కార్ సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా ఈనెల 16వ తేదీ తర్వాత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈనెల 26నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని మొదట రాష్ట్ర ప్రభుత్వం భావించినప్పటికీ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా బడ్జెట్ రూపకల్పనపై ఇంకా కసరత్తు పూర్తి కాలేదని తెలుస్తోంది. డిప్యూటీ సిఎం ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 26 నుంచి అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కుదరకపోతే మార్చి మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలుస్తోంది. అదీగాక అసెంబ్లీ ఆవరణలోని మండలి భవనం పునరుద్ధరణ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈనెలాఖరులోగా మండలి భవనం పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మార్చి మొదటి వారంలోనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరిగితే మండలి సమావేశంలో అసెంబ్లీఆవరణలోని మండలి భవనంలోనే నిర్వహించేందుకు వీలవుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇప్పటికే శాఖల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షలు నిర్వహించారు. ఆయా శాఖల నుంచి బడ్జెట్ కేటాయింపులకు సంబంధించిన వివరాలను స్వీకరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఈ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టబోతుంది. బడ్జెట్‌పై చర్చ, ఆమోదం కోసం ఈ దఫా సమావేశాలను ప్రభుత్వం 10 నుంచి 15రోజుల పాటు నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలకు సమాధానం ఇచ్చేందుకు కీలక బిల్లులపై సుదీర్ఘంగా చర్చించి ఆమోదించేలా సమావేశాలను నిర్వహించాలని భావిస్తుంది. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత కేబినెట్ సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి బడ్జెట్‌పై ఒకసారి కసరత్తు చేసే అవకాశం ఉంది. ఈ బడ్జెట్‌లో ఎన్నికల హామీలు, మున్సిపల్, గ్రామాల అభివృద్ధికినిధుల కేటాయింపులపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాలు నిర్వహణపై సిఎం రేవంత్‌రెడ్డితో శుక్రవారం డిప్యూటీసిఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క భేటీ అయినట్లు సమాచారం. బడ్జెట్ కేటాయింపులు, >>2

## ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై అనేక అనుమానాలు



### ఫోన్‌ట్యాపింగ్ కేసు కీలక సమాచారం అక్కడే..

### కెసిఆర్‌ను అరెస్టు చేయలేకపోతే సిఎం వైదొలగాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి7, ప్రభాతవార్త:** కాళేశ్వరం అవినీతిపై మాజీ సీఎం కేసీఆర్‌పై విచారణ, చర్యల విషయంలో తనను ప్రశ్నించే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి, అక్రమాలపై మాజీ సీఎం కేసీఆర్‌ను జైలుకు పంపిస్తానన్న రేవంత్ మాటలు ఏమయ్యాయి? అని నిలదీశారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకునే ధైర్యం లేకపోతే, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉంటే బహిరంగంగా స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని సవాల్ విసిరారు. కానీ సీఎం పదవిలో ఉంటూ >>2




శనివారం హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్‌ల్యాబ్‌లో అగ్నిప్రమాదం దృశ్యం

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

### ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ విచారణలోని కీలక ఆడియోలు, ఇతర ముఖ్య సాక్ష్యాలు అగ్నికి ఆహుతి...?

### కీలక ఫైళ్లు, హార్డ్ డిస్క్‌లు, పత్రాలు దగ్ధం

### ప్రమాదంపై అనుమానాలు- షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం: ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్ మాన్ వెల్లడి

2


విశ్వాసం కలకాలం ఉంటుంది



దానిని లాప్స్ అవనివ్వకండి

ఎల్ ఐ సి ఆఫ్ ఇండియా సమర్పిస్తోంది
వడ్డీలో రాయితీతో కూడిన
స్పెషల్ రివైవల్ క్యాంపెయిన్
వ్యవధి 1 జనవరి, 2026 నుండి 2 మార్చి, 2026 వరకు

త్వరపడండి!
ఈ అవకాశం వదులుకోకండి.

ల్యాప్స్ అయిన మీ పాలసీని పునరుద్ధరించుకోండి.
బీమా రక్షణ మరియు దాని ప్రయోజనాలు పొందుతూనే ఉండండి.*
*నియమ నిబంధనలు వర్తిస్తాయి

| మొత్తం చెల్లించవలసిన ప్రీమియం | వడ్డీలో రాయితీ % | రాయితీలో గరిష్ట పరిమితి** |
|---|---|---|
| ₹ 1,00,000 వరకు | 30% | ₹ 3,000 |
| ₹ 1,00,001 నుంచి ₹ 3,00,000 వరకు | 30% | ₹ 4,000 |
| ₹ 3,00,001 మరియు అంతకు మించి | 30% | ₹ 5,000 |

**నియమ నిబంధనలు వర్తిస్తాయి

పాలసీ నిబంధనలకు లోబడి ప్రీమియం బకాయి పడిన తేదీ నుండి 5 సంవత్సరముల లోపు రివైవ్ చేయవచ్చును.
కనెక్ట్ అయివుండండి. ఎల్ఐసిలో మీ మొబైల్ నంబరు, ఇ-మెయిల్, ఎన్ఇఎఫ్‌టి మరియు పాన్‌ను అప్‌డేట్ చేసుకోండి.
వివరాల కొరకు, మీ ఏజెంట్‌ని/సమీపంలో ఉన్న ఎల్ఐసి బ్రాంచిని సంప్రదించండి/సందర్శించండి www.licindia.in లేదా 56767474కి మీ నగరం పేరు ఎస్ఎంఎస్ చేయండి

LIC
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా

మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి
డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital
సందర్శించండి: licindia.in
కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827
మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever | IRDAI Regn No.: 512
LIC/ P1/2025-26/30/Tel

నకిలీ ఫోన్ కాల్స్ మరియు కాల్పనిక/కపట ప్రతిపాదనలకు లొంగకుండా జాగ్రత్తపడండి. ఐఆర్‌డిఎఐ బీమా పాలసీలు విక్రయించడం, బోనస్ ప్రకటించడం లేదా ప్రీమియంలు పెట్టుబడి పెట్టడం లాంటి పనులు చేయదు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌ని అందుకునే ప్రజలను పోలీసులకు ఫిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది. నష్టాంశాలు, నియమ నిబంధనలపై మరిన్ని వివరాల కొరకు, దయచేసి పాలసీని విక్రయించడానికి ముందు అమ్మకాల బ్రోచర్‌ని జాగ్రత్తగా చదవండి.



జమ్మూకాశ్మీర్ అభివృద్ధిపై శనివారం జమ్మూలో నిర్వహించిన సమీక్షలో కేంద్రహోంమంత్రి అమిత్‌షా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

# 'రంగారెడ్డి'కి గోదావరి నీరు

>> ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కోట్ల రూపాయల నిధులతో ప్రాజెక్టులు నిర్మించి,గోదావరి జలాలను ఖచ్చితంగా తీసుకువస్తానని హామీ ఇచ్చారు.. .పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తాండూర్ ప్రజలకు కాగ్నా నది ప్రాజెక్ట్ నిర్మాణం చేసి, తాండూర్ ప్రాంత ప్రజలకు నీటి సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు.. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్మాణం చేపట్టలేదని, వైఎస్ఆర్ హయాం లో 14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కు అనుమతులు ఇస్తే, బిఆర్ఎస్ అధికారం చేపట్టాక కెసిఆర్ ప్రాణహితచేవెళ్లప్రాజెక్టును నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు.. మూడు వేల టిఎంసిలు జలాలు ఆంధ్రాకు ఇస్తానన్న కెసిఆర్, 300 టిఎంసిలతో రంగారెడ్డికి నీళ్లు అందించొచ్చు కదానని ప్రశ్నించారు.. కాళేశ్వరం కట్టి వేల కోట్లు లాభాలు తిన్న కెసిఆర్ కుటుంబసభ్యులు, విలాసవంతమైన ఫాం హౌస్ లు,వ్యాపారాలు చేస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు.. దళితులను ముఖ్యమంత్రిని చేస్తానన్న కెసిఆర్ ఈనాడు అసెంబ్లీ స్పీకర్ గా దళితుడ్ని కాంగ్రెస్ ప్రభుత్వం నియమిస్తే, అసెంబ్లీకి రాకుండా మొఖం చాటేశాడని తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ కు నోటీసులు ఇస్తే చరిత్రను చెరిపే ప్రయత్నం చేస్తున్నామనీ కెటిఆర్,హరీష్ లు ప్రకటనలు చేస్తున్నారని రేవంత్ అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ చేసిన దోపిడీ చెరిపితే చెరిగిపోయేది కాదన్నారు.. వికారాబాద్ జిల్లా లోని వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ నియోజకవర్గాలకు ఎన్ని కోట్ల నిధులు కావాలన్నా, అన్ని నిధులను వెచ్చించి ప్రాంతాల అభివృద్ధి చేస్తామని, రోడ్ల నిర్మాణ పనులను చేపడతామన్నారు.. మూసి ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే దాన్ని అడ్డుకునేందుకు బిఆర్ఎస్,బిజెపి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రైతు భరోసాలో భాగంగా రైతుల ఖాతాల్లోకి జమచేశామని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా 70 వేల ఉద్యోగాలు కల్పించి, ఆడబిడ్డలను ప్రతి సంక్షేమ పథకం లో లబ్ది చేస్తున్నామని సిఎం రేవంత్ పేర్కొన్నారు.. 9 వేల కోట్ల రూపాయలను మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని,ఇండ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వారికి ఆత్మగౌరవాన్ని నిలబెట్టామన్నారు... ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వేల కుటుంబాలకు రేషన్ కార్డులను ఇచ్చి, అర్హులైన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని సిఎం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని 6650 స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి 567.69 కోట్ల రూపాయల చెక్కులను మహిళా సంఘాలకు అందజేశారు.. ఈ కార్యక్రమంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, సాంకేతిక, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బియ్యని మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు

### ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్న ఉభయదేశాలు

## కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** భారత్–అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. దీనికి సంబంధించి ఇరు దేశాలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. భారత ఉత్పత్తులపై ఉన్న 50 శాతం సుంకాన్ని 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇరు దేశాలకు ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ చర్చల్లో కీలక పాత్ర పోషించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తాజా మధ్యంతర ఒప్పందాన్ని చరిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. ఇది భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ తెరుస్తుందని.. ముఖ్యంగా ఎంఎస్ఎంఇలు, రైతులు, మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్తుందన్నారు. ఎగుమతులు పెరగడంతో దేశవ్యాప్తంగా మహిళలు, యువతకు లక్షలాది కొత్త ఉద్యోగావకాశాలువస్తాయన్నారు.దుస్తులు, తోలు,పాదరక్షలు, ప్లాస్టికన, రబ్బరు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు, ఎంపిక చేసిన యంత్రాలు వంటి కీలక రంగాలకు లాభదాయకమన్నారు. ఇక, రష్యా నుంచి చమురు కొనుగోల్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందని అమెరికా తెలిపింది. తమ దేశం నుంచి భారీగా ఇంధనం, గ్యాస్‌ను దిగుమతి చేసుకునేందుకు అంగీకరించినట్లు వెల్లడించింది. తమ దేశం నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులకు భారత్ అంగీకరించిందని పేర్కొంది.

**వీటిపై ఎలాంటి రాయితీలు లేవు..**

తాజా ఒప్పందంలో భాగంగా మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయా, సుగంధ ద్రవ్యాలు, ధాన్యాలు, నూనెగింజలు, పౌల్ట్రీ, పాలు, జున్ను, ఇథనాల్, పొగాకుతోపాటు కొన్ని రకాల కూరగాయాలు, మాంసం వంటి వ్యవసాయ, పాల ఉత్పత్తులపై సుంకాల విషయంలో అమెరికాకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదని గోయల్ తెలిపారు. అన్ని వాణిజ్య చర్చల్లో రైతుల ప్రయోజనాలకే తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

**అదనపు సుంకాల తొలగింపు**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో గతేడాది భారత వస్తువులపై 25 శాతం అదనపు సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. తాజా ఒప్పందం నేపథ్యంలో వాటిని తొలగిస్తున్నట్లు యుఎస్ పేర్కొంది. ఈ మేరకు ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంకతం చేశారని వైట్‌హౌస్ పేర్కొంది. ఇది ఈ నెల 7 (శనివారం) నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే రానున్న 10 యేళ్లలో రక్షణ సహకారం విస్తరించుకునేందుకు ఇరు దేశాలు ఓ ఫ్రేమ్‌వర్క్‌కు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది.

# ఫోరెన్సిక్ లాబ్ ఘటనపై అనేక అనుమానాలు

>> చర్యలు తీసుకోకుండా ఆ వైఫల్యాన్ని బీజేపీ పైకి నెట్టడం సమంజసం కాదని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలకు బాధ్యత వహించకుండా బీజేపీ భుజాలపై బందూకు పెట్టి బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్–కాంగ్రెస్ పార్టీల అవినీతి, అక్రమాలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్‌పై ఈగ, దోమ వాలకుండా రేవంత్ కాపాడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకునే విషయంలో చిత్తశుద్ధి ఉంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?, ఎవరు అడ్డుకుంటున్నారు?, రాహుల్ గాంధీ అడ్డుకుంటున్నారా?, కాంగ్రెస్ అధిష్టానం అడ్డుకుంటున్నదా? స్పష్టత ఇవ్వాలని సీఎంను డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య దూప్ డైలాగులు నడుస్తున్నాయని చెప్పారు. రాజకీయంగా మోదీని ఎదుర్కోలేక ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని స్పష్టం చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్ మాదిరిగానే మాజీ సీఎం కేసీఆర్ కూడా తన అసమర్థతను కేంద్ర ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేశారని, కానీ తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని అందుకే అధికారం నుండి దించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అయినా, కాంగ్రెస్ అయినా తన కాళ్ల దగ్గర ఉండాల్సిందేనని అక్బరుద్దిన్ అంటుండడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మంటగలపడమేనని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ఎలాంటి విధివిధానాలు లేకుండా, ఆధారాలు లేకుండా, తమ పార్టీ ఎమ్మెల్యేల సూచనల మేరకు డివిజన్ల విభజన చేసి, రిజర్వేషన్లను గందరగోళంగా మార్చిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బీసీలున్న చోట ఎస్సీలకు, ఎస్సీలున్న చోట బీసీలకు, ఎవరూ లేని చోట ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చి సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని విమర్శిఇంచారు. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఎలాంటి తేడా లేదని, మున్సిపాలిటీలకు ఆర్థిక సహకారం ఇవ్వడంలో ఈ రెండు పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన 6 గ్యారంటీల అమలుకు 12 నెలల గడువు పెట్టారని కానీ ప్రస్తుతం దాదాపు 26 నెలలు గడుస్తున్నా... ఇప్పటివరకు హామీల అమలుకు దిక్కులేదన్నారు. హార్వర్డ్ వెళ్లొచ్చినా రేవంత్‌రెడ్డిలో ఆలోచన మాత్రం మారలేదని విమర్శించారు. సంస్కారహీనమైన మాటలు, అడ్డగోలు ఆరోపణలు, రోజుకో కొత్త అబద్ధం, కొత్త వివాదం ఇదే ఆయన పాలన అని దుయ్యబట్టారు. హిందూ దేవుళ్లను అవమానించడం, ముస్లిం అంటే కాంగ్రెస్ అని, కాంగ్రెస్ అంటే ముస్లిం అని పలుమార్లు హేట్ స్పీచ్ ఇచ్చింది రేవంత్‌రెడ్డేనని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ఆ ల్యాబ్‌లోని కంప్యూటర్లలో వందలాది కేసులకు సంబంధించిన కీలక డేటా, టెక్నికల్ ఎవిడెన్స్, ఫోరెన్సిక్ ఎవిడెన్స్ నిల్వ ఉన్నట్టు తెలుస్తోందన్నారు. ముఖ్యంగా ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి హైప్రొఫైల్ కేసులకు సంబంధించిన డిజిటల్ ఎవిడెన్స్ అక్కడ ఉందా? లేదా? అన్నది ప్రభుత్వం వెంటనే ప్రజలకు చెప్పాలని, అందులో టెక్నికల్ ఎవిడెన్సీ, ఫోరెన్సిక్ ఎవిడెన్సీ ఉందా లేదా అనేది స్పష్టంగా ప్రకటించాలని, ఉంటే బ్యాకప్ ఉందా లేదనేది కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికారికంగా, బాధ్యతతో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

# 26 లేదా మార్చి తొలి వారంలో బడ్జెట్ అసెంబ్లీ

>> ఏఏ రంగాలకు ప్రాధాన్యత,తదితర అంశాలను చర్చించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల తర్వాత అన్ని శాఖల ఉన్నతాధికారులతో సిఎం,డిప్యూటీ సిఎం బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో బడ్జెట్ తుది మెరుగులు దిద్దబోతున్నట్లు తెలిసింది. బడ్జెట్ ప్రకటన సందర్భంగా ప్రధాన రంగాలకు అధిక నిధులు కేటాయించనున్నట్లు సమాచారం. హామీలు గ్యారంటీలపైన ప్రత్యేక ఫోకస్ పెట్టనున్నట్లు తెలిసింది. ప్రతిపక్ష విమర్శలకు తావు లేకుండా కేటాయింపులు చేసి అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ వివరించబోతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఏఏ రంగాలను విస్మరించింది అనే అంశాలను సైతం ఎండగట్టేందుకు సిద్ధమవతుంది. నీటిపారుదల రంగానికి కేటాయించిన నిధులను ఎలా దుర్వినియోగం చేశారనేది కూడా మరోమారు అసెంబ్లీ వేదికగా వివరించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ అయితే హామీలు గ్యారంటీలు–బడ్జెట్ కేటాయింపులపైనే ప్రభుత్వాన్ని నిలదీయాలని భావిస్తుంది. ఇప్పటికే వాటిపై నిలదీస్తామని పలు సమావేశాల్లో బిఆర్ఎస్ నేతలు ప్రకటించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో హాట్ హాట్‌గాచర్చ జరగనుంది. గత ఏడాది (2025 –26) ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ఆర్థిక శాఖ పద్దును ప్రవేశపెట్టారు. రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. రాష్ట్రం అప్పులు రూ.5,04,814 కోట్లుగా ఉంది. అయితే ఈ సంవత్సరం (2026–27) బడ్జెట్ ఎంత పెంచుతారు? ఏఏ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు అనేది చర్చ జరుగుతోంది. 6 గ్యారంటీలకు గత బడ్జెట్‌లో 56,084కోట్లు కేటాయించింది. ఈసారి ఎంత బడ్జెట్ పెంపుకానుందని ఆసక్తికరంగా మారింది.

## వారం - వర్జ్యం

08-02-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
సప్తమి తె.5.02
స్వాతి తె.5.03
వర్జ్యం : ఉ.11.19–మ.1.06
దు.సా.4.32–5.18
రాహుకాలం సా.4.30–6.00

## వార్తాఫలం

**మేషం:** ఉపకరిస్తాయని భావించిన అంశాలను సానుకూలపరచు కోవడానికి గాను మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

**వృషభం:** ఆశావహదృక్పథాన్ని కనబరుస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. విందు, వినోదాలు.

**మిథునం:** నూతన రచనా వ్యాసంగం పట్ల అభిరుచి కనవరుస్తారు. బంధువుల కలయిక.పోటీ పరీక్షలలో విజయం.

**కర్కాటకం :** కొనుగోళ్ళు, అమ్మకాలు లిఖిత పూర్వక వ్యవహారాలలో తగు జాగ్రత్తలను పాటించండి.వస్త్రలాభం.

**సింహం:** దీర్ఘకాలిక వేధింపుల నుండి విముక్తిని పొందడానికి సరికొత్త మార్గాలు లభిస్తాయి.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కన్య :** అంతర్గతమైన పద్దులను, లెక్కలను పరిశీలించుకుంటారు. వాటిలోని లోటు పాట్లను గ్రహిస్తారు.వాహనసౌఖ్యం.

**తుల :** రాజకీయ రంగంలోని వారితో స్నేహాలను పెంచుకుంటారు. సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి.

**వృశ్చికం:** మీపైన పిటీషన్లు విచారణలు పెద్దగా ప్రభావం చూపించవు. స్థిరాస్తులు అమ్మేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.

**ధనుస్సు:** సంభాషణలలో జాగ్రత్తలు పాటించకపోతే ఘర్షణకు చోటు చేసుకొంటాయి.క్రయ విక్రయాలలో లాభాలు.

**మకరం:** విద్యార్థులు మరింత శ్రద్ధను కనబరచవలసి ఉంటుంది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

**కుంభం:** ఋణాలు చాలా వరకు తీరుస్తారు. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. వాహనసౌఖ్యం.

**మీనం :** భూవివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వస్త్రలాభం.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మలేసియాలోని కౌలాలంపూర్ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాసభారతీయులు

# భారత్ బాటలోకి ప్రపంచ దేశాలు

>> యూరోపియన్ యూనియన్‌తో చేసుకుంటే ఇపుడు అమెరికాతోకూడా భారత్ వాణిజ్య ఒప్పందంచేసుకుందని గుర్తుచేసారు. మలేసియాలో ఉన్న భారత సంతతి భారతీయులకు ఎన్నో విస్తృత అవకాశాలున్నాయని చెపుతూనే మలేసియాలో ఉన్న భారత సంతతి పౌరులకు ఓసిఐ ఇండియా కార్డులు ఇస్తామని ప్రకటించారు. ఆరవ తరం పౌరులవరకూ కూడా ఈ కార్డులు జారీ అవుతాయన్నారు. మలేసియా విద్యార్థులు భారత్‌లో చదువుతున్నవారికి తిరువళ్లువార్ ఉపకారవేతనాలు అందిస్తామని అన్నారు.మేలసియాలో భారత కాన్సులేట్ కార్యాలయం సత్వరమే ఏర్పాటుచేస్తామన్నారు. భారత్ గడచిన దశాబ్దకాలంతో పోలిస్తే శరవేగంగా పరివర్తనం చెందుతోందన్నారు. 2015లో మనం కలుసుకుననపుడు భారత్‌లోని పుష్కల అవకాశాలుప్రస్తావించానని, ఇపుడు భారత్ పనితీరును మీకు వివరిస్తున్నట్లు తెలిపారు. దశాబ్దకాలంలోనే భారీ ఎత్తున అభివృద్ధి కొనసాగిందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే 11వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా భారత్‌నిలిచిందని, ఇపుడు టాప్ మూడోదేశంగా మారుతున్నట్లు తెలిపారు. రక్షణరంగ ఎగుమతులు, మొబైల్ ఉత్పత్తుల్లో ప్రపంచ వ్యాప్తంగా టాప్‌లో నిలిచిందన్నారు. యుపిఐ ప్లాట్‌ఫామ్‌పై భారత్‌లో డిజిటల్‌లావాదేవీలు మరింతగా వేగం పుంజుకున్నాయన్నారు. స్వచ్ఛ ఇంధనంకోసం కట్టుబడి ఉన్నామని, సోలార్ విద్యుత్ సామర్థ్యం 40 రెట్లుపెరిగిందన్నారు. మలేసియా పర్యటనలోప్రధానిమోడీ ఆర్థిక, డిజిటల్, సాంస్కృతిక, ఇరుదేశాల పౌరులమధ్య సాహిత్య సాంస్కృతిక బంధం పటిష్టంచేసేవిధంగా పరస్పరం కలిసి పనిచేస్తాయని అన్నారు. మలేసియాలో డిజిటల్ చెల్లింపులకు, రూపీ లావాదేవీలకు కూడా నాందిపడుతోందని మోడీ చెప్పారు. భారత సంతతి సమాజం ఉన్న రెండో అతిపెద్ద దేశం మలేసియా అన్నారు. రోటీ కనై మలబార్ పరోటా, కొబ్బరి సుగంధ ద్రవ్యాలు వంటి పదార్థాలు కొచ్చిలో ఉన్నా కౌలాలంపూర్‌లో ఉన్నా వీటి రుచులు ఇరుదేశాలప్రజలకు సుపరిచితమేనన్నారు. మలేసియా ప్రధాని మంచి గాయకుడని ప్రధాని కొనియాడారు. ఆయన పాడిన ఒక భారతీయ పాట వైరల్ అయిందని గుర్తుచేసారు. తమిళ సంతతికి చెందిన ప్రజలు దశాబ్దాలుగా ఉంటున్నారని, వివిధరంగాల్లో వారు విస్తృత సేవలందిస్తున్నారని ప్రశంసించారు. భారత దేశ ప్రస్తుత ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు జైశంకర్; నిర్మలా సీతారామన్, ఎల్‌మురుగన్ తమిళనాడుకు చెందినవారేనని ఆయన ప్రవాస తమిళులకు గుర్తుచేసారు.

# రాష్ట్రంలో పవన్ ప్రచారానికి బ్రేక్

### ప్రత్యర్థులుగా ఇరు పార్టీల అభ్యర్థులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన చీఫ్ కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రచారానికి బ్రేక్ పడింది. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి, తెలుగుదేశం కూటమిలో భాగస్వామ్యమైన జనసేన తెలంగాణ మున్సిపల్ ఎన్నికలో కూడా అదే తరహాలో వ్యహరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో బిజెపి, జనసేన మధ్య అవగాహన ఒప్పందం నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థుల తరపున ప్రచారం చేసేందుకు రెండు పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో బిజెపి, జనసేన అభ్యర్థుల తరపున శనివారం నుండి పవన్‌కల్యాణ్ ప్రచారం చేయాల్సి ఉంది.అయితే అర్థంతరంగా ఈ ప్రచారం వాయిదా పడింది. ఇరుపార్టీల అభ్యర్థులు ప్రత్యర్థులుగా పోటీ పడుతుండటంతో పార్టీ వర్గాల్లో గందరగోళం నెలకొంది. పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచారం చేస్తే బిజెపి లేక, జనసేన అభ్యర్థుల తరపున ఓట్ల ప్రచారం చేస్తారా అనేదానిపై ఉభయ పార్టీల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలో భాగస్వామయిగా ఉంటూ, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల జనసేన తరపున అభ్యర్థులను నిలపడాన్ని బిజెపి అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది. దీనికి తోడు మరోపక్క కరీంనగర్ కార్పొరేషన్‌లో బిజెపి రెబల్ అభ్యర్థికి జనసేన తరపున బీఫామ్ ఇవ్వడడం వివాదాస్పదమైంది. దీంతో శనివారం నుండి రాష్ట్రంలోని నల్లగొండ, తాండూరు, వికారాబాద్ తదితర చోట్ల నిర్వహించాల్సిన జనసేన చీఫ్ పవన్‌కల్యాణ్ ప్రచారాన్ని రద్దు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

### ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ విచారణలోని కీలక ఆడియోలు, ఇతర ముఖ్య సాక్ష్యాలు అగ్నికి ఆహుతి...?

### కీలక ఫైళ్లు, హార్డ్ డిస్కులు, పత్రాలు దగ్ధం

### ప్రమాదంపై అనుమానాలు- షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం: ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్ మాన్ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** నాంపల్లి నీలోఫర్ ఆసుపత్రి వద్దగల రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్ (ఎఫ్‌ఎస్‌ఎల్)లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తులో ఉదయం పది గంటల సమయంలో మంటలు వ్యాపించగా అక్కడి ఉద్యోగి ఒకరు దీనిని గ మనించి వెంటనే పక్కనే గల నాంపల్లి పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఎఫ్‌ఎస్‌ఎల్ కార్యాలయంలో వున్న సిబ్బంది, నాంపల్లి పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని నాలుగు గంటల పాటు శ్రమించి మంటల ను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఒక ఉద్యోగి స్వల్పంగా గాయపడగా మరో నలుగురు తృటిలో తప్పించుకున్నారు. అగ్ని ప్రమాదం సంభవించిన ఎఫ్‌ఎస్‌ఎల్ మొదటి అంతస్తులో పోలీసు శాఖలో కీలకమైన కేసుల పరిశోధనకు సంబంధించిన ఫైళ్లు, హార్డ్ డిస్కులు, ముఖ్యమైన పత్రాలు వున్నా యి. ప్రమాదం కారణంగా చెలరేగిన మంటల్లో ఇవన్నీ కాలి బూడిదయ్యాయని ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారులు తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రంలో సం చలనం రేపిన ఓటుకు నోటు కేసుతో పాటు ఫోన్ ట్యాపింగ్ విచారణలోని వెలుగు చూసిన ఆడియోలు, ఇతర కీలక సాక్ష్యాలు అగ్నికి ఆహుతి అ యినట్లు తెలిసింది. దీనిపై అటు పోలీసులు, ఇటు ఫైర్ సర్వీస్ అధికారులు నోరు మెదపడం లేదు. ఈ ప్రమాదంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు అనుమానాలు వ్యక్తం చేయగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించిందని ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్‌మాన్ తెలిపారు. ఈ ప్రమాదంపై నాంపల్లి పోలీసులు కేసునమోదుచేసి విచారణ చేబట్టగా ఫైర్ సర్వీస్, ఎఫ్‌ఎస్ ఎల్ అధి కారులు శాఖాపర మైన విచారణ చేబట్టారు.

తాజా ప్రమాదంలో చూస్తుండగానే మంటలు మరింతగా వ్యాపించి మొత్తం అంత స్తును కమ్మేసింది. ఆ సమయంలో అక్కడ వున్న కృష్ణ అనే ఉద్యోగి దీనిని గమనించి మంటలను ఆర్పేందుకు యత్నించి స్వల్పంగా గాయపడ్డాడు. ఇదే సమయంలో ఇతర ఉద్యోగులు అతన్ని కాపాడారు. దీంతో పాటు నలుగురు ఉద్యోగులు లోపల వుండగా వారిని కూడా బయటకు తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదంపై ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారులు పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బందికి వెంటనే సమాచారం అందించారు. అగ్ని ప్రమాదం విషయం తెలిసిన వెంటనే పక్కనే గల నాంపల్లి పోలీసులు హుటాహుటిన రాగా ఫైర్ సర్వీస్ సిబ్బంది పది నిమిషాల వ్యవధిలో ఐదు యంత్రాలతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు రంగంలో దిగారు. నాలుగు గంటల పాటు శ్రమించిన తరువాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదం కారణంగా మొదటి అంతస్తులోని అన్ని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఇక్కడ కీలకమైన డాక్యుమెంట్లు, హార్డ్ డిస్కులు, ఇతర ఉ పకరణాలు, కంప్యూటర్లు పెద్ద సంఖ్యలో వుండగా మంటల ధాటికి ఇవన్నీ దహనమయ్యాయి. ఆయా పోలీసు స్టేషన్లలో నమోదైన ముఖ్యమైన కేసు ల విచారణలో ఈ పత్రాలు, హార్డ్ డిస్కులు ఎంతో ముఖ్యమైనవిగా వుండడంతో ఈ ఘటనతో ఆయా కేసుల విచారణపై ప్రభావం పడే అవకాశం వుందని వార్తలు వస్తున్నాయి. ఇదే అంతస్తులో ఎఫ్‌ఎస్‌ఎల్ పరిశోధనలో వాడే రసాయనాల మిశ్రమాలు వుండడం కూడా మంటల వ్యాప్తికి దోహద ం చేసిందని అధికారులు చెబుతున్నారు. కాగా అగ్ని ప్రమాదం తెలిసిన వెంటనే ఉత్తర మండల డిఐజి శ్వేత, ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి త మ సిబ్బందితో వెంటనే ఎఫ్‌ఎస్‌ఎల్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదంపై ఖైరతాబాద్ డిసిపి శిల్పవల్లి మీడియాతో మాట్లాడుతూ ఎఫ్‌ఎస్‌ఎల్ ప్రధాన కార్యాలయంలో సంభవించిన అగ్ని ప్రమాదం వల్ల మొదటి అంతస్తు పూర్తిగా కాలిపోయిందని, ఇందులో పోలీసు కేసుల విచారణకు సంబంధించిన కీలక డాక్యుమెంట్ల సహా అనేక ఉపకరణాలు వుంటాయని తెలిపారు. ప్రమాదం కారణంగా ఏమేరకు నష్టం సంభవించిందనేది ఇప్పుడే చెప్పలేమని ఆమె తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం లేదని ఆమె తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో రాష్ట్రంలో స ంచలనం రేపిన ఓటుకు నోటు కేసుతో పాటు ఫోన్ ట్యాపింగ్ విచారణలోని వెలుగు చూసిన ఆడియోలు, ఇతర కీలక సాక్ష్యాలు అగ్నికి ఆహుతి అ యినట్లు తెలిసింది. దీనిపై పోలీసులతో పాటు ఫైర్ సర్వీస్ అధికారులు నోరు మెదప డం లేదు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రమాదం సంభ వించిన మొదటి అంతస్తులో ఫోన్ ట్యాపింగ్‌తో పాటు అనేక కేసులకు సంబంధించిన విచారణ తాలూకు ఆధారాలు, సాక్ష్యాలు కాలిపోయాయి. అ యితే వీటి తాలుకు వివరాలు ఆయా పోలీసు స్టేషన్లలలో వుంటాయని అధికారులు చెబుతున్నారు. కాగా అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో చేరుకుని నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేయడంతో రెండవ అంతస్తు, ఆ పై భాగంలో మంటలు వ్యాప్తించకుండా నివారిం చగలిగారు. మరోవైపు ఈ ఘటనపై ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారుల ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. మరో వైపు ఫైర్ సర్వీస్, ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారులు మంటలు ఎలా చెలరేగాయనే దానిపై శాఖాపరంగా విచారణ చేబట్టారు. ఎఫ్‌ఎస్‌ఎ ల్ అధికారుల ప్రా థమిక విచారణలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగాయని తేలింది. అ యితే దీనిపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు.

**షార్ట్‌సర్క్యూట్ వల్లే మంటలు: ఫైర్ సర్వీస్ డిజి విక్రంసింగ్‌మాన్**


ఇదిలావుండగా ఎఫ్‌ఎస్‌ఎల్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి కెటిఆర్ సహా పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో కీలక పత్రాలు కాలిపోవడం వెనుక కుట్ర వుంటే వెలికి తీయాలని వారు సర్కారును కోరారు. ఈ విషయంలో అధి కారుల నిర్లక్ష్యం వుంటే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఎఫ్‌ఎస్‌ఎల్‌లో సంభవించిన అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ స ర్క్యూట్ కారణమని ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్ మాన్ తెలిపారు. దీనిపై ఆయన ఎఫ్‌ఎస్‌ఎల్ కార్యాలయం వద్ద శనివారం మీడియాతో మాట్లాడారు. తమ సిబ్బంది ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే రంగంలో దిగారని, ఐదు యంత్రాలతో నాలుగు గంటలలోపూ మంటలను అదుపు చేశారని ఆయన తెలిపారు. ఈ అంతస్తులో పోలీసు పరిశోధనలో వాడే రసాయ నాలతో పాటు మండే స్వభావం కలిగిన కొన్ని వస్తువులు వుండడం వల్ల మంటలు వేగంగా వ్యాపించాయని ఆయన తెలిపారు. ఈ ఘటనలో ఎలా ంటి ప్రాణ నష్టం జరగలేదని మాన్ తెలిపారు. 1980లో ఈ భవనం నిర్మించారని ఆయన వెల్లడించారు. ఈ ప్రమాదంపై తమ శాఖ పూర్తి స్థాయి లో విచారణ చేస్తుందని, దీంతో పాటు జంట నగరాలలో ప్రభుత్వ భవనాలలో ఫైర్ సేఫ్టీ గురించి తనిఖీలు చేబడతామని ఆయన తెలిపారు.

**గతంలో ఎఫ్‌ఎస్‌లో పేలుడు కానిస్టేబుల్ మృతి**

కాగా ఉమ్మడి ఎపిలో ఎన్టీఆర్ సిఎంగా వున్న సమయంలో 1995లో ఎఫ్‌ఎస్‌లో పేలుడు సంభవించి ఓ కానిస్టేబుల్ మరణించడం అప్పట్లో స ంచలనం రేపింది. నక్సలైట్ల నుంచి స్వాధీనం చేసుకున్న మందు పాతరలను ఒకచోట వుంచగా అవి పేలడంతో విధుల్లో వున్న గార్డు మరణించారు. ఆ సమయంలో ఇంద్రారెడ్డి హోం మంత్రిగానూ అప్పారావు పోలీసు కమిషనర్‌గానూ వున్నారు. దీనిపై విచారించిన అధికారులు కానిస్టేబుల్ సిగరేట్ కాల్చి మందు పాతరలపై వేయడం వల్ల పేలుడ జరిగిందని తేల్చారు.

**కీలక కేసుల ఎవిడెన్స్ సురక్షితమే: ఫోరెన్సిక్ డైరెక్టర్**

నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అగ్ని ప్రమాదంపై డైరెక్టర్ శిఖా గోయెల్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల అప్రమత్తతతో ప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కాగా, కేసులకు సంబంధించి ప్రాపర్టీ,ఎఫ్‌ఎస్‌ఎల్‌కు చెందిన సామాగ్రి సురక్షితంగానే ఉందని పేర్కొన్నారు. ఘటనకు కారణాలను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతుందని,తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు.




# ఆకాశంలో అద్భుతం..

## ఒకే సరళరేఖపైకి ఆరు గ్రహాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ఆకాశంలో అద్భుత దృశ్యం కనిపించబోతోంది. 6 గ్రహాలు దాదాపుగా ఒకే సరళరేఖపై ఉన్నట్లుగా ఆకాశంలో కనువిందు చేయనున్నాయి. ఇప్పటి నుంచి ఈ నెలాఖరు వరకు బుధుడు, శుక్రుడు, గురుడు, శని, యూరేనస్, నెప్ట్యూన్ గ్రహాలు ఆకాశంలో ఒకే భాగంలో కనిపిస్తాయి. ఈ గ్రహాల్లో కొన్ని ఎలాంటి పరికరాలు లేకుండా కనిపిస్తే, మరికొన్నింటిని బైనాక్యులర్లు, టెలిస్కోప్‌ల సహాయంతో చూడవచ్చు. నిజానికి ఇవన్నీ ఒకే వరసలో ఉండవు, వాటి వాటి కక్ష్యల్లో తిరుగుతుంటాయి. కొన్ని సమయాల్లో భూమి నుంచి చూసినప్పుడు వరసగా ఉన్నట్లు కనిపిస్తాయి. తవ్వకాలలో బయటపడ్డ 150 యేళ్ల నాటి వైన్ బాటిల్.. టేస్ట్ చూసిన నిపుణులు చివరకు ఈ ఖగోళ దృశ్యాన్ని చూడటానికి ఫిబ్రవరి 28 సరైన రోజుగా నాసా చెబుతోంది. సూర్యాస్తమయం తర్వాత బుధుడు, శుక్రుడు కొద్దిగా కనిపిస్తారు. శని సూర్యాస్తమ దిశలో తక్కువ ఎత్తులో కనిపిస్తుంది. అదే సమయంలో పౌర్ణమి చంద్రుడు కూడా ఆకాశంలో కనిపిస్తుండటంతో మొత్తం దృశ్యం చాలా అందంగా కనిపించబోతోంది. శుక్రుడు చాలా ప్రకాశవంతంగా ఉండటంతో అతి సులభంగా చూడవచ్చు. బుధుడు శుక్రుడిపైన కొంతసేపు మాత్రమే ఉంటాడు. గురుడు తూర్పు దిశలో రాత్రంతా ప్రకాశవంతంగా కనిపిస్తాడు. శని దక్షిణ పడమర దిశలో, యూరేనస్ గురుడు శని మధ్యలో ఉంటుంది. దీనిని బైనాక్యులర్లతో చూడొచ్చు. నెప్ట్యూన్ శనికి దగ్గరగా ఉంటుంది. దీనిని టెలిస్కోప్‌తో మాత్రమే చూడవచ్చు.

# ఎస్‌పిఎఫ్ పోలీసులకు ఎస్‌బిఐ బంపర్ ఆఫర్

## బ్యాంకు ఖాతాలు కలిగి ఉంటే కోటి రూపాయల ప్రమాద బీమా సహా అనేక సదుపాయాలు

## ఎస్‌పిఎఫ్ అదనపు డిజి స్వాతిలక్రా, ఎస్‌బిఐ డిజిఎం నీలాక్షిసింగ్ మధ్య ఎంఒయు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్) పోలీసులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) బంపర్ ఆఫ ర్ ప్రకటించింది. ఈ విభాగంలో పనిచేస్తున్న 1900 మందికి పైగా అధికారులు, సిబ్బంది తమ బ్యాంకులో ఖాతాలు నిర్వహించుకుంటే కోటి రూపా యల బీమా సౌకర్యంతో పాటు, విమాన ప్రమాదంలో మరణిస్తే కోటి 60 లక్షల రూపాయల బీమా వర్తించేలా చూడడం, ఇతరత్రా అనేక వెసులు బాట్లు కల్పించేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి ఎస్‌పిఎఫ్ అదనపు డిజి స్వాతి లక్రా, ఎస్‌బిఐ డిజిఎం నీలాక్షి సింగ్‌ల మధ్య శనివా రం ఎంఒయు కుదిరింది, బుద్ధభవన్‌లోని ఎస్‌పిఎఫ్ ప్రధాన కార్యలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ఎంఒయు కుదిరింది. ఈ సందర్భంగా ఎస్‌పిఎఫ్ అదనపు డిజి స్వాతి లక్రా మాట్లాడుతూ ఎస్‌బిఐ అధికారులు నిస్వార్థంగా ముందుకు రావడం సంతోషంగా వుందని తెలిపారు.

కేవలం బ్యాంకు ఖాతా కలిగివుంటే తమ సిబ్బందికి అపరిమిత ప్రయోజనాలు సమకూరడం ఆనందంగా వుందని ఆమె అన్నారు. ఇందుకుగానూ ఆమె ఎస్ బిఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ బిఐ డిజిఎం నీలాక్షి సింగ్ మాట్లాడుతూ పోలీసుల సేవలను గుర్తించి వారి కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నా మని తెలిపారు.

తమ బ్యాంకులో ఖాతా కలిగిన ఎస్‌పిఎఫ్ సిబ్బందికి కోటి రూపాయల ప్రమాద బీ మాతో పాటు కోటి 60 లక్షల విమాన ప్రమా ద బీమా కల్పిస్తున్నామని తెలిపారు.

శాశ్వత, పాక్షిక అంగ వైకల్యం సంభవిస్తే 80 లక్షల రూపాయల బీమా వుంటుందని, జిటిఎల్ కింద పది లక్ష ల బీమా వసతి వుంటుం దని, పిల్లలకు విద్య కోసం రుణ వెసులుబాటుతో పాట వీరికి ప్రమాద బీమా వుంటుందని ఆమె తెలిపారు. ఉన్నత విద్య చదివే పిల్లలకు (18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వరకు) ఒకరికి పది లక్షల వరకు పిఎఐ కింద సహాయం అందిస్తామని ఆమె తెలిపారు.

అమ్మాయిలకు వివాహం కోసం సహాయం అందిస్తామని, వీరికి కూడా ప్రమద బీమా వుంటుందని ఆమె తెలిపారు.



ఎస్‌పిఎఫ్ సిబ్బందికి ప్రయోజనాలు కలిగించే ఎంఒయుపై సంతకాలు చేసిన తరువాత పత్రాలు మార్చుకుంటున్న ఎస్‌పిఎఫ్ అదనపు డిజి స్వాతి లక్రా, ఎస్‌బిఐ డిజిఎం నీలాక్షిసింగ్. చిత్రంలో ఎస్‌పిఎఫ్‌తోపాటు ఎస్‌బిఐ అధికారులు

ఎస్‌పిఎఫ్ సిబ్బంది ప్రమాదానికి గురైతే వైద్య స హాయానికి సంబంధించి అనేక వెసులుబాట్లు, ఆర్థిక సమాయ ప్యాకేజిలు అమలు చేస్తామని డిజిఎం తెలిపారు. దీంతో పాటు రుణ సదుపాయం, లాకర్ల ఏర్పాటులో రాయితీ వుంటుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌పిఎఫ్, ఎస్‌బిఐ అధికారులు పలువురు పాల్గొన్నారు.

# నేడు లాసెట్, పిజి లాసెట్-2026 నోటిఫికేషన్ జారీ

## 10 నుంచి దరఖాస్తుల స్వీకరణ

## మే 18న పరీక్ష.. జూన్ 5న ఫలితాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2026కి సంబంధించిన నోటిఫికేషన్ నేడు(ఆదివారం) వెలువడనుంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఎల్ఎల్ఎంలో చేరడానికి నిర్వహించే పీజీ లాసెట్-2026 దరఖాస్తులను కూడా ఈ నెల 10 నుంచే ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. నేడు నోటిఫికేషన్‌ను జారీ చేయనుండగా.. ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 13 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు. మే 3 నుంచి 8 వరకు దరఖాస్తుల్లో ఉన్న తప్పులను సరిచేసుకోవడానికి ఎడిట్ సౌకర్యం కల్పించారు. మే 12 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మే 18న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, తిరిగి 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 3 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు 5 సంవత్సరాల లా కోర్సుతోపాటు, ఎల్ఎల్ఎంలో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు.

మే 23న ప్రాథమిక కీని విడుదల చేసానతరు. మే 25 వరకు ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. జూన్ 5న ఫలితలను వెల్లడించనున్నట్టు లాసెట్, పీజీ లాసెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లా సెట్‌కి దరఖాస్తు ఫీజును రూ. 900గా నిర్ణయించగా, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 600గా నిర్ణయించారు. ఇక పీజీ లాసెట్ ఫీజును రూ 1100గా నిర్ణయించగా.. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 900గా నిర్ణయించారు.

# అసెంబ్లీ, మండలిని సందర్శించిన బీహార్ యువకులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 7:** బీహార్ రాష్ట్రానికి చెందిన యువకులు శనివారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ శాసన సభ, శాసన మండలి సమావేశ మందిరాలను వారు సందర్శించడం జరిగింది. అనంతరం తెలంగాణ శాసన మండలి చైర్మన్‌తో గ్రూప్ ఫోటో దిగారు. ఈ నెల 3 తేదీ నుండి 7 తేదీ వరకు మేర యువ భారత్,రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో "ఇంటర్ స్టేట్ యూత్ ఎక్చేంజ్ ప్రోగ్రాం జరిగింది. తదనంతరం వారు తెలంగాణ లేజిస్లేచర్ సందర్శనకు వచ్చారు. బీహార్ యువతతో మాట ముచ్చట సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ యువతనే దేశానికి వెన్నెముక అన్నారు. యువత తమ కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహిస్తే , దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. చేడు మార్గంలో యువత నడవకుండా, చేడు అలవాట్లకు దూరంగా ఉండలన్నారు. దేశ సేవయే యువత నిజమైన కర్తవ్యం అని మనస్ఫూర్తిగా నమ్ముతున్నట్లు ఆయన తెలిపారు. మరింత బలమైన, ఐక్యమైన అభివృద్ధి చెందిన భారతదేశం కోసం మనమందరం కృషి చేయాలని ఆయన చెప్పారు. ప్రపంచంలో ఏ దేశానికి లేని యువ సంపద మన భారతదేశానికి ఉందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు.

# రాష్ట్రంలో 66 లక్షల ఎకరాలకు చేరిన యాసంగి

## అత్యధికంగా 48 లక్షల ఎకరాల్లో వరి నాట్లు

## అతితక్కువగా ఆసిఫాబాద్‌లో 1,700 ఎకరాల్లో సాగు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి పంటల సాగు జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకూ 96 శాతం మేర 66.05 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి సాగైన విస్తీర్ణం కన్నా ఈ సారి దాదాపు 5 లక్షల ఎకరాలు ఎక్కువ. గత యాసంగి సీజనులో ఫిబ్రవరి 6వ తేదీ నాటికి 61.17 లక్షల ఎకరాలు చొప్పున అన్ని పంటలు సాగయ్యాయి. ఇక ఈ యాసంగిలో సాగైన మొత్తం పంటల్లో వరిదే అగ్రస్థానం. ఇప్పటి వరకూ అత్యధికంగా 93 శాతం మేర 47.94 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. గత ఏడాది ఇదే కాలనికి 46.73 లక్షల ఎకరాలు సాగవ్వగా, ఈ సారి అంతకాన్నా ఎక్కువగ సాగు కావడం విశేషం. ఇక వరి, మొక్కజొన్న, కంది, జొన్న, పెసర తదితర మొత్తంగా ఆహార పంటల సాగు 63.37 లక్షల ఎకరాలకు చేరింది. ఇందులో మొక్కజొన్న 10.84 లక్షల ఎకరాలు కాగా, జొన్న 2.31 లక్షల ఎకరాల్లోను, శనగలు 1.80 లక్షల ఎకాల్లోను, మినుములు 35 వేల ఎకరాల్లో సాగయ్యాయి. వీటితో పాటు, వేరుశెనగ 1.84 లక్షల ఎకరాల్లోను, సన్‌ఫ్లవర్ 14 వేల ఎకరాల్లో వేయగా, వాణిజ్య పంటలైన చెరకు 16 వేల ఎకరాలు, పొగాకు 11 వేల ఎకరాలకు పరిమితమైంది. ఇక రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5.63 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, అతి తక్కువగా ఆసిఫాబాద్ జిల్లాలో 14 శాతం మేర 1,700 ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది.

## ప్రమాదవశాత్తు మరణించిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు

# రూ. కోటి ఉచిత ప్రమాద బీమా

## ఉద్యోగులకు అండగా ఉంటాం : సంస్థ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో విషాదం అలుముకున్న కుటుంబానికి టిజిఎస్ఆర్‌టిసి అండగా నిలిచింది. వివిధ సమయాలలో విధి వంచించి అకాల మృత్యువు వెంటాడిన ఇద్దరు డ్రైవర్స్ కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించింది. కుషాయిగూడ, ఉప్పల్ డిపోలకు చెందిన డ్రైవర్స్ వెంకటేశ్, డి.ఆర్.గౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇంటికి పెద్ద దిక్కు మృతి చెందడంతో బాధిత డ్రైవర్ల కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి. ఈ ఆపద సమయంలో యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ బాధిత కుటుంబాలకు అక్కరకొచ్చింది. ఆర్థిక ప్రయోజనంతో కూడిన సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కలిగి ఉండటంతో ఉచిత ప్రమాద బీమా పథకం వర్తించింది. ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌక ర్యం ఉండటంతో ఉద్యోగులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. ప్రమాదాలు జరిగిన సమయంలో సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కింద యూబీఐ రూ. కోటి అందజేస్తోంది. ఈ మేరకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ. కోటి విలువైన చెక్కులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇ.డి అమ్రేష్ ప్రసాద్, ఆర్‌టిసి విసి అండ్ ఎండి వై.నాగిరెడ్డి శనివారం బస్‌భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. వేరువేరు సమయాలలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో కుషాయిగూడ డిపో, ఉప్పల్ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు మరణిం చడం విచారకరమన్నారు. తమ తప్పు ఏమీ లేకపోయినా రోడ్డు ప్రమాదంలో డ్రైవర్స్ అకాల మరణం చెందటం దురదృష్టకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పోషణలో పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబ సభ్యులకు సంస్థ అండగా నిలుస్తుందని, ఆత్మ స్థైర్యం, ధైర్యం కోల్పోకుండా ఉండేందుకు బాధిత కుటుంబానికి ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఎంతో ఉపక రిస్తుందన్నారు. కొన్ని పథకాలు ఆపద సమ యంలో అక్కరకు వస్తాయని, ఇందుకు ఇదే ఉదా హరణ అని, వాటిని వినియోగించు కోవడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అల సత్వం వహించ కూడదని సూచించారు. ఈ అవకాశాన్ని కల్పించిన యూబీఐకి ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, ఫైనాన్స్ అడ్వైజర్ పుష్పకుమారి, సీపీఎం ఉషాదేవి, యూబీఐ అధికారులు చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. రవీంద్రబాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.భాస్కర్, ఆర్.సత్యనారాయణ, గోపాలకృష్ణ, రజనీష్‌కుమార్‌పాండే పాల్గొన్నారు.


చైనా మాంజాకు చిక్కి విలవిల్లాడిన పక్షిని కాపాడిన పోలీసులు

# చైనా మాంజాకు చిక్కి విలవిల్లాడిన పక్షిరాజు.. కాపాడిన పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో నిత్యం బిజీగా వుండే పోలీసులు ఆపదలో వున్న ఓ ముగజీవి పట్ల స్పందించి దానిని కాపాడి ప్రాణం పోసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. నిషేధిత చైనా మాంజా కారణంగా ఒక్క హైదరాబాద్‌లోనే అనేక మంది ప్రాణాలు కోల్పో వడం తెలిసిందే. పక్షుల సంగతి సరేసరి. అయితే కొన్ని సందర్భాలలో పోలీసులతో పాటు సామాన్యులు వీటిని గమనించిన సందర్భాలలో కాపా డిన ఉదంతాలున్నాయి. ఇలాంటిదే బేగంపేట్‌లో జరిగింది. బేగంపేట్ పోలీసు లైన్స్ ప్రాంతంలో ఓ చెట్టుకు గాలిపటం చిక్కుకోగా దానికి చైనా మా ంజా చాలా వరకు వుంది.

సరిగ్గా ఈ మాంజా వున్న కొమ్మకు ఓ గద్ద చిక్కుకుని ఎగరలేక విలవిలలాడడం ట్రాఫిక్ పోలీసులు గమనించారు. దీనిపై వారు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసన వెంటనే అదనపు డిసిపి లక్ష్మి, ఎసిపి శంకర్ రాజు వెంటనే స్పం దించారు. ట్రాఫిక్ సిబ్బంది సహాయంతో ఓ కర్రను తీసుకువచ్చి మొదట చైనా మాంజాను కొంతమేర తొలగించారు. అనంతరం జాగ్రత్తగా గద్ద ప క్షిని కిందకు దించి సపర్యలు చేసి మంచి నీరు, ఆహారం అందించి విడిచి పెట్టగా అది రివ్వున ఎగిరిపోయింది. ఇదంతా అక్కడ వున్న వారు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో ఉంచగా ఇది వైరల్‌గా మారింది. పోలీసులు ఓ పక్షిని కాపాడడాన్ని జంతు ప్రేమికులు అభినం దించారు. కాగా దీనిపై ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. చైనా మాంజా విషయంలో ప్రజలు ఇకనైనా ఆలోచించాలని కోరారు.



# పూర్ణియా ఎంపి పప్పుయాదవ్ అరెస్టు

**పాట్నా, ఫిబ్రవరి 7:** పూర్ణియా పార్లమెంటు సభ్యుడు పప్పూ యాదవ్‌ను పాట్నా పోలీసులు ఆయన నివాసంలో అరెస్టు చేశారు. 1995 నాటి వివాదాస్పద భూముల కేసులో ఈ అరెస్టు జరిగింది. పాత ఐపీసీ (ప్రస్తుతం భారతీయ న్యాయ సంహిత) సెక్షన్లు 419, 420, 468, 448, 506, 120బీ కింద ఆయనపై గర్దానీబాగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు పాట్నా ఎస్‌పీ భానుప్రతాప్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ జరుగుతోందని, షెడ్యూల్ తేదీకి కోర్టు ముందు హాజరుకావడంలో ఎంపీ విఫలమయ్యారని, దీంతో ఈ అరెస్టు జరిగిందని చెప్పారు. పప్పూయాదవ్‌కు వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు, ఒక కేర్‌టేకర్‌ను కూడా అనుమతించినట్టు సింగ్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టు ముందు హాజరుపరుస్తామని చెప్పారు. ఆరుసార్లు ఎంపీగా ఉన్న రాజేష్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో పూర్ణియా నియోజకవర్గం నుంచి గెలుపొందారు. పప్పూయాదవ్ అరెస్టును లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి, పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఖండించారు. నితీశ్ కుమార్ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. న్యాయం కోసం నిలబడే పప్పూ యాదవ్‌ను రాజకీయ కక్షతోనే అరెస్టు చేసినట్టు రాహుల్ ఆరోపించారు. నీట్ అభ్యర్థిని అనుమానాస్పద మృతిపై న్యాయం అడిగినందుకే ఆయన అరెస్టు జరిగిందన్నారు.

# ఘనంగా 'సురక్ష ఆన్‌లైన్ డైలీ' వంద రోజుల వేడుక

## డిజిపి శివధర్‌రెడ్డిసహా ఉన్నతాధికారులు హాజరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖ మాసపత్రిక సురక్ష ఆన్‌లైన్ డైలీగా ప్రారంభమై వంద రోజులు పూర్తయిన సందర్భంగా డిజిపి కార్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు సురక్ష చీఫ్ ఎడిటర్, డిజిపి శివధర్ రెడ్డితో పాటు ఎడిటర్‌గా వున్న సైబరాబాద్ కమిషనర్ ఎం.రమేష్, పి అండ్ ఎల్ ఐజి గజారావు భూపాల్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి శివ ధర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖలో సురక్ష ఒక మైలురాయిగా అభివర్ణించారు. పోలీసు సిబ్బందికి ఈ పత్రిక ఇంతకాలం మాస పత్రికగానే వుండేదని, ఇప్పుడు ఆన్‌లైన్ డైలీగా ఏర్పాటయ్యాక నిత్యం అందరికి ఉపకరిస్తుందని తెలిపారు. సురక్ష పత్రిక నిర్వహణలో ఎడిటర్‌గా వున్న సైబరాబా ద్ కమిషనర్ ఎం.రమేష్ ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు. ఆన్‌లైన్ డైలీని తాను ప్రారంభించానని, వంద రోజుల వేడుకకు కూడా తానే ముఖ్య అతిథిగా హాజరవడం సంతోషంగా వుందని డిజిపి తెలిపారు. సురక్ష పత్రికలో అనేక విషయాలను పొందుపరచడం జరుగుతుందని, రాబో యే రోజుల్లో దీనిని మరింత పటిష్టం చేయాల్సి న అవసరం వుందని ఆయన అన్నారు. దశాబ్దాల అనుభవం వున్న విశ్రాంత పోలీసు అధికారుల అ నుభవం, సలహాలను ఇందులో ప్రచురిస్తున్నామని, పోలీసు శాఖలో కొత్తగా వస్తున్న యువ పోలీసులకు ఇవి దిక్సూచిలా వుంటాయని ఆయన తెలి పారు. సురక్ష ఎడిటర్ ఎం. రమేష్ మాట్లాడుతూ అందరు సిబ్బంది సహకారం వల్లే డైలీ ఆన్‌లైన్ ఎడిషన్ చక్కగా నడుస్తోందని తెలిపారు. త్వరలో నే సురక్షను సాధారణ దిన పత్రికల తరహాలో అన్ని హంగులతో పూర్తిస్థాయి పత్రికగా తీర్చిదిద్దాల్సి వుందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో సురక్ష ఆన్‌లైన్ ఎడిషన్ రూపకల్పనలో సహకరించిన జర్నలిస్టులు శ్రీనివాస్ సహా ఆయా జిల్లాలలోని పిఆర్‌ఓలను డిజిపి శివధర్ రెడ్డి సన్మానించారు.


సురక్ష ఆన్‌లైన్ డైలీ వంద రోజుల వేడుకలో పాల్గొన్న చీఫ్ ఎడిటర్, డిజిపి శివధర్‌రెడ్డి, ఎడిటర్‌గా ఉన్న సైబరాబాద్ కమిషనర్ ఎం.రమేష్. చిత్రంలో పిఅండ్ఎల్ ఐజి గజారావు భూపాల్‌సహా ఇతర అధికారులు

# 11న సెలవు ఇవ్వాలి: ఎస్ఇసి ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 7:** మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ రోజైన ఫిబ్రవరి 11న స్థానిక సెలవు ప్రకటించాలని స్టేట్ ఎలక్షన్ కమిషన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు,స్థానిక సంస్థలు,ప్రభుత్వ,ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని తెలిపింది. ప్రైవేట్ పరిశ్రమలకూ సెలవు ఇవ్వాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ఆటంకం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సెలవు ప్రకటిస్తున్నట్లు ఎస్ఈసీ వెల్లడించింది.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# దేశంలో కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్

## ప్రజల సంతోషాన్ని ఓర్వలేని బిఆర్ఎస్ నాయకులు

## కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** దేశంలోనే మొట్ట మొదటి సారి కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం రోజున సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కులగణన చేపట్టబోతుందన్నారు. ఎస్సీ ల జీవితకాల కోరిక అయిన ఏ,బి,సి,డి ల వర్గీకరణ చేసి చూపించామని వెల్లడించారు. 13 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సన్న బియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఏకైక తెలంగాణ ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజల సంతోషాన్ని బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని అక్కసుతో, అసూయతో, అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టె ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డా రు. కంటోన్మెంట్, జూబ్లీ హిల్స్, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పని అయిపోయిందన్నారని, ప్రచారాలు చేశారు

కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారన్నారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్ని కల్లో కూడా వారు కారు కూతలు కూస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల్లో వంద శాతం కాంగ్రెస్ పార్టీ గెలువబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పని చేసే ప్రభుత్వం తమదని, గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోనే పదేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రైతాంగం, పేద ప్రజలు, నిరుద్యో గులు సంతోషంగా ఉంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వ లేక పోతున్నరన్నారు. ఎవరెన్ని విమ ర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఆదరదు, బెదరదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిలో సహకరించక పోయిన తల తాకట్టు పెట్టయిన అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమం నీళ్ల, నిధులు, నియామకాల కోసం జరిగిందని గుర్తు చేస్తూ, కేవలం రెండు సంవత్సరాల్లోనే 75 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందని, పంజాబ్‌ను అధిగమించి పంటల ఉత్పత్తిలో ముందంజలో ఉందన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం తమదేఅని, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. రైతు భరోసా అమలు చేస్తున్నామని, రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశామని వెల్లడించారు.

రూ.22 వేల కోట్లతో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, చేనేత కార్మికుల రుణమాఫీ కూడా పూర్తిచేశామని తెలిపారు. గతంలో కంటోన్మెంట్‌లో బుద్ధి చెప్తాం' అన్నవారికి ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించారని, జూబ్లీహిల్స్‌లో 25 వేల మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చిన మనోధైర్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి ఉచిత విద్యుత్, సబ్సిడీలు అందిస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా ముందుకెళ్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# అత్యధిక మున్సిపాలిటీలు గెలుస్తాం

## మూడు నుంచి నాలుగు కార్పొరేషన్లు బిజెపివే

## పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్‌పాటిల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మున్సిపాలిటీలను గెలుచుకోబోతోందని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి బీజేపీ అంటే భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. అందుకే అనేక చోట్ల బీజేపీ నేతలను, అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ బెదిరించే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ అభ్యర్థులకు పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

మున్సిపల్ ఎన్నికల్లో 60కి పైగా సీట్లు గెలుస్తామన్నారు. ఏడు కార్పోరేషన్లలో 3 నుంచి నాలుగు స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనూ బీజేపీ హవా కొనసాగుతోందన్నారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల కార్పోరేషన్లలో గెలుపు బీజేపీదేనని తేల్చి చెప్పారు.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి, తెలుగు దేశంతో జతకట్టి కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న జనసేన ఇప్పుడు తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తుంది. పంచలాది వార్డుల్లో బిజెపి, జనసేన పార్టీలకు చెందిన అభ్యర్థులు విడి విడిగా పోటీలో ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాల్టీలో మొత్తం వార్డులు 49ఉండగా, వీటిల్లో బిజెపి అభ్యర్థులు 49మంది పోటీచేస్తుండగా, మరో 10 మంది జనసేన అభ్యర్థులు కూడా రంగంలోఉన్నారు. అలాగే కొత్తగూడెంలో 60 వార్డులకు 54 మంది బిజెపి, 14 మంది జనసేన అభ్యర్థులు, మెట్‌పల్లిలో 26 స్థానాలకు 26మంది బిజెపి,12మంది జనసేన, రాయికల్‌లో 12 స్థానాలకు 12 మంది బిజెపి, 5 గురు జనసేన, గద్వాలలో 37 వార్డులకు 36 మంది బిజెపి, 7గురు జనసేన, కామారెడ్డిలో 49 స్థానాల్లో 48 మంది బిజెపి, 7గురు జనసేన, జమ్మికుంటలో 30 స్థానాల్లో30మంది బిజెపి,12మంది జనసేన, కరీంనగర్‌లో 66వార్డులకు 66మంది బిజెపి, 14మంది జనసేన, మహబూబ్‌నగర్‌లో 60 స్థానాలకు 52మంది బిజెపి,18మంది జనసేన,రామగుండంలో 60స్థానాలకు 56మంది బిజెపి, 11మంది జనసేన, సిరిసిల్ల మున్సిపాల్టీలో 39వార్డులకు గాను39మంది బిజెపి అభ్యర్థులు, మరో7గురు జనసేన పార్టీ అభ్యర్థులు పోటీలోఉన్నారు.మరోవైపు చాలావార్డుల్లో ముఖ్యంగా మైనార్టీలు అధి కంగా ఉండే భైంసా, బోధన్, జహీరాబాద్, వికారాబాద్ లాంటి అనేక మున్సిపాలిటీల్లోని వార్డుల్లో రెండు పార్టీల అభ్యర్థులు బరిలో లేకపోవడం గమనార్హం. రెండు పార్టీల తర పున జనసేన చీఫ్ పవన్‌కళ్యాణ్ ప్రచారంలో కి దిగుతారని బిజెపి భావించినప్పటికి అనివార్య కారణాల వల్లపవన్ కళ్యాణ్ తెలంగాణలో ఎన్నికలప్రచారాన్ని రద్దు చేసుకున్నట్లు సమాచారం.బిజెపి మాత్రం జనసేనను పట్టించుకోకుండాఎన్నికల ప్రచార పర్వంలోవేగం పెంచుతోంది.

# తెలంగాణలో జోరుగా మున్సిపల్ పోరు

**డాక్టర్ వై.నాగేశ్వరరావు**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు 11వ తేదీన పోలింగ్ జరగనుండటంతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీల ప్రచార హోరు పెరిగింది. గడువు సమయంలో నామినేషన్ల ఉపసంహరణ కోసం అనేక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బుజ్జగింపులు, అలకలు, తోపులాటలు, ధిక్కరణలు, బెదిరింపుల పరిస్థితి నెలకొంది. అయితే ప్రధాన పార్టీలకూ తిరుగుబాట్ల బెడద తప్పలేదు. ఉపసంహరణకు మొరాయించిన కొంతమంది స్వతంత్రులుగానే పోటీలో మిగిలారు. 2,996 వార్డులకు 12,994 మంది పోటీలో నిలవగా అందులో 14 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్క్రూట్నీ తర్వాత 19,657 అభ్యర్థిత్వాలు ఖరారు కాగా, అందులో నుంచి 6,714 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో ఒకే వార్డుకు ఒకే పార్టీ నుంచి నలుగురైదుగురు పోటీ పడటంతో అనేక చోట్ల నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇవన్నీ పట్టించుకోకుండా బిఫారాలు పొందిన అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల అగ్రనేతలు ప్రచారాన్ని స్పీడ్ పెంచారు. మున్సిపల్, నగర పాలక సంస్థల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉందని మరింత కష్టపడాలని పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లేముందు మంత్రులతో సమావేశం నిర్వహించారు. వివిధ సర్వేలను ముందు పెట్టుకుని సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి కొన్ని మున్సిపాలిటీల్లో తప్ప అన్ని చోట్లపార్టీకి సానుకూల వాతావరణం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇంఛార్జిలు నియోజక వర్గాల్లోనే ఉండాలని ప్రతిరోజు నియోజక వర్గంలోని రాజకీయ పరిణామాలపై తనకు నివేదించాలని సీఎం స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు చెందిన సర్వేలను ముందు పెట్టుకుని పార్లమెంటు నియోజక వర్గాల వారీగా సమీక్ష చేసింది.

మెజారిటీ మున్సిపాలిటీల్లో, నగర పాలక సంస్థల్లో అధికార కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉన్నట్లు సర్వేల గణాంకాలు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అయితే సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను విశ్లేషించిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు సూచించారు. అక్కడ సీనియర్ నాయకులను ఇంఛార్జీలుగా నియమించి పర్యవేక్షణ చేస్తున్నారు. పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోని మున్సి




పాలిటీలు, నగర పాలక సంస్థల గెలుపు బాధ్యత ఇంఛార్జిలదేనని సీఎం, పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నేతలదేనని స్పష్టంచేశారు. పాత కొత్త నేతల సమన్వయంతో సమష్టిగా పనిచేయాలని సూచించిన సీఎం ఎప్పటికప్పుడు ఇంఛార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని పీసీసీకి సూచించారు. రోజువారీగా రివ్యూ తనకు అందించాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో 90శాతం స్థానాలు తమ పార్టీ గెలుస్తుందని, తమకు పోటీ దారులే లేరని పీసీసీ చీఫ్ వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 14 స్థానాల్లో ఏకగ్రీవాలు చోటు చేసుకోగా, అందులో 12కాంగ్రెస్‌కు దక్కాయి. రెండు స్థానాలు బీఆర్ఎస్‌కు దక్కినప్పటికీ అందులో ఒకరు ఉదయం ఏకగ్రీవంగాగెలిచి సాయంత్రం కాంగ్రెస్‌లో చేరిపోయారు. జగిత్యాల నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు రాజకీయ దుమారం రేపింది. జగిత్యాలలో మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వర్గానికి 20, స్థానిక ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులకు 30 టికెట్లు కొట్టాని పార్టీ అధిష్టానం చేసింది. దీన్ని తప్పుబడుతూ జీవన్‌రెడ్డి వర్గీయులు స్థానిక ఇందిరాభవన్ వద్ద నిరసనలు చేశారు. తమ మెడ కోసినంత పని చేశారని జీవన్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తుది జాబితాలోనూ మార్పులు చేశారని కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పార్టీలో పని చేసినవాళ్లకు, ఏళ్లతరబడి జెండా మోసిన వారికి కాకుండా బీఆర్ఎస్ వాళ్లకు ఎమ్మెల్యే కాంగ్రెస్ టికెట్లు పంచుకున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో తమకు టికెట్ ఇవ్వలేదని బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు అభ్యర్థులు వారి మద్దతుదారులతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. చొప్పదండిలో బీఆర్ఎస్‌కు చెందిన కల్లెపల్లి మహేశ్ కోమలత దంపతులు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటి ఎదుట పురుగు మందు డబ్బాతో వచ్చితమకు టికెట్ ఇస్తానని మోసం చేశారని నిరసన తెలిపారు. పార్టీ టికెట్ వస్తుందని నమ్మి నామినేషన్ వేసిన వారు చివరి నిమిషంలో బీఫారం అందకపోవడంతో నిరసనలకు దిగారు. కొంతమంది తమకు అన్యాయం జరిగిందని కంటతడి పెట్టగా, మరి కొంతమంది పార్టీలకు రాజీనామా చేశారు. మొత్తంగా భారీ సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతుండటంతో వారిని సర్దిచెప్పడం అగ్రనాయకులకు తలనొప్పిగా మారింది. కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీల నాయకులు హైదరాబాద్‌లోని కార్యాలయాల నుంచి నామినేషన్ల ఉపసంహరణ లేదా బుజ్జగింపుల ప్రక్రియను పర్యవేక్షించారు. పార్టీ అభ్యర్థులను విరుద్ధంగా ఎవరైనా బరిలో ఉంటే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని బిజెపి రాష్ట్రఅధ్యక్షుడురామచందర్ రావు రెబల్స్ అభ్యర్థులను తీవ్రంగా హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి కూడా ఇలానే హెచ్చరించారు. కాగా, 6గ్యారెంటీల అమలులో కాంగ్రెస్‌ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ప్రచారం ఎక్కుపెడుతోంది. గత పాలనలో చేసిన అభివృద్ధిని చెబుతూ ప్రజల ఆదరణతో గెలవాలని ఆపార్టీ చూస్తోంది. ఇప్పుడు నిరుద్యోగం ప్రబలిందని, ప్రాజెక్టులు ముందుకు సాగడంలేదని చెబుతున్నారు.మున్సిపల్ ఛైర్మన్,కార్పొరేషన్ మేయర్‌పీఠాలే లక్ష్యంగా నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. హరీశ్‌రావు,కెటిఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో జోరుగా తిరుగుతున్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ అన్నిరంగాల్లో విఫలమైందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయలేదని విమర్శిస్తూ తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వ్యూహరచన చేసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చలేదని బాకీ కార్డు పేరుతో ఇంటింటికి ప్రచారం చేయడంలో బిజెపి ఉంది. కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా నియమించిన ఇన్‌ఛార్జులు,జిల్లాఅధ్యక్షులు, ఎమ్మెల్యేలు ప్రచారం లో ముమ్మురంగా పాల్గొంటున్నారు. ఎన్నికల బాధ్యులుగా ఉన్నవారికి దిశానిర్దేశం చేయడం ద్వారా ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలనే ప్రయత్నాల్లో పార్టీఉంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు కీలక హామీలను మేనిఫెస్టోలో బిజెపిపొందు పరి చింది. వారంగల్‌జుల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, జన్మ దవాఖానాలు, స్మార్ట్‌సిటీలుగా అభివృద్ధి, క్లీన్ సిటీ, గ్రీన్‌టౌన్, 100 శాతం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, దేవాలయాల రక్షణ, మహిళల రక్షణ అంశాలను చేర్చారు. మున్సిపాలిటీల్లో దోమలు, పందులు, కుక్కలు, కోతుల బెడద నివారణ హామీలను సైతంచేర్చారు.సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం బిజెపి మేనిఫెస్టో అన్న నినాదంతో కమలదళం ముందుకు వెళుతోంది. తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయజెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉంది. 60 శాతానికిపైగా మున్సిపాలిటీలు, కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గెట్‌గా పెట్టుకుంది.ఇందుకోసం స్థానిక ఎంపీలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్షేత్రస్థాయిలో మోహరించి చారు.బీజేపీ యువమోర్చాకు ఈఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర నాయ కత్వం ప్రత్యేక టాస్క్ ఇచ్చింది. జెనెజ్ టార్గెట్‌గా ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేసింది. ఢిల్లీ నేతలను మోహరించి గల్లీలో జెండా పాతేందుకు వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఆ దిశగా మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ విడుదల చేసింది. రాష్ట్రంలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన, బిజెపి అభ్యర్థులు ఒకరిపై ఒకరు ప్రత్యర్థులుగా పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ రెండు పార్టీల మధ్య అవగాహనపై సందిగ్ధత నెలకొన్నది. ఇది తమ విజయావకాశాలపై ప్రభావం చూపుతుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ●

స్వదేశం

మణిపూర్

# అ'శాంతి' పర్వం!

**ఎ.వి.వి ప్రసాద్**

మణిపూర్‌లో శాంతియుత పరిస్థితులు ఏర్పడినట్లేనా? ఈ ప్రశ్నకు సమాధానం అంతతేలికగా దొరకదు. యేడాది పాటు'సాగిన' రాష్ట్రపతి పాలనకు స్వస్తి పలికి గతవారం ప్రజాస్వామ్య బద్ధమైన ప్రభుత్వం ఏర్పడింది.'సాంకేతికం'గా కొత్త ప్రభుత్వం ఏర్పడక తప్పని పరిస్థితి గనుక ఆ ఏర్పాటు జరిగి ఉంటుంది.కానీ అంత మాత్రాన అక్కడ రగులుతున్న 'తెగ'సెగలు చల్లారాయని కూడా చెప్పలేని పరిస్థితే కనిపిస్తోంది. గతంలో బీరేన్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రం ఎలా రావణ కాష్ఠమయిందో ఇప్పటికీ అలాగే ఉన్నదని తాజాగా కనిపిస్తున్నదృశ్యాలను బట్టి చెప్పవచ్చు. చిన్న రాష్ట్రమే అయినా గత మూడేళ్లుగా పెను సమస్యలతో అట్టుడుకుతోంది. మెయితీ, కుకీ,నాగా తెగలు కత్తులు నూరుతున్న దశలో బీరేన్ సింగ్ గత సంవత్సరంరాజీనామా చేసినా, తిరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయలేని దుస్థితిలో రాష్ట్రపతి పాలన మొదలయింది. గత ఫిబ్రవరి 13 నుంచి అమలులోకి వచ్చిన ఈ పాలన ఈ ఫిబ్రవరి 13 తో పూర్తి కావలసి ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారంమణిపూర్‌లో యేడాదికి మించి రాష్ట్రపతి పాలన కొనసాగించే అవకాశం లేనందున, దానికి కొద్ది రోజుల ముందుగానే యుమ్నం ఖేమ్ చంద్ సింగ్ సారథ్యంలో గత బుధవారం (4, ఫిబ్రవరి) కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. అయితే ఆదిలోనే హంసపాదన్నట్లు ఖేమ్ చంద్ ప్రభుత్వానికి అన్నీ బాలారిష్టాలే ఎదురవుతున్నాయి. జాతి సమతు ల్యత కోసం కుకీ సామాజిక వర్గానికి చెందిన బిజెపి ఎమ్మెల్యే నెమ్చా కిప్గెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్ పిఎఫ్)కు చెందిన ఎమ్మెల్యే దిఖోను డిప్యూటీ సిఎంలుగా నియమించారు. అలాగే బిజెపి నుంచి గోవిందాస్ కొంతౌజమ్, ఎన్‌పిఎఫ్ నుంచి కె.లోకెన్ సింగ్ మంత్రులయ్యారు. ప్రజా స్వామ్య ప్రభుత్వం ఏర్పాటయిందని చెప్పడానికి వీలుగా ఈ నేతలతో ఒక 'కూర్పు'అయితే జరిగింది కానీ ఆయా తెగల మధ్య సయోధ్య కుదిరినట్లుగా ఇంకా కనిపించడం లేదు. మణిపూర్‌లో మెజారిటీ తెగ అయిన మెయితీలను ఎస్టీల్లో చేర్చడానికి జరిగిన ప్రయత్నాన్ని కుకీ, నాగా తెగలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దాని వల్లనే

గత రెండేళ్లుగా రాష్ట్రంలో ఎన్నడూ చూడని హింస ప్రజ్వరిల్లింది. అత్యాచారాలు, హత్యలు, గృహ దహనాలు, రాష్ట్రంలో నిత్యకృత్యమైపోయాయి. దాదాపు 300మంది మరణించగా, 70వేల మందిపైగా నిరాశ్రయులయ్యారు. కొన్ని వేలమంది సొంత ఇళ్లువదిలేసి శరణార్థి శిబిరాల్లో మగ్గుతున్నారు. ఏసమస్యకు పరిష్కారం లభించకుండా మూడు తెగలకు చెందిన నాయకులతో తన ప్రభుత్వం ఏర్పాటు చేసినంత మాత్రాన అది ఎంతవరకు శాంతి యుత పరిస్థితులను పునరుద్ధరిస్తుందన్నదే సందేహం. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక అసెంబ్లీతో కూడిన యుటి తరహా పాలనా వ్యవస్థ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చేస్తున్న కుకీ జోవర్గాలకు కేంద్రం నుంచి ఎలాంటి సమాధానం లభించనే లేదు. వేలాది మంది శరణార్థులకు ఎలాంటి పునరావాసం కల్పించదలిచారో తెలియదు. దానికంటూ ఒక ప్రణాళికను కేంద్రంగాని, రాష్ట్రంగాని ఇంతవరకు ప్రకటించలేదు. ఇవేకాక తెగలమధ్య పరస్పర విరుద్ధమైన డిమాండ్లు అనేకం ఉన్నాయి. జనాభాలో దాదాపు 44 శాతం ఉన్న మెయితీలు, 24 శాతం ఉన్న కుకీల మధ్య జాతివైరం మొదటి నుంచి ఉన్నా ఇటీవల మరింత అధికమైంది. మరికొన్ని చిన్న తెగలుకూడా ఉన్నాయి. వాటిలో మిజోల దాదాపు 15శాతం ఉండగా, మెయితీ పాంగల్స్ దాదాపు 9 శాతం ఉన్నారు. బీరేన్ సింగ్ హయాంలో కుకీ డిమాండ్ల పరిష్కారానికి కొంత కసరత్తు జరిగింది కానీ హింసాకాండ పెరిగిపోవడంతో మధ్యలోనే ఆగిపోయింది. మెయితీలకు ఎస్టీ హోదా ఇవ్వరాదని కుకీలు డిమాండ్ చేస్తున్నా రు. మెయితీలకు ఆ హోదా ఇస్తే తమ


ఖేమ్ చంద్ సింగ్

కొండ ప్రాంతాల్లోని భూములన్నిటిని ఆక్రమిస్తారేమోననే భయం కుకీల్లో ఉంది. మణిపూర్, అసోం, అరుణాచల్, నాగాలాండ్‌లోని నాగాలు నివసించే ప్రాంతాలన్నిటిని కలిపి ఒకే పాలనా యూనిట్‌గా చేయాలనే డిమాండ్ కూడా ఎప్పటి నుంచోఉంది. 'గ్రేటర్ నాగాలాండ్' వారి డిమాండ్. దానికీ కేంద్రం నుంచి సరైన సమాధానం లభించలేదు. అది జరగకపోతే మణిపూర్‌లోని నాగా జిల్లాలకు ప్రత్యేక అధికారాలు ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్లన్నిటిని తీర్చడం అంత తేలికకాకపోయినా, కేంద్రం ఏనిర్ణయం ప్రకటిం చకపోవడంతో హింసాకాండ ముదిరిపోతోంది. కుకీ ప్రాంతాలకు ప్రత్యేక పాలనావకాశం ఇస్తే రాష్ట్రమే మరోసారి చీలిపోయే ప్రమాదం ఉంది. ఇన్ని సమస్యలున్నాయి. వాటి పరిష్కారానికి సహేతుకమైన కార్యాచరణ ఏదీ కేంద్రం వద్ద కనిపించకపోవడంతో హింసాకాండ గత మూడేళ్లుగా అనేక రెట్లు పెరిగిపోయింది. రాష్ట్రపతి పాలన తర్వాత కూడా అదేపరిస్థితి ఉన్నా, ఖేమ్ చంద్ ముఖ్య మంత్రి కావడం వల్ల ఎన్నికలు జరిగేలోగా ఏదో ఒకసరైన పరిష్కారం లభించగలదని పరి శీలకులు భావిస్తున్నారు. బీరేన్ సింగ్ అసమర్థత ను పార్టీ అధిష్ఠానానికి తెలియజేయడంలో ఖేమ్ చంద్ చాలా నేర్పుగా వ్యవహరించారనే చెప్పాలి. అయితే ముగ్గురు కుకీ జో ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో చేరడం పట్ల ఆ తెగలు వ్యతిరేకిస్తున్నాయి. వారు నమ్మక ద్రోహం చేశారంటూ రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు ప్రారంభించాయి. వారు ముగ్గురినిసాంఘిక బహిష్కరణ చేస్తున్నట్లు ఆ తెగల నేతలు ప్రకటించారు. ఇప్పుడు ఇదో కొత్త సమస్య. తెగల సమస్యలకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వాన్ని మార్చినంత మాత్రాన ఎటువంటి ప్రయోజనం చేకూరుతుందో చెప్పలేం.ఎన్నికలు వస్తేఈ సమస్యలవల్ల మరిన్ని అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడవచ్చు. కేంద్రం ఈ కోణం నుంచి కూడా పరిశీలించవలసి ఉంది. మూడు తెగల నేతలు ప్రభుత్వంలో ఉండడంవల్ల పరిష్కారాలు లభిస్తాయో లేదో ముందు ముందు తెలుస్తుంది. ●

విదేశం

లిబియా

# నియంత పాలన అంతం!

**గన్ని మోహన్**

ఆఫ్రికా ఖండంలోని ఉత్తరాన ఉన్న చిన్నదేశంలో అనూహ్యంగా జరిగిన హత్య ఇప్పుడు ప్రపంచ దేశాలను ఆలోచింపచేస్తోంది. ఒకప్పుడు పశ్చిమాసియా దేశాలనుఏకం చేస్తూ ముస్లిం దేశాలను ఏక తాటిపైకి నడిపేందుకు అవిరళకృషి చేసిన లిబియా దేశ నియంత ముమ్మార్ గడాఫీ తనయుడుసైఫ్ అల్ఇస్లామ్ గడాఫీ దారుణహత్యకుగురయ్యారు. హత్యను ఎవరు చేసారు? ఎవరి వ్యూహం వీటి వెనకఉంది?దేశంలోని జీహాదీలా, ప్రత్యర్థులా, లేక పాశ్చాత్య దేశాలా అనేవి ఇప్పటికీ నిర్ధారణ కాలేదు. అత్యున్నత విద్యావంతుడు. ఆర్థికశాస్త్రంలోనే పిహెచ్‌డిచేసిన సైఫ్ గడాఫీ తండ్రి హత్య తర్వాత లిబియాలో సంస్కరణలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. కేవలం కోటిమంది కూడా లేని ఈచిన్నదేశంలో నిత్యం ఏదోఒక తిరుగుబాటు జరుగుతూనే ఉంటుంది. పైగాఅపారమైన చమురునిల్వలతో కళకళలాడే ఈదేశంపెపాశ్చాత్య దేశాల ఫోకస్ ఎప్పటినుంచో ఉంది.ఉత్తరఆఫ్రికాలోని ఈ చిన్నదేశా నికి ఈజిప్టు, సూడాన్,ఛాద్, నైగర్ అల్జీరియా, ట్యూనీసియా దేశాలున్నాయి. ఇంచుమించుగా ఈ దేశాలన్నింటిలోనూ నిత్యం ఏదోఒక చిచ్చురగులుతూనే ఉంటుంది. ఈదేశాల మధ్య ఉన్న ఈ లిబియా ముమ్మార్ గడాఫీ హయాంలోనే భారీ తిరుగుబాట్లు ఎదుర్కొంది. ఆ తర్వాత ఎదురైన అంతర్యుద్ధంలో గడాఫీ హత్యకుగురైన సంగతి తెలిసిందే. గడాఫీ వారసుడుగా భావించే 53ఏళ్ల సైఫ్ అల్ ఇస్లామ్ గడాఫీని అందరూ ఇస్లాం గడాఫీ అనే పిలుస్తుంటారు. నలుగురు సాయుధ కమాండోలు జింటాన్ నగరంలోని ఆయన నివాసంలోనే హతమార్చి వెళ్లిపోయింది. అయితే సోదరి వార్త ఇందుకు భిన్నంగా వినిపిస్తోంది. అల్జీరియా సరిహద్దు సమీపంలో సైఫ్ మరణించినట్లు ఆమెఒక టివికి వెల్లడించారు. 1969నుంచి తండ్రి ముమ్మార్ గడాఫీ పాలన తర్వాత అత్యంతభయంకరమైన వ్యక్తిగా సైఫ్ గడాఫీని చెపుతుంటారు. 2011లో జరిగిన తిరు గుబాటుతో ముమ్మార్ పదవీచ్యుతుడు కావడం హత్యకావించబడటం వంటిసంఘటనల తర్వాత సైఫ్ గడాఫీ సుమారు 25 ఏళ్లుగా లిబియాను కనుసన్నల్లోనే నడిపారు. పశ్చిమ దేశాలతో లిబియా సంబంధాలు బలపడేవిధంగా ఆయన కృషి జరిగింది. తండ్రి హత్యతర్వాత

సైఫ్‌ను ప్రత్యర్థులు జింటాన్‌జైలులో ఉంచినా 2017లో విడిచిపెట్టారు. నిరసనలు అణిచివేతలో క్రూరంగా వ్యవహరించినందుకుగాను ట్రిపోలిలోని కోర్టు ఇస్లాం గడాఫీకి మరణశిక్ష వేసింది. తర్వాత అమ్నెస్టీ చట్టంప్రకారం రెండేళ్ల తర్వాత విడుదలయ్యాడు.ప్రభుత్వంలో భాగం కాకపోయినా సంస్కరణల్లో కీలకంగా వ్యవహరించిన ఇస్లాం గడాఫీని కొంతకాలం సంస్కరణల వాదిగాను, లిబియా భావి నేతగా భావించారు.తండ్రి వారసత్వాన్ని పొందాలనుకునే వాదనను తిరస్కరించిన ఇస్లాం గడాఫీని ఎందుకు హత్యచేసారన్నదే ఇప్పటికీ మిస్టరీగా మారింది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు 2021లో ప్రకటించి అధ్యక్షపదవికి పోటీచేస్తాననిప్రకటించిన్పటి నుంచే ఆయనకు ముప్పుపొంచి ఉన్నట్లు తెలుస్తోంది. అణ్వాయుధ తయారీపై పాశ్చాత్య దేశాలతో సంబంధాల కారణంగా విరామం ప్రకటించిన ఇస్లాం ఆదేశాలన్నింటినీ తనవైపు తిప్పుకోగలిగారు. ఇందుకు తన తండ్రి హయాంలో ఉన్న సంపదను వినియోగించారని ఇప్పటికీ చెపుతుంటారు. లిబియాలో విచారణ ఎదుర్కొంటున్న బల్గేరియన్ వైద్యుల విడుదల చేయించినప్పటినుంచి ఇస్లాంగడాఫీ పశ్చిమదేశాలకు చేరువకాగలిగారు.లిబియాలోఉన్న అపారమైన చమురు నిల్వల కారణంగా పశ్చిమదేశాలు అత్యధికభాగం ఆయనతోస్నేహం కోరుకునేవారు.గడాఫీతో పాటే సైఫ్‌తో కూడా మంచి సంబంధాలు నెరపారు. ఈక్రమంలో జరిగిన సైఫ్ హత్యకేవలం చమురు మాఫియా పనేనా? లేక దేశంలోని ప్రత్యర్థుల కుట్రలా, మిలిషియా స్కెచ్ ఏదయినా ఉందా? లేక సైఫ్ ఇస్లాం గడాఫీ నియంతృత్వ పోకడలే ఆయన హత్యకు దారితీసాయా అన్నది ఇప్పటికీ ఇసుమంతయినా వెల్లడికాలేదు. అత్యంతప్రభావవంతమైన, శక్తివంతమైన నిఘాఏజెన్సీలురంగంలోకి దిగితే తప్ప సైఫ్ఇస్లాం గడాఫీ హత్యోదంతానికి అసలు కారణాలు వెలుగులోకి రావని ఆదేశ ప్రజలే చెపుతున్నారు.దేశంలోసింహభాగం ముస్లిం జనాభా ఉన్నఈ దేశం ఎగువ మధ్యాదాయం ఉన్న దేశంగా నమోదయింది. లిబియా జిడిపి కూడా 47.94 బిలియన్ డాలర్లుగాఉంది. ప్రపంచంలోనే పదవ అత్యంత చమురునిల్వలున్న దేశంగా పేరున్న లిబియానిరంతరం చమురు ఎగుమతులపైనే సంపన్న దేశంగా కొనసాగింది. ఇలాంటి దేశంలో నిరుద్యోగం పెరిగింది. 21 శాతానికిచేరింది. ప్రజల్లో తండ్రిముమ్మార్ గడాఫీ నుంచి సైఫ్ తరంవరకూ కూడా అసమ్మతి,అసంతృప్తి పెరిగిపోతూఉంది. ముస్లిమేతర జనాభాపై కఠినమైన ఆంక్షలుకూడా అమలు చేయడంఇస్లాం గడాఫీ నైజంగా మారింది. వీటన్నింటి నేపథ్యంలో హఠాత్తుగా ఎవ్వరూ ఊహించనవి విధంగా అత్యంత భద్రత నడుమఉన్న ఈయువ గడాఫీని అత్యంత సునాయాసంగా అంతంచేసారంటేకొన్ని నెలలుగా యధేచ్ఛగా రెక్కీ జరిగిందనే భావించాలి.ఈనెల 6వ తేదీ జరిగిన ఆయన అంత్యక్రియలకు లక్షలాదిమంది జనప్రవాహంగా తరలివచ్చి వీడ్కోలుపలికారు.ఎలాంటి రాజ్యాంగ బద్ధమైన పదవిలేకపోయినా లిబియాను శాసించిన ఈ యువనేత హత్యవెనుక అసలుకారణంగా ఆయన అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తానని ప్రకటించడమేనా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. నియంతృత్వపోకడలతో నిరంతరం కొనసాగిన ఈ గడాఫీల పాలనలో పౌరులు నిత్యం అణిచివేతకు గురవుతుండటంతో గడాఫీ వంశం అంతరించిపోవాలనే ధ్యాస ఆదేశప్రజల్లో వ్యక్తం అవుతూవచ్చినా బహిరంగంగా నిరసనతెలిపే సాహసంలేదు. అందుకేనేమో బహుశా మిలీషియా తిరుగుబాటుతోనే ఈయువ ఇస్లాం గడాఫీ హత్యకుగురయ్యాడని లిబియా ప్రజలు భావిస్తున్నారు. ఏదిఏమైనా లిబియాను శాసించినగడాఫీ చివరితరం నేత సైఫ్ అల్ఇస్లాం గడాఫీహత్య ఇప్పటికీ వెలుగు చూడని వాస్తవంగానే మిగిలిపోయింది. ●


ఇస్లాం గడాఫీ

# అమెరికా డాలర్ ఉచ్చు నుంచి బయటపడగలమా?

**సుంకవల్లి సత్తిరాజు**

ప్రపంచ దేశాలన్నీ ప్రస్తుతం అమెరికా వాణిజ్య పీడనలో అతలాకుతలమైపోతున్నాయి. ఆర్థిక మందగమనం అతివేగంగా సాగుతున్నది. కాలచక్రభ్రమణంలో బండ్లు ఓడలు, ఓడలు బండ్లుగా మారతాయనే నానుడి ప్రస్తుత పరిస్థితులకు అతికినట్టుగా అగుపిస్తున్నది. 2020 వ సంవత్సరం నుండి వరుసగా రెండేళ్ళు కోవిడ్ కారణంగా ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలు చిన్నాభిన్నమైపోయాయి. కోవిడ్ నుండి తేరుకుని నెమ్మదిగా ఆర్థిక పరిస్థితులుకుదుట పడుతున్న తరుణంలో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక మాంద్యానికి కారణభూతమైనది. అగ్నికి ఆజ్యం తోడైనట్టు, పుండు పై కారం చల్లిన చందంగా దివాలా తీసిన ప్రపంచ ఆర్థికవ్యవస్థలను డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌వార్ మరింత కృంగదీసింది. యుద్ధాల భయం ఒకవైపు వెంటాడుతుంటే, మరో వైపు ట్రంప్ సామ్రాజ్యవాదం, యుద్ధోన్మాదం, ట్రేడ్ వార్ ప్రపంచ ప్రజల ఆర్థిక స్థితిగతులను అల్లకల్లోల సాగరంలో ముంచెత్తుతున్నాయి. అమెరికాను ధిక్కరించి ముందుకు సాగాలని కొన్ని దేశాలు సాహసిస్తుంటే, మరికొన్ని దేశాలు మోనముద్ర దాల్చాయి. ఈక్రమంలో ప్రపంచ ఆర్థిక అభివృద్ధి భారత్ చైనాల చుట్టూ తిరుగుతున్నదని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు అతిశయోక్తులా? వాస్తవాలకు ప్రతీకలా? అనే సందిగ్ధత నెలకొన్నప్పటికీ ప్రస్తుత ప్రపంచ పరిణామాలబట్టి, సమీప భవిష్యత్తులో ఈ ఇరుదేశాలు ఆర్థిక గమనానికి దశాదిశా నిర్దేశం చేసే దిశలో పయనిస్తున్నాయని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐ.ఎం.ఎఫ్) తాజా గణాంకాలను బట్టి అవగతమవుతున్నది. ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో భారత్,చైనాలు 43.6 శాతం వాటాను కలిగి ఉన్నాయని ఐఎంఎఫ్ డేటా సూచిస్తున్నది. ఇండోనేషియా,టర్కీ, నైజీరియా, బ్రెజిల్, వియత్నాం,సౌదీ అరేబియా,జర్మనీ దేశాలు చైనా,భారత్,అమెరికా తర్వాత స్థానాల్లో ఉంటాయని ఐ.ఎమ్.ఎఫ్ సూచించింది. అమెరికా అనుసరిస్తున్న అస్తవ్యస్థ వాణిజ్య పద్దతులు, టారిఫ్‌లు ఆ దేశ ఆర్థిక వృద్ధి రేటును క్షీణింప చేస్తాయని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇకనైనా ట్రంప్ తన ధోరణిని విడనాడాలని సూచిస్తున్నారు. ప్రగల్భాలతో, బెదిరింపులతో ప్రపంచాన్ని భయపెట్టడం సాధ్యం కాదని ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు నిరూపించాయి. ట్రంప్‌ను ఆత్మ రక్షణలో పడేసాయి. అయినప్పటికీ ట్రంప్‌లో గూడుకట్టుకున్న అహంకారం, చాదస్తం పోతాయనుకోవడం కూడా భ్రమే కాగలదు.ఒక వైపు గాజాలో శాంతి మండలి ఏర్పాటు చేయబడింది. మరో వైపు ఇరాన్‌పై నిప్పుల వర్షం కురిపించడానికి అయతుల్లా ఖమెనీని గద్దె దించడానికి ఇరాన్ వైపు అమెరికా భారీగా యుద్ధ విమానాలను మోహరించింది. ఇంకొక వైపు 70 సంవత్సరాల కమ్యూనిస్టుల పాలనకు చరమగీతం పాడాలనే దురుద్దేశ్యంతో క్యూబా పై దాడికి సిద్ధంగా ఉండడంతో ట్రంప్ వైఖరిలో మార్పు రాదని అవగతమవుతున్నది. చైనా, క్యూబాలకు భారీగా చమురు సరఫరా చేసిన వెనిజులా పై సైనిక దాడి చేసి మదురోను గద్దెదించి వెనిజులా దేశాన్ని తనదిగా ప్రకటించుకోవడం, తానే వెనిజులాకు తాత్కాలిక అధ్యక్షుడినంటూ ట్రంప్ పేర్కొనడమే కాకుండా ఇప్పుడు క్యూబాకు వెనిజులా నుండి చమురు సరఫరా కాకుండా నిలిపి వేసి క్యూబాను ఆర్థికంగా దెబ్బతీయడం జరిగింది. క్యూబాకు ఆయిల్ సరఫరా చేసే దేశాలపై వాణిజ్య సుంకాల అస్త్రంప్రయోగిస్తానంటూబెహుంకరించడం మార్పులేని ట్రంప్ మనోవికారానికి నిదర్శనం. ఇంకోవైపు కెనడాను అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఒకటిగా పేర్కొంటూ కెనడా ప్రధానిని గవర్నర్‌గా సంబోధించడం ట్రంప్ సామ్రాజ్యవాదానికి పరాకాష్ట. చైనాతోట్రేడ్ డీల్ వద్దని హెచ్చరించడం కెనడా నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై 50శాతం టారిఫ్‌లు విధిస్తానని ప్రకటించడం ద్వారా ట్రంప్ 'టారిఫ్ వార్' పతాక స్థాయికి చేరింది.చైనాతో వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవద్దని ట్రంప్ యు.కె ను హెచ్చరించినా ఖాతరు చేయకుండా బ్రిటీష్ ప్రధాని మందీ మార్బలాన్ని వెంటబెట్టుకుని షాంఘై వెళ్ళి,చైనా తో ద్వైపాక్షిక,వాణిజ్య సంబంధాలను మెరుగు పరచుకోవడానికి ప్రయత్నించడం, గల్ఫ్ స్ట్రీమ్ ఎయిరో



స్పేస్ విమానాలకు ధృవీకరణ పత్రాలను ఇవ్వడానికి కెనడా నిరాకరించడం అమెరికా ఆగ్రహానికి ఆజ్యంపోసింది. కెనడాను అమెరికా హెచ్చరించినా కెనడా ప్రధాని మార్క్ కార్నే చైనా లో పర్యటించడం విదితమే. ఇప్పుడు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా కూడా కెనడా దారిలోనే పయనించడం చూస్తున్నాం. ఇంతకు ముందే న్యూఢిల్లీలో ఇండోఈయూల మధ్య 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా పేర్కొంటున్న'ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్' కుదిరింది. ఈ ఒప్పందం ట్రంప్‌కు చెంపపెట్టుగా మారింది. ఈ పరిణామలాన్నింటినీ బేరీజు వేసుకుని అమెరికా భారత్‌ల మధ్య ట్రేడ్ డీల్‌కోసం ట్రంప్ తహతహలాడుతున్నాడు. ఇటీవల అమెరికా టారిఫ్‌లకు ప్రతీకారంగా భారత్ కూడా అమెరికా నుండి దిగుమతయ్యే పప్పుధాన్యాలపై 30శాతం టారిఫ్ విధించడంతో అమెరికా రైతులు గగ్గోలుపెడుతున్నారు. శ్వేత సౌధం రైతుల ఆందోళనకు వేదికైనది. ట్రంప్ గద్దె దిగాలనే ఆలోచన అమెరికా ప్రజల్లో ఏర్పడింది. ఇప్పటివరకు డాలర్‌తో ప్రపంచాన్ని శాసించిన అమెరికా గుత్తాధిపత్యం కూడా ఎంతోకాలం కొనసాగేలా లేదు. అమెరికా సౌదీ అరేబియాల మధ్య సుమారు ఐదు దశాబ్దాల క్రితం కుదిరిన పెట్రోడాలర్ వ్యవస్థ ఒప్పందం ముగియడంతో సౌదీఅరేబియా కూడా తమ స్వంత కరెన్సీని చమురు వాణిజ్యానికి ఉపయోగించడం విశేషం.రష్యా రూబుల్ తోను, చైనా యువాన్‌లతోను అధిక శాతం అంతర్జాతీయ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.ప్రపంచంలోని 212 దేశాల్లో సుమారు 11వేల బ్యాంకులు తమకు కేటాయించిన ఎనిమిది నుండి పదకొండు అక్షరాల స్విఫ్ట్ కోడ్ లేదా బ్యాంక్ ఐడెంటిఫయర్ కోడ్ 'బిక్' ద్వారా అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలను 'స్విఫ్ట్' అనే గ్లోబల్ మెసేజింగ్ నెట్ వర్క్ ద్వారా నిర్వహిస్తాయి.సెక్యూరిటీ పరంగా ఈపేమెంట్ వ్యవస్థ అత్యంత విశ్వసనీయమైనది.అమెరికా ప్రపంచాన్ని తమగుప్పెట్లో బంధించాలని చేసిన ప్రయత్నాల ఫలితంగా వెనిజులా,రష్యా,చైనా లాంటి దేశాలకు స్విఫ్ట్ ద్వారా జరిపే ఆర్థిక కార్యకలాపాలను బ్యాంకులు నిలిపి వేయడంతో ఈదేశాలు డాలర్‌తో కాకుండా తమ దేశాల కరెన్సీతో ఇతర పేమెంట్ వ్యవస్థలతో తమ వాణిజ్య కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. దీనివలన డాలర్‌ప్రాధాన్యత తగ్గుతుండడం గమనార్హం. క్రమేపీ డీ డాలరైజేషన్ వైపు ప్రపంచ దేశాలు పయనించే అవకాశాలున్నాయి. ఇటీవల భారత్ ఈయూ దేశాల మధ్య కుదిరిన ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ కూడా డాలర్లలో కాకుండా రూపాయి యూరోలలో జరగనున్న దృష్ట్యా అమెరికా బెంబేలెత్తిపోతున్నది. మన దేశంలో 'నేషనల్ పే మెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా' ద్వారా బ్యాంకు వినియోగదారులు తమకున్న అనేకమైన బ్యాంకు ఖాతాలనుండి నగదు బదిలీ చేయడానికి నిర్వహిస్తున్న 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్" (యు.పి.ఐ) మాదిరిగానే స్విఫ్ట్ కూడా వేలాది ఆర్థికసంస్థలు తమ అంతర్జాతీయ ఆర్థిక కాలాపాలను స్విఫ్ట్ అనే పేమెంట్ వ్యవస్థ ద్వారా నిర్వహిస్తున్నాయి. కొన్నిఎంపిక చేసిన దేశాల అంతర్జాతీయ లావాదేవీలకు భారత్ 'యుపిఐ' ని వినియోగిస్తున్నది.భారత్ రష్యాల మధ్య వాణిజ్య లావాదేవీలు స్విఫ్ట్ ద్వారాకాకుండా రూపే,మిర్ వ్యవస్థల ద్వారా నిర్వహించడం జరుగుతున్నది. భారత్ సాంకేతికంగా అభివృద్ధి చెందడం వలన యుపిఐ లాంటి పేమెంట్ వ్యవస్థలను సృష్టించుకోగలిగింది. 2016 లో ప్రారంభమైన యుపిఐ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్రగామి డిజిటల్ పేమెంట్ వ్యవస్థ గా మారడం భారతీయ సాంకేతిక ప్రగతికి నిదర్శనం.ఇప్పటి వరకు విచ్చల విడిగా డాలర్లను ముద్రించి డాలర్‌ప్రపంచాన్ని సృష్టించిన అమెరికాకు ఇప్పుడు ముచ్చెమటలు పడుతున్నాయి. బ్రిక్స్ ప్లస్‌దేశాలు డీడాలరైజేషన్ వ్యవస్థ వైపు పయనిస్తున్నాయి. యూరోపియన్ దేశాలతో సహా చైనా,రష్యా,ఇండియా వంటి దేశాలు తమ వాణిజ్యాన్ని డాలర్లలో కాకుండా తమ తమ కరెన్సీలో నిర్వహించడం అమెరికాకు మింగుడుపడని చర్య. అయితే అమెరికాను ధిక్కరించి, డాలర్‌ను కాదని ఏ దేశమూ తమ అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాలను పూర్తిస్థాయిలోతమ తమ దేశాల కరెన్సీలతో నిర్వహించుకునే సాహసం చేయబోవు. ఇప్పటికీ ఆర్థిక, ఆయుధ సామర్థ్యం విషయంలో అమెరికాను మించిన దేశం లేదనేది సుస్పష్టం. దీంతోభారత్‌తో సహా పలు ప్రపంచ దేశాలు ఆచితూచివ్యవహరిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో డీ డాలరైజేషన్ ఆశలు ఇప్పట్లో సాధ్యం కావని చెప్పవచ్చు. ●

# ట్రేడ్ డీల్‌తో రైతులకు నష్టం రాదు



## ఇండియా, అమెరికా మధ్య కొన్ని ఉత్పత్తులపై జీరో శాతం సుంకాలు

## డీల్‌కు దూరంగా కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ఇండియా- అమెరికా ట్రేడ్ డీల్ అమలులోకి వచ్చిన సందర్భంగా టారిఫ్‌లను ట్రంప్ తగ్గించారు. తగ్గించిన టారిఫ్‌లు తక్షణమే అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏయే ఉత్పత్తులపై ఎలాంటి పన్నులు ఉంటాయి అవి ఇండియాకు ఎలాంటి మేలు కలిగిస్తాయి అనే అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య పన్నులు, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం స్పందించారు. ఇండియాఅమెరికా మధ్య కొన్ని ఉత్పత్తులపై సున్నా శాతం సుంకాలు విధించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ట్రేడ్ డీల్ వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రైతులకు నష్టం కలగకుండా కొన్ని ఉత్పత్తుల్ని డీల్‌కు దూరంగా ఉంచినట్లు చెప్పారు. ఇండియా నుంచి ఎగుమతి అయ్యే సోయాబీన్ ఆయిల్‌పై పరిమిత కోటా వరకు జీరో టారిఫ్‌లు ఉంటాయి. అలాగే అమెరికా నుంచి దిగుమతి చేసుకునే యాపిల్స్‌పై కూడా సున్నా సుంకాలుంటాయి. సుంకాలు లేకుండా కనీసం 80 రూపాయలకు కేజీ యాపిల్స్ దిగుమతి చేసుకుంటారు. అలాగే వైన్స్, ఆల్కహాల్ డ్రింక్స్, పప్పు ధాన్యాలు, క్యాన్సర్ డ్రగ్స్, కెమికల్స్, మెడికల్ డివైజెస్ వంటివి జీరో టారిఫ్స్ కిందకు వస్తాయి. వీటి దిగుమతులపై ఎలాంటి పన్ను ఉండదు. దీంతో ఇవి భారత మార్కెట్లో చవకగా లభిస్తాయి. అలాగే ఇండియా నుంచి ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులు, రత్నాలు, వజ్రాలు వంటి వాటిపై అమెరికా ఎలాంటి టారిఫ్‌లు విధించదు. అలాగే మన దేశం నుంచి భారీగా ఎగుమతి చేసే స్మార్ట్‌ఫోన్లపై కూడా సున్నా సుంకాలే. వ్యవసాయ రంగానికి సంబంధించి మసాలా దినుసులు, టీ, కాఫీ పౌడర్లు, కొబ్బరి ఉత్పత్తులు, వివిధ రకాల నట్స్, పండ్లు, కూరగాయలు కూడా అమెరికాకు జీరో టారిఫ్ కేటగిరిలోనే ఎగుమతి అవుతాయి. వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గడం వల్ల మన ఉత్పత్తులు అమెరికా మార్కెట్లో ఎక్కువగా అమ్మకాలు సాగుతాయి. ఇది మన రైతులకు మేలు చేస్తుంది. మనం దిగుమతి చేసుకునే కొన్ని ఉత్పత్తులు, ఎగుమతి చేసే ఉత్పత్తుల్ని జీరో టారిఫ్ కేటగిరిలోకి తెచ్చి, ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నాయి ఇరు దేశాలు.



## జూన్‌లోగా ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు

### గడువు విధించిన అమెరికా

**కీవ్, ఫిబ్రవరి 7:** ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపునకు అమెరికా తన వంతు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వాషింగ్టన్ మధ్యవర్తిత్వంలో అబుధాబీ వేదికగా ఇరు దేశాల ప్రతినిధులు చర్చలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ప్రకటన చేశారు. ఈ యేడాది జూన్‌లోగా యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ ఇరు పక్షాలకు అమెరికా డెడ్‌లైన్ విధించిందని తెలిపారు. ఒకవేళ గడువులోగా లక్ష్యం నెరవే రకపోతే దాన్ని సాధించేందుకు ట్రంప్ యం త్రాంగం ఇరుపక్షాలపై ఒత్తిడి తీసుకొచ్చే అవ కాశం ఉందని చెప్పారు. 'ఈ వేసవి ప్రారం భంలోగా యుద్ధాన్ని ముగించాలని అమెరికన్లు సూచించారు. జూన్ నాటికి అన్ని వ్యవహారాలను కొలిక్కి తీసుకురావాలని చెప్పారు. యుద్ధానికి తెరదించేందుకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అన్ని కార్యక్రమాలకు సంబంధించి ఒక స్పష్టమైన షెడ్యూల్ కావాలన్నారు. దీని ప్రకారం సంబంధిత పక్షాలపై అమెరికా ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉంది' అని జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడో విడత చర్చలు అమెరికాలో నిర్వహించేందుకు ఆ దేశం ముందుకొచ్చిందని, దీనికి తమ తరఫున అంగీకారం తెలిపినట్లు చెప్పారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా ఉక్రెయిన్, రష్యా ప్రతినిధులు ఇప్పటికే రెండుసార్లు సమావేశమయ్యారు. అబుధాబీ వేదికగా నిర్వహించిన రెండో విడత భేటీలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో ఎటువంటి పురోగతి లభించలేదు. డాన్‌బాస్ నుంచి వైదొలగాలని కీవ్‌పై మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది.

## యాప్ రైడర్ల దేశవ్యాప్త బ్రేక్ డౌన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** యాప్ ఆధారిత రవాణా సేవలైన ఓలా, ఉబర్, ర్యాపిడో వాహనాల చక్రాలు దేశవ్యాప్తంగా నిలిచిపోయాయి. తమ సమస్యల పరిష్కారం కోసం గిగ్ వర్కర్లు శనివారం (ఫిబ్రవరి 7) దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడంతో రైడ్‌సేవలు నిలిచిపోయాయి. దీనితో నగరాలకు దూకుడుగా వెళ్లగలిగిన ప్రజలు ఇబ్బందులు పాలయ్యారు. వ్యాపారవేత్తలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇతర బిజినెస్ మెన్ మొత్తం అన్నిరంగాలు తీరని ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.కొన్ని నగరాల్లో కేవలం బైక్‌రైడర్లు మాత్రమే వచ్చారు. ఆల్ ఇండియా బ్రేక్ డౌన్ పేరుతో చేపట్టిన ఈ నిరసనలో భాగంగా డ్రైవర్లందరూ ఉదయం నుంచి 6 గంటల పాటు యాప్‌ల నుంచి లాగ్‌అవుట్ కానున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) నేతృత్వంలో జరుగుతున్న ఈ పోరాటానికి పలు జాతీయ కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ముఖ్యంగా అగ్రిగేటర్ సంస్థలు ఇష్టానుసారంగా ఛార్జీలను నిర్ణయిస్తూ డ్రైవర్లను శ్రమదోపిడీకి గురిచేస్తున్నాయని యూనియన్ ఆరోపిస్తోంది. మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్ 2025 అమల్లో ఉన్నప్పటికీ, ప్రభుత్వం కనీస ఛార్జీలను నోటిఫై చేయకపోవడం వల్ల డ్రైవర్ల ఆదాయం దారుణంగా పడిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా విడుదలైన ఎకనామిక్ సర్వే 2025-26 సైతం గిగ్ వర్కర్ల దయనీయ స్థితిని ఎత్తిచూపింది. దేశంలో సుమారు 40 శాతం మంది గిగ్ వర్కర్లు నెలకు రూ. 15,000 కంటే తక్కువ ఆదాయంతో సరిపెట్టుకుంటున్నట్లు సర్వే పేర్కొంది. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారత్ టాక్సీ అనే సహకార ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించడం ఈ రంగంలో కొత్త చర్చకు దారితీసింది.

## అమెరికాలో ట్రంప్‌ను వెన్నంటిన మరో వివాదం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన భార్య మిచెల్ ఒబామాను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ అయిన ఒక జాతి వివక్ష వీడియో ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో పెను తుపాను సృష్టిస్తోంది. ఈ వివాదంపై మొదటిసారి స్పందించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆ వీడియోలో ఉన్న అభ్యంతరకర భాగాన్ని తాను చూడలేదని, కేవలం ఓటింగ్ యంత్రాల అక్రమాలకు సంబంధించిన మొదటి భాగాన్ని మాత్రమే చూసి సిబ్బందికి ఇచ్చానని ఆయన సమర్థించుకున్నారు. ట్రంప్ అధికారిక ట్రూత్ సోషల్ ఖాతాలో గురువారం రాత్రి పోస్ట్ అయిన ఈ నిమిషం నిడివి గల వీడియోలో ఒబామా దంపతుల ముఖాలను ఏఐ సాంకేతికతతో కోతుల శరీరాలకు తగిలించి అత్యంత దారుణంగా చిత్రీకరించారు. సుమారు 12 గంటల పాటు ఆన్‌లైన్‌లో ఉన్న ఈ వీడియోపై సర్వత్ర నిరసనలు వ్యక్తమవ్వడంతో చివరికి తొలగించారు. మొదట దీనిని కేవలం ఒక మీమ్ అని కొట్టిపారేసిన వైట్ హౌస్ వర్గాలు, ఆ తర్వాత సిబ్బంది చేసిన పొరపాటుగా అభివర్ణించాయి. ఈ ఘటనపై డెమొక్రాట్లే కాకుండా రిపబ్లికన్ పార్టీ నేతలు కూడా భగ్గుమంటున్నారు. సెనేట్‌లోని ఏకైక నల్లజాతి రిపబ్లికన్ నేత టిమ్ స్కాట్ ఈ వీడియోను అత్యంత జుగుప్సాకరమైనదిగా అభివర్ణించారు. సొంత పార్టీ ఎంపీలు మైక్ లాలర్, సుసాన్ కాలిన్స్ వంటి వారు కూడా ట్రంప్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే, రోజుకు వేల సంఖ్యలో విషయాలను చూస్తుంటానని, ఇందులో తన తప్పేమీ లేదని ట్రంప్ మొండిగా సమాధానమివ్వడం గమనార్హం.



## మలేసియాలో ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం

**కౌలాలంపూర్, ఫిబ్రవరి 7:** భారత ప్రధాని నరేంద్ర మోడీ శనివారం మలేషియాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కౌలాలంపూర్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం స్వయంగా సాదర స్వాగతం పలికారు. ఇరు దేశాల జెండాలు చేతబూనిన చిన్నారులు ప్రధాని మోడీకి అభివాదం చేశారు. అనంతరం, ఎయిర్ పోర్టు నుంచి మోడీ, అన్వర్ ఇబ్రహీం ఒకే కారులో కౌలాలంపూర్ లోని ఓ కమ్యూనిటీ ప్రోగ్రామ్ కు కలిసి వెళ్లారు. భారత్‌మలేషియా మధ్య 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ పర్యటన నేపథ్యంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ రక్షణ, భద్రత, ఆర్థిక, ఆవిష్కరణల రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భారత్, మలేషియా మధ్య చారిత్రక సంబంధాలు ఇటీవలి కాలంలో గణనీయమైన పురోగతి సాధించాయి. ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో చర్చల కోసం ఎదురు చూస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 2024లో ఇరు దేశాల సంబంధాలు 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య' స్థాయికి చేరిన తర్వాత మోడీ మలేషియాలో పర్యటించడం ఇదే తొలిసారి. మలేషియాలో దాదాపు 30 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారని, వారు ఇరు దేశాల మధ్య సజీవ వారధిగా నిలుస్తున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. తన పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అలాగే, ప్రవాస భారతీయులతో పాటు పారిశ్రామిక, వాణిజ్య ప్రతినిధులతోనూ సమావేశమవుతారు. ఈ పర్యటనకు అనుబంధంగా 10వ ఇండియా మలేషియా సీఈవో ఫోరమ్ కూడా జరగనుంది.

## లంచం తీసుకుంటూ పట్టుబడిన రక్షణశాఖ ఇంజినీర్లు

**ముంబై,ఫిబ్రవరి 7:** రక్షణ శాఖకు చెందిన ఇద్దరు అధికారులు రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ట్రాప్ చేసిన సీబీఐ రెడ్ హ్యాండెడ్‌గా వారిని పట్టుకున్నది.డిఫెన్స్ ఆఫీసర్స్ ఇళ్లల్లో సోదాలు చేసింది. ఈ వ్యవహారంలో ఇతర అధికారుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నది. మహారాష్ట్రలోని పూణేలో ఈ సంఘటన జరిగింది. ఖడ్కిలోని మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్)కు సంబంధించిన కాంట్రాక్ట్ పనులను ఒక ప్రైవేట్ కంపెనీ కాంట్రాక్టర్ పూర్తి చేశాడు.ఎంఈఎస్‌కు చెందిన రక్షణశాఖ అధికారులైన అసిస్టెంట్ గ్యారిసన్ ఇంజినీర్ సునీల్ నికం,జూనియర్ ఇంజినీర్ సురేష్ మష్కే బిల్లుల చెల్లింపు నిలిపివేసినట్లు ఆ కాంట్రాక్టర్ ఆరోపించాడు. డిఫెన్స్ అధికారులు రూ.6 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు ఫిర్యాదు చేశాడు. మరోవైపు ఫిబ్రవరి 3న సీబీఐ కేసు నమోదు చేసింది. ఫిబ్రవరి 5న సీబీఐ అధికారులు ట్రాప్ వేశారు. జూనియర్ ఇంజినీర్ సురేష్ తన కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి తొలి విడతగా రూ.2లక్షలు లంచం తీసుకోగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ అధికారితో పాటు అసిస్టెంట్ గ్యారిసన్ ఇంజినీర్ సునీల్ నికంను కూడా సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. కొన్ని పత్రాలతో పాటు రూ.1,88,500నగదు స్వాధీనం చేసుకున్నారు. కాంట్రాక్ట్ పనుల బిల్లుల చెల్లింపు కోసం లంచం వ్యవహారంలో ఇతర అధికారుల ప్రమేయంపైనా సీబీఐ దర్యాప్తు చేస్తున్నది.

## హెడ్‌లైన్స్‌లో నిలిచేందుకు రాహుల్ ఆరాటం: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శలు చేశారు. హెడ్‌లైన్స్‌లో నిలిచేందుకు ఆయన ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు బీహార్ రాజధాని పాట్నాలో శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ఎంతో పురోగతి సాధించింది. తమ 60 ఏళ్ల పాలనలో దేశాన్ని బలహీనపరిచిన కాంగ్రెస్‌ను ప్రజలు ఇక విశ్వసించరు. వార్తల్లో నిలవాలన్న తాపత్రయంతోనే రాహుల్‌గాంధీ అసంబద్ధ వాదనలు చేస్తున్నారు. అయితే ఇవన్నీ ఎలాంటి ఫలితాలను ఇవ్వవు అని రిజిజు విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగం లేకుండానే లోక్ సభలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఆ పరిణామంపై రిజిజు మాట్లాడారు. ఆ రోజు 40,50 మంది విపక్ష ఎంపిలు స్పీకర్ చాంబర్‌లోకి దూసుకెళ్లారు. సరైన పద్ధతిలో మాట్లాడలేదు. అప్పుడు నేను కూడా చాంబర్‌లోనే ఉన్నాను. అప్పటికే లోక్‌సభలో ప్రధాని మాట్లాడేందుకు షెడ్యూల్ ఖరారైంది. వారి తీరు చూసిన తర్వాత ప్రధాని సభకు రాకపోవడమే మంచిదనే నిర్ణయం తీసుకున్నాం. మేం అధికారంలో ఉన్నాం. మేం మార్షల్స్‌ను ఉపయోగించవచ్చు. కానీ మేం అలా చేయాలనుకోలేదు. అందుకే ప్రధాని మాట్లాడకుండానే తీర్మానానికి ఆమోదం లభించింది అని మంత్రి అన్నారు.




## మద్యంలేకుండా పెళ్లి జరిపితే రూ.51వేల ప్రోత్సాహకం: సర్పంచ్

**డెహ్రాడూన్,ఫిబ్రవరి 7:** ఉత్తరాఖండ్‌లోని ఓ గ్రామ సర్పంచ్ చేపట్టిన వినూత్న నిర్ణయం అందరినీ ఆకట్టుకుంది. పెళ్ళిళ్లలో మద్యంలేకుండా జరిపితే రూ.50వేల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డోయివాలా నియోజకవర్గ పరిధిలో గడుల్ గ్రామ సర్పంచ్ స్వీటీరావత్ వివాహ వేడుకల్లో మద్యం వినియోగాన్ని అరికట్టాలని సంకల్పించారు. ఇందుకోసం ఆమె ప్రత్యేక ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు రెండు కుటుంబాలు ఈ నిబంధనను పాటించగా, వారికి నగదు బహుమతిని అందజేశారు. ఆమె చేస్తున్న ఈ ప్రయత్నాన్ని జిల్లాకలెక్టర్ సహా పలువురు అధికారులు ప్రశంసించారు. ఇదే తరహాలో తెహ్రి జిల్లాలోని దేవ్‌ప్రయాగ్ గ్రామంలో మద్యం లేకుండా వివాహం నిర్వహిస్తే వధువుకు రూ.10 వేలనగదు బహుమతి ఇస్తామని స్థానిక పోలీసులు ప్రకటించారు.

## 'హౌడీ మోడీ' కంటే నమస్తే ట్రంప్‌దే పైచేయి

### ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ విమర్శలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** భారత్, అమెరికా మధ్య ఖరారైన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ట్రేడ్ డీల్‌లోని వివరాల ప్రస్తావన సరిగ్గా లేవని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లను ఉద్దేశిస్తూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ట్రేడ్ డీల్ గురించి భారత్, అమెరికా చేసిన సంయుక్త ప్రకటనలో వివరాలను సరిగ్గా ప్రస్తావించలేదు. కానీ, భారత్ ఇక రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోదని తెలుస్తుంది. ఒకవేళ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గాని ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తే మన వస్తువులపై 25 శాతం సుంకాలు తిరిగి విధించవచ్చని అగ్రరాజ్యం ప్రకటించింది. దేశంలోని రైతుల ప్రయోజనాలను దెబ్బతీసి మరీ అమెరికన్ రైతులకు సాయం చేకూరేలా భారత్ దిగుమతులపై సుంకాలు తగ్గించనుంది. యుఎస్ దిగుమతులు మూడు రెట్లు ఎక్కువవడంతో మన వాణిజ్య మిగులు తుడిచిపెట్టుకుపోతోంది. మనకు చెందిన ఐటి, ఇతర సేవల ఎగుమతులపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఈ క్రమంలో మన ఎగుమతుల్లోని కొన్ని వస్తువులు గతంలోకన్నా ఎక్కువ సుంకాల ఎదుర్కోవల్సి వస్తుంది అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా 'హౌడీ మోడీ' కంటే 'నమస్తే ట్రంప్' పై చేయి సాధించారంటూ జైరాంరమేశ్ ఎద్దేవా చేశారు. స్నేహితుడు ఎన్నటికీ స్నేహితుడిగానే కొనసాగబోడంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇక, మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా శనివారం సంయుక్త ప్రకటన చేశాయి. దీనిలో భాగంగా భారత దిగుమతులపై ఉన్న 50 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గించనున్నట్లు అమెరికా తెలిపింది. ఈ ఒప్పందంతో భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ తెరుస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

## రీల్స్‌పిచ్చిలో ప్రాణాలు పోగొట్టుకున్న యువతి

**బాందా(యుపి), ఫిబ్రవరి 7:** సోషల్ మీడియా రీల్స్ మోజు, లైకుల పిచ్చి యువతను ఎంత ప్రమాదంలోకి నెడుతోందో చెప్పడానికి ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఈ ఘటనే నిదర్శనం. సరదా కోసం చిత్రీకరించాలనుకున్న ఓ దృశ్యం చివరకు విషాదాంతమై, ఓ యువతి ప్రాణాలను బలిగొంది. ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాకు చెందిన 27 ఏళ్ల మోహిని అనే మహిళకు సోషల్ మీడియాలో రీల్స్ చేయడం అలవాటు. ఈ క్రమంలోనే తన ఇంట్లో ఉరి వేసుకుంటున్నట్లు నటించే సన్నివేశాన్ని చిత్రీకరించాలని నిర్ణయించుకుంది. దీనికోసం మెడకు తాడు బిగించుకుని ఓ స్టూల్‌పై నిల్చుని తన మొబైల్ ఫోన్‌లో వీడియో రికార్డ్ చేయడం ప్రారంభించింది. అయితే, కొన్ని క్షణాల్లోనే సీన్ రివర్స్ అయింది. ఆమె బ్యాలెన్స్ కోల్పోవడం లేదా కాలు జారడంతో స్టూల్ పక్కకు పడిపోయింది. దీంతో మెడకు బిగిసిన ఉరి నిజంగానే ఆమె ప్రాణాలను క్షణాల్లో తీసేసింది. ఈ విషయాన్ని మొదట గమనించింది ఆమె నాలుగేళ్ల కుమార్తె. గదిలోకి వచ్చిన చిన్నారి, తల్లి ఉరికి వేలాడుతూ కనిపించడంతో గట్టిగా కేకలు వేసింది. ఆ అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు అక్కడికి పరుగెత్తుకొచ్చి, దృశ్యం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నప్పటికీ, రీల్ చిత్రీకరిస్తుండగా జరిగిన ప్రమాదంగానే భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## శాటిలైట్లను మసిచేసే 'మైక్రోవేవ్ వెపన్'

### గొప్ప శక్తివంతమైన ఆయుధం సృష్టించిన చైనా



**బీజింగ్, ఫిబ్రవరి 7:** శత్రువు ఏ రూపంలో వచ్చినా ఎదుర్కొనేలా ఎప్పటికప్పుడు కొత్తకొత్త ఆయుధాలు పుట్టుకొస్తున్నాయి. తాజాగా అదే బాటలో చైనా శక్తిమంతమైన ఆయుధాన్ని అభివృద్ధి చేసింది. భూమి నుంచే శాటిలైట్లను ధ్వంసం చేయగల హై-పవర్ మైక్రోవేవ్ వెపన్ సిస్టమ్ తయారుచేసింది. ఈమేరకు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పేర్కొంది. క్షిపణులు, తుపాకులను మించిన అధునాత ఆయుధాలపై దృష్టి సారించిన పలు దేశాల సైన్యాలు తక్కువ ఖర్చుతో కూడిన శక్తిమంతమైన ఆయుధాల వైపు దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో హై-పవర్ మైక్రోవేవ్ వెపన్స్ సిద్ధం అవుతున్నాయి. ఈ కాన్సెప్ట్‌తో చైనాలోని నార్త్‌వెస్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ టెక్నాలజీలోని వాంగ్ గ్యాంగ్ బృందం టిపిజి 1000సి వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఈ డివైజ్ నుంచి సుదీర్ఘంగా మైక్రోవేవ్ పల్స్ జనరేట్ అవుతుంటాయి. నాలుగు మీటర్ల పొడవు, ఐదు టన్నుల వరకు బరువు ఉండే ఈ పరికరం.. ఒక నిమిషం పాటు 20 గిగావాట్ల శక్తిని ఎలాంటి ఆటంకం లేకుండా అందించగలదు. ప్రస్తుతం ఉన్న ఈ తరహా వ్యవస్థలు భారీ పరిమాణంతో కొన్ని సెకన్ల వరకు మాత్రమే శక్తిని ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్లపై చైనాలో ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం అవుతోంది. అవి దేశభద్రతకు ముప్పుగా మారాయని ఆ దేశ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దాంతో స్టార్‌లింక్ కిల్లర్‌ను తయారు చేసుకోవాలనే వాదన ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ ఆయుధం గురించి కథనం రావడం గమనార్హం. భూదిగువ కక్ష్యలో ఉంటే ఉపగ్రహాలకు ఈ మైక్రోవేవ్ వెపన్ అంతరాయం కలిగించగలదు, ధ్వంసం కూడా చేయగలదని మీడియా కథనం పేర్కొంది. ట్రక్కులు, నౌకలు, అంతరిక్షం నుంచి కూడా ఈ వ్యవస్థను మోహరించవచ్చని తెలుస్తోంది. టిపిజి 1000సి కన్నా ముందు చైనా వద్ద హారికేన్ సిరీస్ హైపవర్ మైక్రోవేవ్ (హెచ్‌పిఎం) ఆయుధాలున్నాయి. స్వల్పశ్రేణి గగనతల రక్షణ కోసం వాటిని రూపొందించారు. అవి రెండు నుంచి మూడు కిలోమీటర్ల పరిమిత దూరంలో డ్రోన్లను లక్ష్యంగా చేసుకోగలవు. ఈ క్రమంలో దీర్ఘశ్రేణి లక్ష్యాలను ఎదుర్కోగల వ్యవస్థను చైనా రూపొందించినట్లు పరిశోధకులు వెల్లడించారు.

## సంక్షిప్తంగా..

### పిఓకె భారత్‌లో అంతర్భాగమే: యుఎస్‌టిఆర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** జమ్మూ కాశ్మీర్ త్వరలో పాకిస్థాన్‌లో భాగం అవుతుందని ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కాశ్మీర్ తమదే అని దయాదిదేశం చెబుతుంటుంది. అయితే, నిజంగా జమ్మూ కాశ్మీర్, పిఓకెతో సహా ఎవరిదో అమెరికా స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్-అమెరికా ట్రేడ్ ఒప్పందంతో ఇబ్బందులు పడుతున్న దాయాది దేశానికి, అమెరికా మరోషాక్ ఇచ్చినట్టయింది. పూర్తిగా జమ్మూకాశ్మీర్ ఉన్న భారత మ్యాప్‌ను ప్రదర్శించింది. అమెరికా ట్రేడ్ రిప్రె జెంటేటివ్ (యుఎస్‌టిఆర్) ఆఫీస్ విడుదల చేసిన ఇండియా మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తో సహా మొత్తం జమ్మూ కాశ్మీర్‌ను భారతదేశంలో అంతర్భాగంగా చూపించింది. అమెరికా ప్రభుత్వఅధికారిక పత్రంలోనే ఇలాంటి మ్యాప్ రావడం,పాకిస్థాన్‌ను నిరాశకు గురిచేస్తోంది.

### బెంగళూరు బిజినెస్ మ్యాన్ కిడ్నాప్ కేసు: లేడీ డాన్ అరెస్టు




**బెంగళూరు, ఫిబ్రవరి 7:** ఒకవ్యాపారవేత్తను కిడ్నాప్ చేసిన కేసులో లేడీ డాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన అధి కారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం గతేడాది ఆగస్టులో బెంగళూరుకు చెం దిన రియల్ ఎస్టేట్ వ్యాపారిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు కావడంతో సిసిబి అధికా రులు దర్యాప్తు చేపట్టారు. వ్యాపారి కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్టు చేస్తుంటే, పోలీసులు విధులు నిర్వర్తిం చకుండా లేడీ డాన్ యశస్వినీ గౌడ అడ్డుకుంది. ఆ అభియోగాల కింద రెండు రోజుల క్రితం ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. 47 యేళ్ల యశస్వినిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఏడుకు పైగా కేసులు ఉన్నాయని వెల్లడించారు.

### ముంబయి మేయర్‌కు బిజెపి అభ్యర్థిగా రితూతావ్డే



**ముంబయి, ఫిబ్రవరి 7:** మేయర్ పదవికి సంబంధించి అధికార మహాయుతి కూటమి అభ్యర్థిని ఖరారు చేసింది. బిజెపి కార్పొరేటర్ రితూతావ్డే ఈ బరిలోకి దిగనున్నట్లు ఆ పార్టీ నేత అమిత్ సతమ్ ప్రకటించారు. పార్టీ అగ్ర నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్థానికంగా బిజెపి సీనియర్ నేత అయిన రితూ మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పని చేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. ఇక, డిప్యూటీ మేయర్ పదవికి కూటమి అభ్యర్థిగా శివసేన కార్పొరేటర్ సంజయ్ శంకర్ ఘాడిని ఎంపిక చేసినట్లు సతమ్ వెల్లడించారు. రితూ, సంజయ్‌లు శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. ఫిబ్రవరి 11న మధ్యాహ్నం ఈ మేయర్ ఎన్నిక జరగనుంది.

## సిఎం పదవిపై డికె నిర్వేదం



**బెంగళూరు, ఫిబ్రవరి 7:** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తాజాగా సీఎం పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవిని డీకే ఆశిస్తున్న విషయం బహిరంగ రహస్యమే. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం ఆయననే ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెడుతుందని అంతా భావించారు. అయితే, సీఎం సీటు కోసం పోటీపడ్డ సిద్ధరామయ్య వైపే కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గుచూపింది. డీకే, సిద్ధరామయ్యలతో చర్చలు జరిపి వివాదం రేగకుండా సర్దిచెప్పింది. అప్పట్లో సీఎం సీటును డీకే, సిద్ధూ చెరో రెండున్నర సంవత్సరాలు పంచుకుంటారని, తొలుత సీఎం కుర్చీలో కూర్చున్న సిద్ధరామయ్య ఆ తర్వాత డీకేకు అవకాశం ఇస్తారని ప్రచారం జరిగింది. ఇటీవల ఈ గడువు ముగియడంతో సీఎం మార్పుపై ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, హైకమాండ్ మాత్రం సిద్ధూను కొనసాగిస్తోంది.

## శ్రీశైలంలో రికార్డుస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి

### 24 యేళ్ల చరిత్రలో 2544.763 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రానికి సంబంధించి శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తిలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ కేంద్రం 24 యేళ్ల చరిత్రలో 5 యూనిట్లతోనే ఈ ఏడాది అత్యధికంగా 2544.763 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించింది. జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో ఒక్కో యూనిట్ 150 మెగావాట్ల సామర్థంతో నిర్మించిన 6 యూనిట్లు 2007-08లో 2544.007 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. మళ్లీ ఇప్పుడు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో కేవలం 5 యూనిట్లతోనే ఈ నెల 6వ తేదీ నాటికే 2544.763 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం అధిగమించింది. ఈ నేపథ్యంలో భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో తెలంగాణ జెన్‌కో సీఈ కేవీవీ సత్యనారాయణ, ఎస్ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్, ఇంజనీర్లు, ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

## ఎనర్జీ స్టోరేజీ టెండర్ల గడువు పొడిగింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన 1500 మెగావాట్ల కరెంట్‌ను అందించే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బీఈఎస్ఎస్) టెండర్ల గడువును పొడిగిస్తూ తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో నిర్ణయించింది. ఈ గడువు పొడిగింపును ఈ నెల 9వ తేదీ వరకు పెంచడం జరిగిందని జెన్కో అధికారవర్గాలు వెల్లడించాయి. సౌర విద్యుత్ ఉత్పత్తి జరిగేటప్పుడు తక్కువ ధరకు కరెంట్ లభించే సమయంలో ఓపెన్ యాక్సెస్ నుంచి కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేయాలని, డిమాండ్ ఉన్నప్పుడు విక్రయించాలన్నది ప్రణాళిక. ఈ ప్లాంట్ నుంచి యూనిట్ కరెంటు రూ.2.90లకే లభిస్తుందని, తద్వారా డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో అ ధిక ధరకు కరెంట్ కొనుగోలు చేయాల్సిన ఒత్తిడి నుంచి బయటపడవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. శంకర్‌పల్లి, మహేశ్వరం, చౌటుప్పల్‌లోని బ్యాటరీ స్టోరేజీ యూనిట్ల నిర్మాణం పూర్తయితే ఈ రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుంది. కాగా ఈ బ్యాటరీ ఎనర్జీ విధానంలో మహేశ్వరంలోని 400/220 కేవీ సబ్‌స్టేషన్‌లో 750 మెగావాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. అదేవిధంగా దీంతో పాటు, చౌటుప్పల్‌లోని 440/220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరో 750 మెగావాట్ల ప్లాంట్‌ను బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా బిల్ట్, ఓన్, ఆపరేట్ (బిఒటి) పద్ధతి ప్రకారం వీటి నిర్వహణ చేయాల్సి ఉంటుంది. మరోవైపు శంకర్‌పల్లిలో కూడా 250 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్లాంట్ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అయితే దీనికి సంబంధించి ఇంకా వర్క్ ఆర్డర్ జారీ చేయలేదు.




విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేతకు ప్రభుత్వ కుట్ర

### జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైదాబాద్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయా లని డిమాండ్ చేస్తూ బిసి ఐక్య వేదిక అధ్యక్షుడు నీల వెంకటేష్, జెఏసి చైర్మన్ కదారి శివకుమార్ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఎల్‌బినగర్ నియోజకవర్గం చంపా పేటలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మూడేళ్ల నుండి ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నాయని అన్నారు. పది రోజుల్లోగా రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలను బయట తిరగనివ్వమని, క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని అన్నారు. పేద విద్యార్థులు చదువుకోవడం చూసి ఓర్వలేకే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని ఆయన విమర్శించారు.

## కాంగ్రెస్ గెలుపు పక్కా

### ఎఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్

**సంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచార సరళి, అమలవుతున్న ఎన్నికల వ్యూహాలు, పార్టీ బలాబలపై డిసీసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, జగ్గారెడ్డి తో ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్ శనివారం సంగారెడ్డిలో సమావేశమైయ్యారు. ఈ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్

సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణ వ్యాప్తంగా పర్యటించాను.. మొత్తం తెలంగాణ లో కాంగ్రెస్ హవా నడుస్తోంది. అన్ని మున్సిపాలిటీ లు, కార్పొరేషన్ లను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తోందని, ఇందులో నాకు ఎలాంటి సందేహం లేదన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో అంతులేని అవినీతి తో తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలుజేశారని ఆరోపించారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత 2 లక్షల రుణ మాఫీ, 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్న బియ్యం, ఉచిత బస్సు, రేషన్ కార్డులు జారీ , ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో పేదలకు లబ్ధి జరుగుతోందని, బీజేపీ ఎక్కడై తే పోటీ చేస్తున్న దో.. అక్కడ అభివృద్ధి కంటే... హిందూ , ముస్లిం ల మధ్య గొడవల పై పెట్టి లబ్ధి పొందుతోందని విమర్శించారు.పఠాన్ చెరు నియోజకవర్గం తెల్లాపుర్ లో బీజేపీ వాళ్ళు జ్యోతి రావు పూలే విగ్రహాన్ని ధ్వాసం చేశారన్నారు. అసలు శివాజీ నీ తిరిగి మనుగడ లోకి తీసుకువచ్చిందే జ్యోతి రావు పూలే అని గుర్తు చేశారు.

## జెఎన్‌టియులో 82,547 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు

### 15 విభాగాల నుండి 87 డాక్టోరల్ డిగ్రీలు, 71 బంగారు పతకాలు

### ఘనంగా 14వ స్నాతకోత్సవం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టియు) 14వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కూకట్‌పల్లిలోని యూనివర్సిటీ ఆడిటోరియంలో స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. 82,547 మంది విద్యార్థులకు యుజి, పిజి, పిహెచ్‌డి డిగ్రీలను ప్రదానం చేశారు, వాటిలో 15 విభాగాల నుండి 87 డాక్టోరల్ డిగ్రీలు, 71 బంగారు పతకాలు ఉన్నాయి. యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ టి కిషన్ కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. స్నాతకోత్సవంలో అరబిందో ఫార్మా లిమిటెడ్, హైదరాబాద్, హోల్‌టైమ్ డైరెక్టర్ మెట్టు మదన్‌మోహన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ (ఆనరిస్ కాసా) ప్రదానం చేశారు. ఆయన ఆదర్శ ప్రాయమైన నాయకత్వం, విశిష్ట వృత్తిపరమైన విజయాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు నిరంతర కృషికి గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వీసీ విశ్వవిద్యాలయ నివేదికను సమర్పించారు. తన ప్రసంగంలో మొత్తం 82,547 మంది విద్యార్థులలో 72,210 అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 9,373 పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 729 డాక్టర్ ఆఫ్ ఫార్మసీ డిగ్రీలను ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 82,547 మంది విద్యార్థులలో 26,501 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారు. వారిలో 68 శాతం మంది మహిళా విద్యా ర్థులున్నారు. బంగారు పతకం పొందిన 71 మందిలో 59 మంది మహిళా విద్యార్థులున్నారు. 65,274 మంది విద్యార్థులు బి.టెక్. విభాగాలకు చెందినవారు. జేఎన్ టియుహెచ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్‌లలో ఉద్భవిస్తున్న డిమాండ్‌లకు అనుగుణంగా ఆర్25 కరికులంను అమలు చేసిందని, తెలంగాణలో ఉన్నత విద్యను మార్చడం విజన్- 2047కు మద్దతు ఇస్తుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్, హెల్త్‌కేర్, అర్బన్ మొబిలిటీలో 23 డీప్‌టెక్ స్టార్టప్‌ల ఇంక్యుబేషన్ గురించి మాట్లాడారు. మైటీ, యుజిసి, ఏఐసిటిఈ, డిఎస్‌టి, సిఎస్ఐఆర్ నిధులు సమకూర్చిన రూ. 10.65 కోట్ల విలువైన పరిశోధన ప్రాజెక్టులు అమలు చేయబడుతున్నాయని తెలిపారు. చాలా కాలం తర్వాత 214 మంది పిహెచ్‌డి స్కాలర్‌లకు ప్రవేశం లభించిందని, ఎనిమిది కొత్త పరిశోధన కేంద్రాలు స్థాపించబడ్డాయని వీసీ పేర్కొన్నారు. జర్మనీ, స్వీడన్, జపాన్‌తోపాటు ఇండియాలోని సంస్థలతో 29 అవగాహన ఒప్పందాలు (8 అంతర్జాతీయ, 21 జాతీయ) కుదుర్చుకున్నట్లు తెలిపారు. దాంతోపాటు బ్లెకింగే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్వీడన్‌తో 20 సంవత్సరాల సహకారాన్ని కొనసాగించడం గురించి వీసీ కిషన్ కుమార్ రెడ్డి వివరించారు. యూనివర్సిటీ పరిధిలో 97 అనుబంధ కళాశాలలకు స్వయంప్రతిపత్తి హోదా మంజూరు చేయబడిందన్నారు. 103 కళాశాలలు న్యాక్ గుర్తింపును సాధించాయని, 64 ఎన్‌బిఏ గుర్తింపును పొందాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, అధునాతన ప్రయోగశాలలు, అత్యాధునిక సౌకర్యాలను సృష్టించడానికి కొనసాగుతున్న ప్రాజెక్టులలో అదనంగా రూ. 10.39 కోట్లతోపాటు రూ. 86.48 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయని వీసీ తెలిపారు.




శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న మెట్టు మదన్‌మోహన్‌రెడ్డి

## గిరిజన సహకారంలో అక్రమార్కులకు చెక్

### తిమింగలాలను పట్టుకునేందుకు వల

### క్రిమినల్ కేసుల నమోదుకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సహకార సంస్థ (టీజీజీసీసీ)లో అక్రమార్కులకు చెక్ పెట్టేందుకు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న వారి గుట్టు రట్టు చేసేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌లు, ఎంఎల్ఎస్ పాయింట్లు, డీఆర్ డిపోలు, డీఆర్ గోదాముల నిర్వహణతో పాటు హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలకు అవసరమయ్యే నిత్యావసర సరుకుల కొనుగోళ్లలో జరుగుతున్న భారీ ఆర్థిక అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. గిరిజన సహకార సంఘాల పరిధిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న దోపిడీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి చేరకుండా స్థానిక అధికారులు మేనేజ్ చేస్తున్నట్లు కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈనేపథ్యంలో సంబంధిత విభాగాల్లో నిధులు స్వాహా చేసిన అధికారులు, ఉద్యోగులపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జరుగుతోంది. నిధుల మళ్లింపు, రికార్డుల ఫోర్జరీ తేలితే సంబంధిత డివిజనల్ మేనేజర్ ఆలస్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆ మెమోలో పేర్కొంది. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు, క్రిమినల్ కేసు విచారణ సమాంతరంగా సాగాలని స్పష్టం చేసింది. ఫిర్యాదు చేయడంలో నిర్లక్ష్యం వహించినా లేదా జాప్యం చేసినా సంబంధిత అధికారులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

తాజాగా వెంకటాపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో రూ.19 లక్షల విలువైన 240 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించినట్లు తనిఖీల్లో తేలింది.

ఇక్కడి మేనేజర్, ఇన్‌చార్జ్‌లను సస్పెండ్ చేసినా, నిధుల రికవరీ, క్రిమినల్ కేసుల ప్రక్రియలో తీవ్రజాప్యం జరుగుతోంది. ఇటువంటి వాటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకుని, ఆ దిశగా చర్యలు చేపట్టింది.

## ప్రభుత్వ తీరును తప్పుపట్టిన హైకోర్టు

### చేప పిల్లల పెండింగ్ బిల్లుల వ్యవహారం..

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కింద తెలంగాణ ప్రభుత్వం సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. 2023-24 సంవత్సరంలో చేప పిల్లలు పంపిణీ చేసిన వారికి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్న ప్రభుత్వ వ్యవహార శైలిని హైకోర్టు తప్పుపట్టింది. బిల్లులు చెల్లించాలని, లేదంటే వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించినా అధికారులు ఎందుకు పట్టించుకోలేదని నిలదీసింది. చేప పిల్లలు పెరిగి, పెద్దవి అవ్వడమే కాకుండా వాటిని అమ్మేసి ఆర్థికంగా సొమ్ము చేసుకునే సమయంలో కూడా బిల్లులు చెల్లించాలనే విషయం తెలియలేదా అని ప్రశ్నించింది. వ్యక్తిగత హాజరుకు ఉత్తర్వులు జారీచేసినా అమలు చేయకుండా గడువు కోరడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పెండింగ్ బిల్లులకు సంబంధించిన బకాయిలను చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పింది.

కాగా చేప పిల్లలను సరఫరా చేసినందుకు గాను బిల్లులు చెల్లించాలని 2025లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయడం లేదని సంబంధిత కాంట్రాక్టు సంస్థ, ఇతరులు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేయగా జస్టిస్ టి మాధవీదేవి విచారించారు. పిటిషనర్ తరపు న్యాయవాది డీఎల్ పాండు వాదనలు వినిపిస్తూ కోర్టు ఆదేశాలు అమలుకాకపోవడంతో అధికారులు హాజరుకావాలని ఉత్తర్వులు వెలువడ్డాయని, బడ్జెట్ రూపకల్పనలో ఉన్నామని చెప్పి హాజరు కాకుండా మినహాయింపు కోరారని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాదులు స్పందిస్తూ రూ.8.08 కోట్లు, రూ.17.30 కోట్ల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని, నాలుగు వారాల్లోగా టోకె న్లు జారీ అవుతాయని తెలిపారు. నాలుగు వారాల్లో చెల్లిస్తామని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు, టోకెన్లు జారీ చేసి ఏడాదైనా బిల్లులు చెల్లించని కేసులు కూడా ఉన్నాయని వ్యాఖ్యానించింది. నాలుగు వారాల్లో బిల్లులు చెల్లించి నివేదికను ఇవ్వాలని ఆదేశించింది.

## 9న వ్యవసాయ వర్సిటీలో మెగా స్నాతకోత్సవం

### అంతర్జాతీయ వ్యవసాయ నిపుణుడు ప్రభు పింగళికి గౌరవ డాక్టరేట్

### ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 9న మెగా స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రకటించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 56, 57, 58 స్నాతకోత్సవాలను ఒకే సారి రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గవర్నర్, ఛాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మ అధ్యక్షతన పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని వివరించారు.
దీనికి అంతర్జాతీయ వ్యవసాయ రంగ నిపుణులు ప్రభు పింగళి ముఖ్య అతిథిగా హాజరయ్యి స్నాతకోత్సవ ఉపన్యాసం ఇవ్వనున్నారని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మెగా స్నాతకోత్సవంలో 2,135 మంది అండర్ గ్రాడ్యూయేట్స్, 480 మంది పోస్ట్ గ్రాడ్యూయేట్స్, 129 మంది పీహెచ్‌డీలకు పట్టాలు ప్రదానం చేయనున్నామని తెలిపారు. అదే విధంగా 64 మంది అండర్ గ్రాడ్యూయేట్స్, 26 మంది పోస్ట్ గ్రాడ్యూయేట్స్, ఆరుగురు పీహెచ్‌డీ అభ్యర్థులకు బంగారు పతకాలు అందచేయనున్నట్లు జానయ్య పేర్కొన్నారు. ప్రభు పింగళికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్టు వెల్లడించారు. ప్రభు పింగళి ప్రస్తుతం అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ డెవలప్ మెంట్ ఎ కనమిక్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారని వీసీ జానయ్య తెలిపారు. టాటా కార్నెల్ ఇనిస్టిట్యూట్ ఫర్ అగ్రికల్చర్ అండ్ న్యూట్రీషన్ వ్యవస్థాపక సంచాలకులు కూడా అయిన ప్రభు పింగళి గతంలో ఇక్రి సాట్ గవర్నింగ్ బోర్డ్ చైర్మన్‌గానూ, గేట్స్ ఫౌండేషన్‌లోని అగ్రికల్చర్ డెవ లెపమెంట్ విభాగానికి డిప్యూటీ డైరెక్టర్‌గానూ, యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ సంచాలకులుగానూ, ఫిలిప్పైన్స్‌లోని అంతర్జాతీయ వరి సంస్థలోనూ, ఇతర అనేక సంస్థలలోనూ ప్రభు పింగళి కీలక బాధ్యతలు నిర్వహించారని వివరించారు.

## అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో కొత్త కోర్సు

### టిసిఎస్ అయాన్ సహకారంతో ప్రత్యేక కోర్సు ప్రారంభం

### వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కొనసాగుతున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కొత్త కోర్సును ప్రారంభించనున్నారు. డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగం సంపాదించే విద్యార్థి కలను సాకారం చేస్తూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్ అయాన్)తో కలిసి జాబ్ అచీవర్- బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇది విద్యార్థులకు బంగారు బాట వేయనుందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఈ ప్రోగ్రాంలో అడ్మిషన్స్ జరుగుతున్నాయని, ఇప్పటికే మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇందులో చేరడానికి మార్చి 15 చివరి తేదీ తుది గడువుగా పేర్కొన్నారు.
శనివారం క్యాంపస్‌లో టిసిఎస్ ప్రోగ్రాం డైరెక్టర్ లీనా టిప్రే, ప్రతినిధి నరేందర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ రాబింద్రనాథ్ సోలమన్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పి. వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఐటీ, సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ రంగాల్లో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఇది గొప్ప వరమని విసి తెలిపారు. ఈ ప్రోగ్రామ్ కేవలం శిక్షణకే పరిమితం కాకుండా, టిసిఎస్‌తో అనుసంధానమై ఉన్న 3,000 పైగా కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలను కల్పించేలా శిక్షణను ఇస్తుందని వెల్లడించారు. బిజినెస్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్, సేల్స్, అడ్మిన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి విభిన్న రంగాల్లో విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు ప్రధాన లక్ష్య మ న్నారు. జాబ్ అచీవర్ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో చేరిన విద్యార్థులకు .. ఎం.ఎస్.ఆఫీస్, సిఆర్ఎం టూల్స్, ప్రాసెస్ మేనేజ్‌మెంట్, ఇంటర్వ్యూ స్కిల్స్ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు.
ప్రత్యేక ఎల్.ఎం.ఎస్. ప్లాట్‌ఫార్మ్‌పై రూపొందించిన మాడ్యుల్స్ ద్వారా విద్యార్థులు సొంతంగా ఆన్‌లైన్‌లో ప్రాక్టీసు చేస్తూ సులభంగా ఈ ప్రత్యేక కోర్సు నేర్చుకోవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం నిపుణులతో లైవ్ చాట్ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు.
కేవలం థియరీ మాత్రమే కాకుండా, నేరుగా పరిశ్రమలకు సంబంధించిన ప్రాజెక్టులలో పని చేసే అవకాశం కూడా విద్యార్థులకు లభిస్తుందని విసి తెలిపారు.
కోర్సు పూర్తయిన తర్వాత లభించే టిసిఎస్ అయాన్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికేట్, వేలాది కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు బాటలు వేస్తుందన్నారు. విశ్వ విద్యాలయంలో బి.ఏ, బి.కామ్, బి.ఎస్సీ చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థులందరూ ఈ ప్రోగ్రామ్‌లో చేరడానికి అర్హులని విసి చక్రపాణి తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విసి ఆచార్య ఘంటా చక్రపాణి, టిసిఎస్ ప్రతినిధులు, ఆచార్యులు.



సంత్ నిరంకారి సమాగం ప్రారంభోత్సవంలో సద్గురు మాత సుదీక్షజీ మహారాజ్, నిరంకారి రాజపిత రమిత్‌జీలు

## ఘనంగా ప్రారంభమైన దక్షిణభారత సంత్ నిరంకారి సమాగం

**హైదరాబాద్ (ముషీరాబాద్,) ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** దక్షిణ భారత్ సంత్ నిరంకారి సమాగం సద్గురు మాత సుదీక్షజీ మహారాజ్, నిరంకారి రాజపిత రమిత్‌జీల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభమైన నిరంకారి సంత్ సమాగం ప్రేమ, శాంతి, సామరస్యం, ఏకత్వం సార్వత్రిక సందేశాన్ని వ్యాప్తి చేయటానికి అంకితమైందని సమన్వయకర్త ప్రేమల్ సింగ్ తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించే ఈ సంత్ సమాగం దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది మంది పాల్గొంటారని ఆయన తెలిపారు. సంత్ నిరంకారి మిషన్ అనేది ప్రపంచవ్యాప్త ఆధ్యాత్మిక ఉద్యమమని, ఇది మానవాళి సంక్షేమం వైపు సమష్టి ప్రతిబింబాన్ని ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యగీతాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి.

## సిఎంపై జాతీయ మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్‌కు బిజెపి ఫిర్యాదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ పర్యటనలో బీఆర్ఎస్, బీజేపీలను అవిభక్త కవలలైన వీణవాణిలతో పోల్చుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. సీఎం వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిపై జాతీయ మానవ హక్కుల సంఘం, జాతీయ మహిళా కమిషన్‌కు బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఫిర్యాదు చేశారు. అవిభక్త కవలలైన వీణవాణిల పేర్లను పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయాల కోసం, ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి మానవత్వం మరిచి మాట్లాడుతున్నారని అరవింద్ మండిపడ్డారు. సీరియస్ పొలిటీషియన్‌గా ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని సీఎంకు హితవు పలికారు. బీజేపీ-బీఆర్ఎస్‌ది ఫెవీకాల్ బంధం అని చేసిన విమర్శలపై ఎలాంటి అభ్యంతరం లేదని కానీ వీణవాణిలతో పోల్చడం సరికాదన్నారు.

## సూరారంలో మహిళా డాక్టర్ ఆత్మహత్య

**హైదరాబాద్ (జీడిమెట్ల), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఓ మహిళా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా నగర్‌లో నివాసముండే బత్తిని అనిత (29) మల్లారెడ్డి హాస్పిటల్‌లో ఫిజియో థెరపి డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఏమైందో తెలియదుగానీ అవివాహి తురాలైన అనిత శనివారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదుచేసి, మృతికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. పోస్ట్‌మార్టం నివేదికతోపాటు కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



బత్తిని అనిత (ఫైల్)

## మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షకు 7,578 దరఖాస్తులు

### ఏప్రిల్ 19న ఎంట్రన్స్ టెస్ట్

### 28 వరకు దరఖాస్తుల స్వీకరణ

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న 194 మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో సీట్లను భర్తీ చేయడం కోసం నిర్వహించే అడ్మిషన్ టెస్ట్‌ను ఏప్రిల్ 19న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు 7578 దరఖాస్తులు వచ్చినట్టు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిం చనున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఏప్రిల్ 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఏప్రిల్ 19న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. అన్ని మోడల్ స్కూల్స్‌లో ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. జనరల్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రుసుం రూ. 200 కాగా, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ. 125గా నిర్ణయించారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 5018 మంది, 7వ తరగతిలో ప్రవేశాలకు 1024, 8వ తరగతిలో చేరడానికి 893 మంది, 9వ తరగతిలో చేరడానికి 528 మంది, 10వ తరగతిలో చేరడానికి 116 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరో 447 మంది ఫీజును చెల్లించినప్పటికీ .. దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సి ఉందని డైరెక్టర్ తెలిపారు.

## మేయర్, చైర్మన్ ఎన్నికల్లో పార్టీ విప్ ధిక్కరిస్తే కఠిన చర్యలే

### కీలక సర్క్యులర్ జారీ చేసిన స్టేట్ ఎలక్షన్ కమిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో విప్ జారీ ఉంటుంది. విప్ ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి అవకాశముంది. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం జారీచేసింది. ఈ నెల 16వ తేదీన కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహించి మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించనున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరఫున ఎన్నికైన ఏ సభ్యుడైనా సదరు ఎన్నికల్లో పార్టీ విప్‌ను ధిక్కరిస్తే, పార్టీ విప్‌గా నియమించబడిన వ్యక్తి, ఎన్నిక జరిగిన తేదీ నుండి 3 రోజులలోపు సభ్యుని పేరును స్పష్టంగా పేర్కొంటూ జిల్లా కలెక్టర్ ద్వారా గుర్తించబడిన వ్యక్తి రాతపూర్వక నివేదికను పంపించాలి. పార్టీ విప్ నుండి రాతపూర్వక నివేదిక అందిన తర్వాత, కలెక్టర్ ద్వారా గుర్తించబడిన వ్యక్తి సంబంధిత సభ్యునికి ఒక షోకాజ్ నోటీసును జారీ చేసి, అతను/ఆమె పదవిలో కొనసాగడానికి ఎందుకు అనర్హుడిగా ప్రకటించకూడదో వివరణ ఇవ్వాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే, నోటీసు తేదీ నుండి 7 రోజులలోపు తన వాదనను సమర్పించాలని కోరాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ చేత గుర్తించబడిన వ్యక్తి, సంబంధిత సభ్యుడు ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకుని, విప్ ఆదేశాన్ని ధిక్కరించినందుకు సభ్యుని సభ్యత్వం రద్దు చేసే విషయంలో, వివరణ అందిన రెండు రోజులలోపు ఒక సవివరమైన ఉత్తర్వును జారీ చేయాలి. దీంతోపాటు, సంబంధిత సభ్యుల నుండి ఏడు రోజులలోపు ఎటువంటి వివరణ అందకపోతే, జిల్లా కలెక్టర్ చేత నియమించబడిన వ్యక్తి 7 రోజుల గడువు ముగిసిన తర్వాత రెండు రోజులలోపు అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా ఒక ఉత్తర్వును జారీ చేయాలి. ఇదిలా ఉండగా, మేయర్,డిప్యూటీ మేయర్,చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించడానికి నియమించిన అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం శిక్షణ నిర్వహించింది. మాస్టర్ ట్రైనీల ద్వారా వర్చువల్‌గా నిర్వహించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇదిలా ఉండగా, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసిసి)లో భాగంగానే రూ.2,02 కోట్లను సీజ్ చేశారు. వీటిలో నగదు రూ.89.30లక్షలు ఉన్నాయి. రూ.84.89 లక్షల విలువైన లిక్కర్,రూ.13.27 లక్షల విలువైన డ్రగ్స్,నార్కోటిక్స్ ఉన్నాయి. వీటితో పాటు రూ.14.69లక్షల విలువైన బంగారం,వెండి ఉన్నాయి. మరో రూ.78వేల విలువైన ట్యాబ్స్,ఇతర వస్తువులు ఉన్నాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

# విజయంతో బోణీ

## అమెరికా జట్టుపై 29 పరుగుల తేడాతో భారత్ విజయం!



**ముంబయి, ఫిబ్రవరి 7:** ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026లో భారత్ తన ఆరంభ మ్యాచ్‌ని విజయంతో ప్రారంభించింది. యూఎస్ఏపై బ్యాటర్లు విఫలమైనప్పటికీ బౌలర్లు రాణించడంతో విజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ అద్భుత బ్యాటింగ్‌కి తోడు మొహమ్మద్ సిరాజ్ కమ్ బ్యాక్ బౌలింగ్‌తో టీమిండియా 29 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత్ యూఎస్ఏ మధ్య వాంఖడే వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మోనాంక్ పటేల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. యూఎస్ఏ పేస్ బౌలర్ల ధాటికి టీమిండియా టాప్ ఆర్డర్ విఫలమైంది. అభిషేక్ శర్మ, శివమ్ దుబే గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరగగా ఇషాన్ కిషన్, తిలక్ వర్మ తక్కువ పరుగులకే పెవిలియన్ బాట పట్టారు. రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ కూడా ఫెయిలయ్యారు. అయితే కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ ఆఖరి వరకూ నిలబడి ఒంటరి పోరాటంతో 84 పరుగులు చేసి జట్టు స్కోర్‌ను 161కి తీసుకెళ్లాడు. టీమిండియా అందించిన 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఎస్ఏ జట్టును టీమిండియా పేసర్లు ఆరంభంలోనే దెబ్బ తీశారు. ఆఖరి నిమిషంలో జట్టులోకి వచ్చిన మొహమ్మద్ సిరాజ్ అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ కూడా రాణించడంతో యూఎస్ఏ జట్టు కేవలం 13 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ ఇద్దరే పవర్ ప్లే మొత్తం బౌలింగ్ చేయడంతో యూఎస్ఏ 31 పరుగులు మాత్రమే చేయగలిగింది. నాలుగు ఓవర్లకే మూడు వికెట్లు కోల్పోయిన జట్టును మిలింద్ కుమార్ సంజయ్ కృష్ణమూర్తి ముందుకు తీసుకెళ్లారు. ఈ ఇద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 34 బంతుల్లో మూడు ఫోర్లు, 1 సిక్సర్‌తో 34 పరుగులు చేసిన మిలింద్ కుమార్ వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో స్టంప్ అవుట్ అయ్యాడు. దాంతో 12 ఓవర్లకు యూఎస్ఏ 71 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. అప్పటికే మ్యాచ్ చేజారి పోయినప్పటికీ సం జయ్ కృష్ణమూర్తి కాసేపు పోరాడాడు. 31 బంతులు ఆడిన సంజయ్ ఒక ఫోర్, రెండు సిక్సర్లతో 37 పరుగులు చేసి సిక్సర్‌కి ప్రయత్నించి బౌండరీ లైన్ వద్ద దొరికిపోయాడు. సంజయ్ అవుటైన వెంటనే హర్మీత్ సింగ్ కూడా గోల్డెన్ డకౌట్ అవుటయ్యాడు. శుభమ్ రంజనే ఆఖర్లో 22 బంతుల్లో పరుగులతో పోరాడిన ఫలితం లేకుండా పోయింది. నిర్ణీత 20 ఓవర్లలో యూఎస్ఏ 8 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. దాంతో భారత్ 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లలో మొహమ్మద్ సిరాజ్ మూడు వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. వరుణ్ చక్రవర్తికి ఒక వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. 49 పరుగుల్లో 84 పరుగులుచేసి అద్భుత ప్రతిభను చూపించాడు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

### స్వయంసహాయక సంఘాలకు సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లు

### ముమ్మరంగా కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును ప్రారంభించింది. ఈ పథకం మహిళా స్వయంసహాయక సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పెండింగ్ లేకుండా చెల్లించడం, ప్రభుత్వపరంగా అందించే ప్రోత్సాహంతో పరిశ్రమలు, వ్యాపారరంగాల్లో రాణిస్తుండడంతో ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు సైతం ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ద్వారా రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వారికి సౌర విద్యుత్ ప్లాంట్లను అప్పగించాలని భావించింది. గ్రామంలోని స్వయం సహాయక సంఘాల సమన్వయంతో పనిచేసే గ్రామ సమాఖ్యకు ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను అప్పగించబోతోంది. తొలుత ప్రతీ జిల్లాకు ఒక పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది.

ప్రతి ప్లాంట్‌ను నాలుగు ఎకరాల్లో ఏర్పాటు చేయబోతున్నట్టు , ఒక్కో ప్లాంట్ 0.5 మెగావాట్ల ఉత్పత్తికి 1.50 కోట్లు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. 25 ఏళ్ల అగ్రిమెంట్ చేసుకోవడం ద్వారా మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఈ సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లు దోహదపడతాయని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం హైదరాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని ఆలయ భూములను గుర్తించారు. మొత్తంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల సాధికారత, స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిని ప్రారంభించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

## కోఠి కాల్పుల కేసు నిందితులు అదుపులోకి..

### విచారిస్తున్న సిసిఎస్ స్పెషల్ టీమ్

**హైదరాబాద్ (గోషామహల్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కోఠి ఎస్.బి.ఐ ఎ.టి.ఎం వద్ద జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పాతబస్తీకి చెందిన ఓ వ్యక్తినిఇ పోలీసు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. జనవరి31న కోఠి ఎ.టి.ఎం. వదనద నగదు డిపాజిట్ చేయడానికి వచ్చిన వ్యాపారి రిషిద్ ఇద్దరు దుండగులు కాల్పులు జరిపి రూ: 6లక్షలు దోచుకెళ్లిన సంగతి తెలిసిందే. కాల్పుల జరిపిన అనంతరం పరారైన నిందితులకు,ఈ పాతబస్తీ వ్యక్తి ఆశ్రయం కల్పించినట్లుగా పోలీసులు గుర్తించారు.నిందితులుల తప్పించుకోవడానికి ఇతను సహకరించినట్లు ఆధారాలు లభించడంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు.ప్రస్తుతం నగరం క్రైమ్ సెంట్రల్ స్టేషన్ ప్రత్యేక బృందం అరెస్ట్ చేసిన వ్యక్తిని రహస్య ప్రదేశంలో విచారిస్తుందన్నారు.నిందితులు ఎక్కడి నుంచి వచ్చారు.?అనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు.కాగా కేరళకు చెందిన వస్త్రా వ్యాపారి రిషీద్ జనవరి 31 నగదు డిపాజిట్ చేసేందుకు ఏటిఎం వద్దకు రాగా ప్రక్కాప్లాన్‌తో వచ్చిన ఇద్దరు నిందితులు అతడి కాలుపై కాల్పులు జరిపి స్కూటితో సహా నగదును అపహరించారు.నిందితులు పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద,స్కూటిని వదిలివేసి ఆపై పాత బస్తీ వైపు పరారైనట్లు,సిసిటివి పుటేజ్,సెల్ టవర్ డంపింగ్ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులకు,పాతబస్తీలో నిందితులు ఆశ్రయం పొందినట్లు క్లూ లభించింది. సిసిఎస్ పోలీసులు ఈ కేసులో పురోగతి సాధించేందుకుగాను అన్ని కోణాలను కృషి చేస్తున్నారు.

## ‘అరెస్ట్’ ఎప్పుడు చేయాలంటే..

### పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** కేసు విచారణలో భాగంగా ఎవరినైనా ప్రశ్నించేందుకు అరెస్టు చేయడం సరికాదని దేశ అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ముఖ్యంగా ఏడేళ్లలోపు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో ఎడాపెడా అరెస్టులు కుదరవని స్పష్టం చేసింది. కేవలం ప్రశ్నించాలనే కారణంతో అరెస్టు చేయడాన్ని తప్పుబట్టింది. దర్యాప్తులో భాగంగా తప్పనిసరి అని భావించినపుడు ముందస్తుగా నోటీసు జారీ చేశాక అరెస్టు చేయాలని పోలీసులకు సూచించింది. భారత న్యాయ సంహిత ప్రకారం నోటీసులు జారీ చేసినప్పటికీ అరెస్టు తప్పనిసరి కాదని తేల్చి చెప్పింది. ఈ మేరకు సతేందర్‌కుమార్ అంటిల్ వర్సెస్ సిబిఐ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్‌కె సింగ్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛతో కూడుకున్న విషయం కాబట్టి అరెస్టుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు సూచించింది. క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదు అందిన తర్వాత రెండు దశల పద్ధతిని పాటించాలని దర్యాప్తు అధికారికి కోర్టు సూచించింది. సదరు కేసు విచారణలో అరెస్టు తప్పనిసరా? కాదా? బిఎన్ఎస్ సెక్షన్ 33, సెక్షన్ 35 ప్రకారం అరెస్టు చేయవచ్చా? లేదా? అనేది వ్యక్తిగతంగా నిర్ణయించుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఆర్టికల్ 21 ప్రకారం పౌరులకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున నిందితులు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని నిందితుడు, సహ నిందితుడనే బేధాలు ఏవీ మినహాయింపు కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్టుకు సంబంధించి పోలీసులకు చట్టం కల్పించిన మినహాయింపులను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బిఎన్ఎస్ సెక్షన్ 35(1) (బి) ప్రకారం ఎలాంటి వారెంట్ లేకుండా పోలీసులు అరెస్టు చేయవచ్చనే నిబంధనను ప్రస్తావిస్తూ ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా పోలీసులు అరెస్టు చేయవచ్చనే నిబంధనను ప్రస్తావిస్తూ ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయవచ్చని భావించరాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

# మూడు రోజుల్లో రూ.8.06 కోట్ల ఆదాయం

### సమ్మక్క-సారక్క జాతర హుండీల లెక్కింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 7:** సమ్మక్క-సారక్క జాతర-2026 సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హుండీల లెక్కింపు మూడో రోజు కూడా హనుమకొండలోని టిటిడి కళ్యాణ మండపంలో కొనసాగింది. దేవాదాయ శాఖ అధికారులు, సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో ఈ లెక్కింపు ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది.జాతరకు సంబంధించి మొత్తం 828 హుండీలు ఏర్పాటు చేయగా, ఇందులో 780 ఇనుప హుండీలు, 45 వస్త్ర హుండీలు, 3 బియ్యం హుండీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడో రోజు 140 హుండీలను తెరిచి లెక్కించగా, వాటి ద్వారా రూ.2,01,21,440/ ఆదాయం లభించింది.

అదనంగా విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.71,283/ ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 5న 125 హుండీల లెక్కింపులో రూ.2,49,65,000/, ఫిబ్రవరి 6న 160 హుండీల లెక్కింపులో ..రూ.3,54,25,200/ ..తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.63,436/ ఆదాయం లభించింది. మూడు రోజుల వ్యవధిలో మొత్తం 425 హుండీలను లెక్కించగా, కలిపి రూ.8,06,46,359/ ఆదాయం సమకూరినట్లు అధికారులు స్పష్టం చేశారు.మూడో రోజు లెక్కించిన నగదులో నుంచి రూ.2,01,92,723/ మొత్తాన్ని పర్యవేక్షణాధికారుల సమక్షంలో బ్యాంకు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. బంగారం, వెండి కానుకలను వేర్వేరుగా ఇనుప హుండీలలో భద్రపరచి భద్రంగా ఉంచినట్లు పేర్కొన్నారు. నాణేల లెక్కింపు ఇంకా ప్రారంభం కాలేదని వెల్లడించారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదంపై కెటిఆర్ అనుమానాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కేటీఆర్ స్పందించారు. కాగా, బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ కూడా ట్విట్టర్ వేదికగా స్పందించారు. మొత్తం ల్యాబ్ కాలిపోతుంది.. ఏ ఆధారాలు నాశనం చేశావు అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

# పంచాయతీల్లో పైసల పంచాయితీ!

### నిధులు విడుదలైన ప్రతీసారి ఇదే తంతు

### పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని పట్టుబడుతున్న మాజీ సర్పంచ్‌లు

### ఆ నిధులను అభివృద్ధి పనులకే కేటాయించాలంటున్న కొత్త సర్పంచ్‌లు

**హైదరాబాద్,ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** పల్లెల్లో నూతన పాలకమండళ్లు ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభివృద్ధి నిధులు విడుదలవుతున్న ప్రతీసారి పెండింగ్ బిల్లుల పంచాయతీల్లో పంచాయితీ రాజుకుంటోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.277 కోట్లను విడుదల చేయగా... తాజాగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.259 కోట్లను తొలివిడతగా విడుదల చేసింది. ఈ పరిస్థితుల్లో విడుదలైన నిధుల కోసం ఇటు పంచాయతీ కార్యదర్శులు, అటు కొత్త, పాత సర్పంచుల నడుమ పంచాయితీ కొనసాగుతోంది. పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ కాగానే పెండింగ్ బిల్లుల విషయంలో ముందుగా తమకంటే తమకే నిధులు కేటాయించాలంటూ పంచాయతీ సెక్రటరీలు, కొత్తసర్పంచులు, మాజీ సర్పంచులు ఎవరికి వారే పట్టుబడుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో పల్లెల్లో నిధుల కేటాయింపు గొడవ తారాస్థాయికి చేరుతోంది. ఈ ఏడాది జనవరిలో పంచాయతీలకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.277 కోట్లను కేటాయించారు. ఆ సమయంలోనూ నిధులను ముందుగా తమకే కేటాయించాలని పంచాయతీ సెక్రటరీలు, కొత్త సర్పంచులు, మాజీ సర్పంచులు పట్టుబట్టారు. తాజాగా కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద పెండింగ్ నిధుల్లో తొలి విడతగా రూ.259కోట్లను విడుదల చేయడంతో మరోసారి పల్లెల్లో నిధుల గొడవ జరుగుతోంది. తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు చివరిసారి 2023 సెప్టెంబర్‌లో ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి.తర్వాత మల్టీపర్పస్ వర్కర్లకు జీతాల కోసం తప్ప అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు విడుదల కాలేదు. బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా మాజీ సర్పంచ్‌లు.. శ్మశాన వాటికలు, విలేజ్ పార్కులు, రైతువేదికలు, వైకుంఠదామాలు, నర్సరీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి నిర్మాణాలు చేపట్టారు. వీటికి సంబంధించి గత ప్రభుత్వం సుమారు రూ.531 కోట్ల దాకా బిల్లులు పెండింగ్ పెట్టింది. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వకపోవడంతో అవి కాస్తా తడిసి మోపెడయ్యాయి. ఈ క్రమంలో పలువురు ఆత్మహత్య కూడా చేసుకున్నారని, తాజాగా విడుదలైన నిధులను తమకు కేటాయిస్తే అప్పులు కట్టుకుంటామని మాజీ సర్పంచులు చెప్తున్నారు. ప్రస్తుత నిధులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవని, అందువల్ల వాటిని తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకే కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముందు పాత బకాయిలు క్లియర్ చేయాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. పాత బాకీలు తీర్చకుండా కొత్త పనులు ఎలా చేస్తారని అధికారులను నిలదీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచులకు దాదాపు రూ.531 కోట్లకుపైగా బకాయి ఉంది.2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో మాజీ సర్పంచులు అభివృద్ధి పనులు చేశారు. కాగా, 2023 ఫిబ్రవరి 1 నుంచి మొన్నటి సర్పంచ్ ఎన్నికల వరకు పంచాయతీ కార్యదర్శులు రెండేళ్లుగా తమ జేబుల్లోనుంచే పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి పనుల కోసం నిధులు ఖర్చు చేశామని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. 2023 ఫిబ్రవరి 1 నుంచి పల్లెలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వచ్చాయి. అప్పులు తెచ్చి మరీ పారిశుధ్య పనులు నిర్వహించామని, డీజిల్‌కు, ట్రాక్టర్ ఈఎంఐలకు పెద్దమొత్తంలో ఖర్చు చేశామని చెప్తున్నారు. చిన్న పంచాయతీల్లో దాదాపు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు, పెద్ద పంచాయతీల్లో రూ.5 నుంచి 10 లక్షల వరకు పెట్టామని, తమ జీతాలను సైతం ఇందుకే వినియోగించామని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

## ఓటుకు నోటు ఆధారాలను ధ్వంసం చేయడానికేనా?

### ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై అనుమానం: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి7:** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఓటుకు నోటు ఆధారాలను ధ్వంసం చేయడానికేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.దీనిని రీట్వీట్ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు అత్యంత కీలకమైన,గట్టి భద్రత ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం జరగడం పలు అనుమానాలకు తావిస్తోందని, అనేక సున్నితమైన కేసులకు సంబంధించిన ఆధారాలు(2015 నాటి ఓటుకు నోటు కేసుతో సహా) ఇందులో భద్రపరచి ఉన్నాయని పేర్కొన్నారు. వాటి పరిస్థితి ఏమిటి? దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు.

## నీటిపారుదలశాఖ ఇఎన్‌సిగా ఓలేటి వెంకటరమేష్

### నియామక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదలశాఖ ఈఎన్సీ(జనరల్)ని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరిగేషన్‌శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్‌సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటోరియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజినీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు.

## 17వ అంతస్తునుంచి దూకేసిన షోలాపూర్ వ్యాపారి




**షోలాపూర్, ఫిబ్రవరి 7:** మహారాష్ట్రలోని షోలాపూర్ లో వ్యాపారవేత్త, ముల్తానీ బేకరీ యజమాని సునీల్ మోతీలాల్ సందరంగానీ (59) 17 అంతస్తుల భవనం నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. భవనం నుంచి దూకడానికి ముందు ఆయన అదే స్థలంలో చేతులు జోడించి దేవుడిని ప్రార్థించారు. వెల్లకిలా పడుకుని కూడా దేవుడిని ప్రార్థించారు. అనంతరం ఆయన కిందకు దూకుతున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో కనిపించింది. కొన్నేళ్లుగా పుణేలో నివసిస్తున్న ఆయన, ఇటీవల షోలాపూర్ తిరిగి వచ్చారు. నిన్న మధ్యాహ్నం విజయపూర్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న పనాష్ అపార్ట్‌మెంట్స్‌కు తన కారులో చేరుకుని, మెట్లు మార్గంలో 17వ అంతస్తుకు వెళ్లారు. టెర్రస్ అంచున నిల్చొని దేవుడికి ప్రార్థన చేశారు. అతని కదలికలను గమనించిన కొంతమంది భవనం సెక్యూరిటీ గార్డులకు సమాచారం అందించారు. దీంతో సెక్యూరిటీ గార్డు త్వరగా పైకి వెళ్లి అతనిని కిందకు తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. పదో అంతస్తుకు చేరుకున్న అనంతరం, తన కారు కీని పైనే మరిచిపోయానని సునీల్ మోతీలాల్ మళ్లీ పై అంతస్తులకు వెళ్లి కిందకు దూకేశాడు. తీవ్రంగా గాయపడిన అతనిని ఆసుపత్రికి తరలించే లోపు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అతని ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

## భారత్‌లో రొమ్ముకేన్సర్ కేసులు 13 శాతం పెరుగుదల

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** భారతదేశంలో మహిళల ఆరోగ్యానికి క్యాన్సర్ తీవ్రమైన సవాలుగా మారింది. రాజ్యసభలో ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్రరావు జాదవ్ ఇటీవల సమర్పించిన డేటా దాని తీవ్రతను వివరిస్తుంది. ప్రభుత్వ డేటా ప్రకారం, 2021-25 మధ్య కొత్త రొమ్ము క్యాన్సర్ కేసులు, మరణాలలో 13 శాతం పెరుగుదల ఆందోళనకరంగా ఉంటుందని అంచనా. మంత్రిత్వ శాఖ ప్రకారం, 2026 నాటికి కొత్త రొమ్ము క్యాన్సర్ కేసుల సంఖ్య 2.40 లక్షలు దాటుతుందని అంచనా. ఇది దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు గణనీయమైన సవాలును కలిగిస్తుంది. అయితే, డేటా విశ్లేషణ ప్రకారం మరణాల పరంగా అండాశయ క్యాన్సర్ అత్యంత ప్రాణాంతకం. మరణాల రేటు దాదాపు 61 , తరువాత గర్భాశయ క్యాన్సర్ 54 , రొమ్ము క్యాన్సర్ 43 ఉన్నాయి.

# ఈసారి విరగబూసిన మామిడి తోటలు

### మూడేళ్లుగా నష్టాలు చవిచూస్తున్న మామిడి రైతులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఈ యేడాది మామిడి దిగుబడిపై రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ సారి వాతావరణం అనుకూలించడంతో మామిడి పూత విపరీతంగా వచ్చింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మామిడి తోటలు విరగబూసి రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. కొమ్మ కొమ్మన విరిసిన పసుపు రంగు మామిడి పూత ఉండడంతో ఈసారైనా మామిడి సాగు లాభదాయకంగా ఉంటుందా..? లేక ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఆదాయం అంతంతమాత్రమేనా అన్న ఆందోళన మామిడి రైతుల్లో నెలకొంది. ఇప్పుడున్న విధంగానే వాతావరణం అనుకూలించి నాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయని తద్వారా మార్కెట్‌లో మంచి ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి తోటల్లో పూత స్థితి సంతృప్తికరంగా ఉండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.అకాల వర్షాలు, ఈదురుగాలుల రూపంలో ప్రకృతి ప్రకోపం చూపించకపోతే ఈ ఏడాది మామిడి సీజన్ రైతులకు లాభదాయకంగా ఉండనుంది. గత మూడు సంవత్సరాలుగా మామిడి సాగు రైతులకు లాభసాటిగా ఉండని పరిస్థితి నెలకొంది. మూడేళ్లుగా వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో చీడపీడలు, తెగుళ్లు మామిడి కాతపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపాయి. మధ్యలో చలి కారణంగా పూత, పిందె రాలిపోయేంది. ఇలాంటి పరిస్థితుల్లో గత మూడేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం మామిడి పూత ఆశాజనకంగా ఉంది. అయితే పూత పిందెగా పరిణామం చెందే సమయంలో, కాయలు కాసిన సమయంలో వేసవి ఎండలు, వడగాలులు, అకాల వర్షాల భయం అన్నదాతలను వెంటాడుతోంది. వాస్తవానికి రాష్ట్రంలో మామిడి సాగు క్రమంగా పెరుగుతోంది. 2021-22 ఏడాదిలో రాష్ట్రంలో 3.21లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా ప్రస్తుతం 6 లక్షల ఎకరాలకు పెరిగింది. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా సగటు ఎకరం సాగుకు రూ.40 నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుందని మామిడి రైతులు చెబుతున్నారు. మార్కెట్లో మామిడికి టన్ను ధర కనిష్ఠంగా రూ.35 వేలు, గరిష్ఠ ధర రూ.75 వేల చొప్పున లభిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పూత సమయంలో వాతావరణం మామిడి సాగుకు అనుకూలించినట్లుగానే చివరి వరకు వాతావరణం అనుకూలిస్తే ఈ ఏడాది మామిడిసాగు రైతులకు లాభసాటిగా మారనుంది. మామిడి కాయల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తోంది. మామిడి తోటల సాగు విస్తీర్ణంలో దేశంలోనే తొమ్మిదో స్థానంలో నిలిచిన తెలంగాణ.. ఉత్పత్తిలో మాత్రం అయిదోదో స్థానంలో నిలవడం విశేషం. తెలంగాణలో క్రమంగా మామిడి సాగు, ఉత్పత్తి పెరుగుతున్నట్టు తెలిపింది. మామిడి ఉత్పత్తిలో 47.27 లక్షల టన్నులతో ప్రతీ ఏడాది ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలుస్తోంది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో, కర్ణాటక మూడో స్థానంలో, బీహార్ నాలుగో స్థానంలో నిలుస్తున్నాయి. మామిడి పంట రైతుల ఆదాయానికి ప్రధాన ఆధారం కావడంతో పూత నుంచి కాయ దశ వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పూత, కాత దశలో ఈదురు గాలులు, అకాల వర్షాలు లేకపోతే మామిడి సాగు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న ఎస్ఇసి

### ఎన్నికల జాబితాల రూప కల్పన, సవరణకు ఆదేశాలు

**విజయవాడ.ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఇసీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్ని సజావుగా నిర్వహించేందుకు వీలుగా ఎన్నికల జాబితాల సవరణ,నూతన ఓటర్ల లిస్టు రూపకల్పనకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికారులు ఈ ప్రక్రియపై నిమగ్నమవుతున్నారు. అలాగే ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపైనా క్లారిటీ వస్తోంది.గ్రామపంచాయితీ ఎన్నికల కోసం ఓటర్ జాబితాలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం, రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన వార్డు వారీ ఫోటో ఓటరు జాబితాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. 01.01.2026ను అర్హత తేదీగా తీసుకుని అసెంబ్లీ ఓటరు జాబితాలను ఆధారంగా చేసుకుని ఈ జాబితాలు తయారు చేయాలని ఆదేశించింది.జాబితా రూపకల్పన విధులకు మార్గదర్శకాలు జారీ చేసింది. సవరించిన ఓటరు జాబితాలను మార్చి 9న అధికారికంగా ప్రచురించబోతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ దృష్ట్యా ఈ ప్రక్రియ చేపట్టబడుతున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.ఈ లెక్కన మార్చి 9న ఓటరు జాబితాల్ని ప్రచురిస్తే..ఆ తర్వాత అయినా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. నియోజకవర్గాల పునర్ విభజన, జనాభా గణనతో వీటికి ఎలాగో సంబంధం లేదు కాబట్టి ఈ ఏడాదిలోనే నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



# సమస్యలను సవాల్‌గా తీసుకుంటారా?

- సానుకూలంగా మలచుకుని పాలన సాగిస్తారా!
- టిటిడి నూతన ఇఒ ముద్దాడ మార్క్ కనిపిస్తుందా?

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో సమస్యలను సవాల్‌గా తీసుకుంటారా?వాటిని సానుకూలంగా మలచుకుని నూతన ఇఒ ముద్దాడ రవిచంద్ర పాలన సాగిస్తారా అనేది టిటిడి ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఓ వైపు కల్తీనెయ్యి వ్యవహారంలో పాతకుపోయిన పూర్వ టిటిడి కీలక అధికారులు ఉండటం, కొందరు ఉద్యోగులు, మార్కెటింగ్ విభాగం తప్పిదాలు ఉన్నాయనేది సిబిఐ సిట్ ప్రభుత్వానికి అందించిన నివేదికలు.ఈ నివేదికల ఆధారంగానే ఇటీవల బదలీ వేటుపడిన టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ తప్పిదాలు ఉన్నాయనేది స్పష్టంగా తేల్చిన విషయం. ఈ తరువాత ఆ స్థానంలో సీనియర్ ఐఎఎస్ అధికారి,సిఎంఒలో ముఖ్యకార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ముద్దాడను టిటిడి ఇఒగా సిఎం చంద్రబాబునాయుడు నియమించారు. ముద్దాడ శుక్రవారం ఉదయం తిరుమల ఆలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనలో ఏ మాత్రం అధికార దర్పం కనబడకుండా తొలిరోజే వ్యవహారించడం ప్రత్యేకతగా మారింది. అంతేగాక ఒక భక్తుడిగా తోటి భక్తులకు సేవచేసే భాగ్యం కలిగినందుకు చాలా సంతోషమని మనసులోని మాటను వ్యక్తం చేశారు. అందరి నమ్మకాలను నిలబెడతానని, ఆ దేవుడు ఇచ్చిన శక్తితో తన విధులను నిర్వర్తిస్తానని చెప్పడం రవిచంద్ర పాలన ఏంటో ఆయనతో ఉన్న సీనియర్ అధికారులకు అవగతమైంది. అనుభవజ్ఞుల సలహాలు తీసుకుని భక్తులకు మెరుగైన సేవలందిస్తానని చెప్పారు. ఇప్పుడు ఆయన బోర్డుతో కలసి పలు కీలక అంశాలపై చర్చించి ముందుకు కదలాల్సి ఉంది. టిటిడిలో సేవాభావం,సమన్వయంతో మెలగడం ప్రధానం. అయితే జిల్లాల్లో పాలన వ్యవహారాల్లో క్రిందిస్థాయి అధికారులతో కలసి సమన్వయంగా చక్కటి పాలన సాగించిన అనుభవం ఉన్నా టిటిడిలో బాధ్యతలు కత్తిమీద సాములాంటిదే. వీటన్నిటినీ ఆయన సానుకూలంగా మలచుకుని పనిచేయాల్సిన అవసరం కూడా ఉందనేది టిటిడి ఉద్యోగవర్గాల మాట. 2008-09లో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నా, ఆయన పనితీరు, పలు సంస్కరణలు జిల్లాప్రజలకు సంతోషాన్నిచ్చాయనేది తెలుస్తోంది. ఇప్పుడు టిటిడిలో సామాన్యభక్తులకు సంతోష దర్శన విధానాల అమలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. టిటిడిలో ప్రక్షాళనకు,పాలనను గాడిలో పెట్టడానికి ఇఒగా ముద్దాడను నియమించడం వెనుక కూడా ప్రత్యేకత ఉందనేది తెలుస్తోంది. సామాన్య భక్తులకు త్వరితగతిన రెండుమూడుగంటల్లోనే కంపార్టుమెంట్లలో నిరీక్షణ లేని దర్శనం చేయించాలనే టిటిడి బోర్డు తపన,ప్రతిపాదనల నిర్ణయాన్ని ఇఒగా ఈయన ఆచరణలోకి తీసుకురావడానికి మరింత అధ్యయనం చేయడం అవసరం. టిటిడిలో అదనపు ఇఒగా ఇప్పటికే పరిపాలనపై పూర్తిస్థాయిలో పట్టుసాధించి, పాలనాదక్షత కలిగి అవగాహనతో ముందు వెళుతున్న చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరితో ముద్దాడ సమన్వయం, సఖ్యతగా మెలిగే అంశం ముందు ముందు ఏపాటిదనేది చూడాల్సి ఉంది. టిటిడిలో తిష్టవేసిన అన్యమత ఉద్యోగులను బయటకు పంపడం, విఆర్ఎస్ ఇచ్చే అంశం, ఏఐ అమలు , ఉద్యోగులకు నేమ్‌బ్యాడ్జీ, వడమాలపేట పాదిరేడు వద్ద ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ళస్థలాల ప్రాంతంలో అభివృద్ధి, మౌళిక సౌకర్యాలు కల్పనపై అధ్యయనంతో కూడిన పనితీరు అవసరం. మరీ ముఖ్యంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసిపికి అనుచరులుగా ఉంటున్న కొందరు అధికారులు, ఉద్యోగులను బదలీ చేయడంపై సమన్వయంగా పనితీరు సాగించాల్సి ఉంది. మరోవైపు టిటిడి ఉద్యోగులకు వారివారి బంధువులకు, స్నేహితులకు దర్శనాల ప్రాధాన్యత లేకపోవడం వంటివి ఇప్పుడు ఇఒగా ముద్దాడ రవిచంద్రకు కొంత సవాల్‌గానే ఉన్నాయి.ఇదేగాక ప్రభుత్వం త్వరలో నియమించే ఏకసభ్యకమిషన్‌తో ఇఒ హోదాలో కలసి ముందుకు వెళ్ళాల్సిన ఉత్కంఠ పరిస్థితి ఉంది. ముద్దాడ రవిచంద్ర అధికారిగానే పాలన ఉంటుందనేది ఇప్పటికే ఆయనతో పనిచేసిన అధికారుల మాట.మరీ టిటిడిలో ఆయన ఎంతవరకు సఫలీకృతులు కాగలరనేదికూడా పనితీరుపై ఆదారపడింది.

# తిరుమల సమాచారం

## కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలకు నేడు ధ్వజారోహణం

**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలే శ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్స వాలు ఆదివారం ఉదయం మకర లగ్నంలో 6.05గంటలకు ధ్వజారో హణంతో వైభవంగా మొదలు కానున్నాయి. అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు శంఖ నాదాలు, శివనామ స్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. పంచమూర్తులైన సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, వినాయకస్వామి, చండీకేశ్వరస్వామి, వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యాస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో మకర లగ్నంలో నందిచిత్రంతో కూడిన ధ్వజపటం అధిరోహింపజేస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 15న మహాశివరాత్రి పర్వదినం విశేషంగా జరుగుతుంది. 16న సాయంత్రం కల్యాణోత్సవం, చివరగా 17న మంగళవారం ఉదయం త్రిశూలస్నానంతో, రాత్రి ధ్వజావరోహణంతో ముగుస్తాయి.



## అంతా మంచి జరగాలని ప్రార్ధించాం: న్యాయమూర్తులు



**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం శుభమని, అందరికీ అంతా మంచిజరగాలని ఆకాంక్షించినట్లు హైకోర్టు న్యాయమూర్తులు తెలిపారు. శనివారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ హరిహరనాధశర్మ, హైకోర్టు న్యాయవిభాగం రిజిస్ట్రార్ జనరల్ జస్టిస్ కమలాకర్‌రెడ్డి, విజిలెన్స్ రిజిస్ట్రార్ జస్టిస్ శ్రీనివాస శివరామ్‌లు కుటుంబంతో కలసి శనివారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఉదయం స్వామివారి నైవేద్య విరామసమయంలో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోపల వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేవుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలకు శుభాలు కలగాలి :మంత్రి పయ్యావుల కేశవ్

**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సు లతో రాష్ట్రప్రజలందరికీ శుభాలు కల గాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆకాం క్షించారు. శనివారం ఉదయం కుటుం బంతో కలసి ఆయన స్వామివారి ఆశీ స్సులందుకున్నారు. ఆలయ అధి ,కారులు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## భక్తుల సౌకర్యాలపై ఇఒ 'ముద్దాడ' సుడిగాలి పర్యటన

- వెలుపల క్యూలైన్ల తనిఖీ.. అన్నదానం స్వీకరణ



**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిలో పట్టుకలిగించుకునే దిశగా టిటిడి నూతన ఇఒ ముద్దాడ రవిచంద్ర వ్యూహాత్మకంగా కదులుతున్నారనేది తెలుస్తోంది. ఇందులో భాగంగా తొలిరోజే శనివారం సాయంత్రం ఆయన కొండపై సుడిగాలి పర్యటన చేస్తూ ఆలయం వెలుపల క్యూలైన్లను, భక్తులను అనుమతించే విధానం, యాత్రికుల వసతి సముదాయాల్లో సౌకర్యాలు, అన్నప్రసాదం భవనంలో భక్తులకు వడ్డించే విధానం నిశితంగా పరిశీలించారు. శనివారం సాయంత్రం రాష్ట్రమంత్రి పయ్యావుల కేశవ్,టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణతో కలసి తో కలసి అన్నదానం భవనంలో అన్నప్రసాదాలు స్వీకరించారు. రుచినాణ్యతపై భక్తులను పలకరించి వివరాలు రాబట్టడం చేశారు.

# రాష్ట్రంలో కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు

**విజయవాడ.ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిది:** ఏపీలో కొత్తగా 10 గురుకులాలను ఒక్కొటి రూ.45కోట్లు వ్యయంతో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచణ చెపట్టింది.బీసీ విద్యార్థులకు మెరుగైన వసతి, అత్యుత్తమ విద్య, నైపుణ్యమున్న ఉపాధ్యాయులతో మంచి బోధన అందించేందుకు లక్ష్యంగా చర్యలు చేపడుతుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిల్లో 86 నియోజకవర్గాల పరిధిలో గురు కులాలు ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి ఒక గురుకులాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా మరో 89 చోట్ల గురుకులాలను ఏర్పాటు చెయ్యాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో విడుతల వారీగా డిమాండ్‌కు అనుగుణంగా గురుకులాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడతగా 10 ప్రాంతాల్లో భవనాల నిర్మాణం చేపట్ట నున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందు బాటులోకి తీసుకొచ్చేందుకు గత కొన్ని సంవ త్సరాల ప్రవేశాలను పరిగణనలోకి తీసుకుంది. ఏ ప్రాంతంలో ఎక్కువ డిమాండ్ ఉందనేది పరిశీలించి 20 నియోజకవర్గాల పరిధిలో కొత్త గురుకులాల ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. తొలి విడతగా ఈ ఏడాది ఇందులోని 10 ప్రాంతాల్లో గురుకులాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారు. వచ్చే ఏడాది మిగతా 10 ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. 2026- 27 ఆర్థిక సంవత్సరంలో 10 ప్రాంతాల్లో కొత్తగా గురుకులాలను నిర్మించి వాటిని అందుబాటులోకి తీసుకు రానున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా అద్దె భవనాల్లో సరైన వసతులు లేక మగ్గుతున్న ఎందరో విద్యార్థుల కష్టాలను తీర్చేందుకు కృషి చేస్తుంది. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా మరో 10 చోట్ల నూతన భవనాలను నిర్మించే దిశగా చర్యలు చేపడుతుంది. ఈ మేరకు అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. కొత్తగా గురుకులాలు ఏర్పాటైతే అదనంగా 3 వేల సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. రాయలసీమలో 1:15 ఉత్తరాంధ్రలో 1:5: ప్రభుత్వ భవనాల్లో బోదన కొనసాగుతున్న ఒక్కో గురుకులంలో 480 మంది విద్యార్థులు ఉండగా ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న వాటిల్లో 240 మంది విద్యార్థులకే బోధన అందించే అవకాశముందని అధికారులు తెలుపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకులాలకు ఎక్కువ డిమాండ్ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనే ఉన్నట్లు తెలుస్తుంది. రాయలసీమ పరిధిలో ఉన్న గురుకులాల్లో ఒక్క సీటుకు 15 మంది, ఉత్తరాంధ్రలో 5 మంది పోటీపడుతున్నట్లు సంబంధిత లెక్కల్లో తేలింది. కానీ కోస్తాంధ్రలో మాత్రం అంత డిమాండ్ లేదు. ఈ నేపథ్యంలో రాయలసీమలో 12 , ఉత్తరాంధ్రలో 4, కోస్తాంధ్రలో 4 గురుకులాల ఏర్పాటు చెయ్యాలను అధికారులు నివేదికలో ప్రతిపాదించారు. వీటిలో అత్యంత ఎక్కువ డిమాండ్ ఉన్న నియోజకవర్గాలను ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో తొలి విడతగా 10 గురుకులాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటితో పాటు కొత్తవలస, నసన్నకోట, ఆత్మకూరు, గొలిగమూడి, కలికిరి, వనిపెంట గురుకుల పాఠశాలల్ని జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. రూ.45 కోట్లతో ఒక గురుకులం: కొత్తగా నిర్మించే ఒక్కో గురుకులాని సుమారు రూ. 45 కోట్ల వరకూ వ్యయం కానున్నట్లు

## టెన్త్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్పమార్పు

**విజయవాడ, ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు.ఈ క్రమంలో విద్యాశాఖ తాజాగా ఈ పరీక్షల షెడ్యూల్‌లో ఓ మార్పు చేసింది. ఉగాది, రంజాన్ పండుగల కారణంగా ఇంగ్లీష్ పరీక్షను మరుసటి రోజుకు అంటే మార్చి 21కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ సంవత్సరం షెడ్యూల్ ప్రకారం ప్రతీ పరీక్ష తరువాత ఒక రోజు విరామం రావడంతో విద్యార్థులు ఎంతగానో సంతోషిస్తున్నారు. ఇది వారికి ప్రయోజనకరం కానుందని నిపుణులు తెలుపుతున్నారు. మొదటి భాష, రెండో భాష, ఇంగ్లీష్, మ్యాథ్స్, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సామాజిక శాస్త్రం వంటి ప్రధాన సబ్జెక్టుల న్నింటికీ మధ్యలో విరామం ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. దీనివల్ల ప్రతి పరీక్ష పూర్తయ్యాక విద్యార్థులు తదుపరి సబ్జెక్టుపై దృష్టి పెట్టేందుకు సమయం దొరుకుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి సబ్జెక్టులను మళ్లీ చదువుకోవడానికి, విరామం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# రాష్ట్రంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు!

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు అందుబాటులోకి రానున్నాయి. మారుతీ సుజుకి ఇండియా.. ఏపీ ప్రభుత్వం కలిసి ఏపీలో నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేయనున్నారు. ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లి జిల్లాలలోని ఆర్టీవో కార్యాలయాల వద్ద ఈ ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయనున్నారు. మారుతి సుజుకీ ఇండియా ఈ ట్రాకులను మూడేళ్లపాటు నిర్వహించనుంది. డ్రైవింగ్ మీద మంచి పట్టు వారే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా.. ఈ విధానం తీసుకువస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారి భద్రతా ప్రమాణాలు పెరుగుతాయని రవాణా శాఖ భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టు ట్రాకులు ఏర్పాటు, నిర్వహణ కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మారుతి సుజుకీ ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఏలూరు, విజయనగరం, ఒంగోలు, అనకాపల్లిలోని రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసుల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులను అందుబాటులోకి తెచ్చిన నాటి నుంచి మూడేళ్ల పాటు.. ఈ ట్రాకులకు కావాల్సిన ఆటోమేషన్, నిర్వహణ చూసేలాఏపీ ప్రభుత్వం మారుతి సుజుకీ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. మరోవైపు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులలో మానవ ప్రమేయం ఉండదు. నైపుణ్యం కలిగిన వ్యక్తులే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా ఈ విధానం అమల్లోకి తెస్తున్నారు. ఈ నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ద్వారా లైట్ మోటార్ వెహికల్స్, టూవీలర్లకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయనున్నారు. మరోవైపు ఒంగోలులో ఏర్పాటు చేసే ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ వద్ద హెవీ మోటార్ వాహనాలకు కూడా లైసెన్సులు జారీ చేయనున్నారు.

## ఆధునిక సాంకేతికతతో నాణ్యమైన విద్య అందించాలి

### - పద్మావతి వర్సిటీలో డాక్టర్ డికె చతుర్వేది


**తిరుపతి,ఫిబ్రవరి 7ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధునిక సాంకేతికతను వినియోగించి అందరికీ నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎన్‌సిటిఇ అకడమిక్ అడ్వయిజర్ డాక్టర్ డికె చతుర్వేది తెలిపారు. సమాజంలో ఉన్నత హోదాల్లో ఉన్న వ్యక్తులందరూ ఉపాధ్యాయుల చేతిలో రూపుదిద్దుకున్నారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపుకు ఈ సదస్సు వినియోగపడుతుందని తెలిపారు. తిరుపతి పద్మావతి మహిళ విశ్వ విద్యాలయంలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ నేషన్ వైడ్ రూల్ అవుట్ ఆఫ్ ఎన్‌పిఎస్‌టి ,ఎన్‌ఎంఎం" అనే అంశంపై సదస్సులో శనివారం ముఖ్యఅతిధిగా చతుర్వేది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర, వారి బాధ్యతలు,ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఎంతో ఉందన్నారు. ఎన్‌ఎంఎం అమలు కమిటీ సభ్యుడు జ్ఞానేంద్రకుమార్ మాట్లాడుతూ 21వ శతాబ్దపు ఉపాధ్యాయుని యొక్క ముఖ్యవిధి, ప్రతి విద్యార్థిలోని ప్రత్యేకతను గుర్తించాలన్నారు. వారిని ప్రోత్సహించడం ద్వారా ఉపాధ్యాయ సాంకేతికతతో కూడిన విద్యాబోధన నైపుణ్యాలు, వృత్తిప్రమాణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని తెలిపారు. తిరుపతి జిల్లా విద్యా శాఖాధికారి కెవిఎన్ కుమార్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 మార్గదర్శకాలు అనుసరించి ఉపాధ్యాయ వృత్తిలో సామర్థ్యాలు పెంపొందించుకుని నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయ ప్రమాణాలను మెరుగుపరచి డిజిటల్ పోర్టల్ వినియోగంపై వినియోగపడు తుందన్నారు. ఈ సదస్సులో ఎన్‌సిటిఇ సభ్యులు డాక్టర్ చంచల్ మల్హోత్రా, ఆచార్య టిజిఅముదవల్లీ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# మా ఊరికి రోడ్డు వేయండి

## విద్యార్థుల వినతికి స్పందించిన డిసిఎం పవన్‌కల్యాణ్

**విజయవాడ.ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిన మాధ్యమం వేదికగా విద్యార్థులు తమ ఊరుకు రోడ్డు వేయాలంటూ పెట్టిన పోస్టుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు.కొన్ని గంటల వ్యవధి ఆ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలకు ఆదేశించారు.పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ విద్యార్థులు చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జులవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జులవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి. ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పటికే పల్లెపండగ 1.0, 2.0ఖి, సాస్కి నిధులతో కలిపి సుమారు రూ. 55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టుల కింద మొత్తం 641 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటికి అదనంగా, తాజాగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గజ్జులవారిపల్లి రోడ్డును ప్రత్యేకంగా మంజూరు చేసారు.




## దేవాలయాల పవిత్రతను దెబ్బతీసిన నాయకులను తిరస్కరించాలి : కావలి ఎమ్మెల్యే

**కావలి, (నెల్లూరు) ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** పవిత్రమైన ప్రదేశాలను అపవిత్రం చేసిన రాజకీయ శక్తులను రాష్ట్ర ప్రజలు శాశ్వతంగా తిరష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసిపి పాలకుల పాలన రాక్షస పాలనగా సాగిందని దేవాలయాల పవిత్రతను కూడా దెబ్బతీశాయని ఆరోపించారు. కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి వినియోగం జరిగినట్లు వచ్చిన నివేధికలు ఆ పాలకుల వైపుల్యానికి నిదర్శనమన్నారు. వైసిపి నేతలే తప్పు జరిగిందని పరోక్షంగా ఒప్పుకొంటున్నారని అన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏపి స్వర్ణాంధ్రప్రదేశగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా కంకణబద్దులై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో ప్రజలు భయభ్రాంతులకు గురైనారని కూటమి ప్రభుత్వంలో ప్రజలు పార్టీలతో సంబంధం లేకుండా స్వేచ్ఛగా ఉన్నారన్నారు.

# శ్రీకాళహస్తిలో శనీశ్వరునికి షోడశాభిషేకాలు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. అంతేకాక శనివారం త్రయోదశి సందర్భంగా శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు,అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిధులతో కళ కళ లాడింది.అయితే ఇఓ బాపిరెడ్డి ఓ వైపు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించుకుంటూ మరో వైపు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనాలకు తన సిబ్బందిని ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసాక ఒక్కసారిగా శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరునికి విశేషంగాషోఢషాభిషేకాలు నిర్వహించారు. దక్షిణభారత దేశంలో ఎక్కడా లేని విధంగా వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసినదివ్యక్షేత్రంలో శనీశ్వరుడు విగ్రహ రూపంలో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనీశ్వరునికి షోఢషాభిషేకాలు అందించారు. ఈ ఆలయం వద్ద భక్తుల తాకిడి అధికంగా కనబడింది. అయితే దళారుల అట కట్టించుటకు అధికారులుసిసి కెమెరాలను పరిగణలోకి తీసుకున్నారు.మరో వైపు ఇక్కడ వెలసిన అభయ వెంకటేశ్వరునికి ప్రత్యేకాలంకారాలు జరిపారు. ఎప్పటికప్పుడు భక్తుల తాకిడిని ఇఓ తన ఛాంబర్‌లో సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించుకుంటూ దళారులను కట్టడి చేస్తూ భక్తులకు సదుపాయాలు కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు నుంచి విశేష స్పందన వస్తుంది. ఇక్కడ ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేసి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు ఇచ్చే భక్తులు 83జి ప్రకారం పన్ను మినహాయింపు ఉంటుంది కాబట్టి భక్తులు ముందుకు వచ్చి విరాళం అందిస్తున్నారు.ఈ నేపథ్యంలో శనివారం కరీంనగర్‌కు చెందిన కాల్వ సందీప్ స్వామి అమ్మవార్లను దర్శించుకొని నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న కరీంనగర్‌కు చెందిన సందీప్

# చికెన్‌తో కొత్త రుచులు.

ఇంట్లో చికెన్ ఉంటే.. దాంతో పులుసు పెట్టాలా లేదా వేపుడు చేయాలా అని ఆలోచిస్తాం లేదా గబగబా బిర్యానీ వండేస్తాం. కానీ చికెన్‌తో ఇవే కాదు మరికొన్ని రుచులూ చేసుకోవచ్చు.

## అచారీ చికెన్



**కావలసినవి :** చికెన్: అరకేజీ, ఎండుమిర్చి: నాలుగు, ధనియాలు: రెండు టేబుల్‌స్పూన్లు, ఆవాలు: పావు టేబుల్ స్పూను, జీలకర్ర : టేబుల్‌స్పూను, సోంపు : ఒకటిన్నర చెంచా, మెంతులు: పావు చెంచా, ఉల్లిముక్కలు-కప్పు, టొమాటో ముక్కలు: ముప్పావుకప్పు, నూనె : రెండు టేబుల్‌స్పూన్లు, అల్లం వెల్లుల్లి: టేబుల్‌స్పూను, పసుపు: పావుచెంచా, కారం: ఒకటిన్నర చెంచా, చక్కెర: ఒకటిన్నర చెంచా, పెరుగు: అరకప్పు, ఆవకాయ గుజ్జు: టేబుల్‌స్పూను, కొత్తిమీర తరుగు: పావుకప్పు, అల్లం తరుగు-చెంచా.

**తయారీ విధానం :** ఎండుమిర్చి ధనియాలు, ఆవాలు, జీలకర్ర, మెంతులు, సోంపు నూనె లేకుండా వేయించి తీసుకోవాలి. చల్లారాక మిక్సీలో పొడి చేసుకోవాలి. స్టౌమీద బాణలి పెట్టి నూనె వేసి, వేడయ్యాక ఉల్లిముక్కలు అల్లంవెల్లుల్లి ముద్ద, ముందుగా చేసుకున్న పొడి వేయాలి. రెండు నిమిషాలయ్యాక టొమాటో గుజ్జు, కారం, పసుపు, తగినంత ఉప్పు, చక్కెర వేసి బాగా కలిపాలి. అన్నీ వేగాక గిలకొట్టిన పెరుగు, దాని తరువాత చికెన్ ముక్కలు, అరకప్పు వేడినీళ్లు పోయాలి. చికెన్ పూర్తిగా ఉడికాక ఆవకాయ గుజ్జు

## చెట్టినాడ్ పెప్పర్ చికెన్..

**కావలసినవి :** చికెన్: అరకేజీ, జీలకర్ర: చెంచా, ధనియాలు: రెండు చెంచాలు, ఎండుమిర్చి: అయిదు, మిరియాలు: మూడుచెంచాలు, దాల్చినచెక్క: చిన్న ముక్క, యాలకులు: నాలుగు, సోంపు: చెంచా, ఎండుకొబ్బరిపొడి: పావుకప్పు. అల్లం: చిన్నముక్క, వెల్లుల్లి రెబ్బలు: పది, నూనె: అరకప్పు, బిర్యానీ ఆకులు: రెండు, ఆవాలు: చెంచా, ఉల్లిపాయ ముక్కలు : రెండు కప్పులు, పచ్చిమిర్చి తరుగు : చెంచాకరివేపాకు రెబ్బలు : రెండు, టొమాటోగుజ్జు: ఒకటిన్నర కప్పు, ఉప్పు : తగినంత, కారం: రెండు చెంచాలు, పసుపు: చెంచా, చింతపండుగుజ్జు: రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు : రెండు చెంచాలు.

**తయారీ విధానం :** జీలకర్ర, ధనియాలు, ఎండుమిర్చి, మిరియాలు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, ఎండుకొబ్బరి, అల్లం, వెల్లుల్లి రెబ్బలు వేయించి, చల్లారాక అన్నీ మిక్సీలో గ్రైండ్ చేయాలి. అదే బాణలిలో బిర్యానీ ఆకులు, ఆవాలు వేసి వేగాక ఉల్లిముక్కలు, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేసి వేయించాలి. చికెన్ ముక్కలు వేసి కాసేపు వేయించి రుబ్బిన మసాలా టొమాటో గుజ్జు, ఉడికించి దించేముందు కొత్తిమీర చల్లాలి.



## చికెన్ రోస్ట్

**కావలసినవి :** చికెన్: కేజీ, పసుపు-పావుచెంచా, కారం: పావు చెంచా, ధనియాలపొడి: పావుచెంచా, వెల్లుల్లి ఎంబ్బలు అయిదు, పచ్చిమిర్చి : అయిదు, ఉప్పు: తగినంత, ఉల్లిపాయలు: మూడు, టొమాటో : ఒకటి (పేస్టులా చేసుకోవాలి) కరివేపాకు రెబ్బలు : మూడు, గరంమసాలా: పావుచెంచా, మిరియాలపొడి పావుచెంచా, నిమ్మకాయ: ఒకటి, నూనె : వేయించేందుకు సరిపడా.

**తయారీ విధానం :** చికెన్ కడిగి చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. తగినంత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమానికి చికెన్ ముక్కలపైన వేసి బాగా కలపాలి. గంటతరువాత స్టౌమీద బాణలి పెట్టి టేబుల్ స్పూను నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు వేయించుకుని తీసుకోవాలి. అదే బాణలిలో కప్పు నూనె వేసి చికెన్ ముక్కల్ని వేయించి తీసు కోవాలి. బాణలిలో రెండు టేబుల్‌స్పూన్ నూనె వేసి మిగిలిన పచ్చిమిర్చి, కరివేపాకు వేయించాలి. నిమిషం తరువాత టొమాటో గుజ్జువేసి, ముందుగా వేయించుకున్న చికెన్ ముక్కల్ని వేయాలి. చికెన్ ముక్కలకు టొమాటో గుజ్జు పట్టాక ఉల్లిపాయ ముక్కలు గరంమసాలా, మిరియాల పొడి మిలిగిన నిమ్మరసం చేసి బాగా కలిపి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి.



# పల్లె నుంచి కేన్స్ వరకూ..



నెలసరిలో సింథటిక్ ప్యాడ్స్ వాడటం వల్ల ఎన్ని సమస్యల్లో...ఆ బాధలు ప్రత్యక్షంగా అనుభవించిన గీత పోలంకి అవగతమే. అందుకే వీటికి ప్రత్యామ్నాయాలు వెతకడం మొదలు పెట్టింది. ఆ కారణంగా తనకు దొరికిన పరిష్కారమే 'యూనీప్యాడ్స్' సంస్థ ప్రారంభానికి కారణమైంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆమె ప్రయాణంలో విశేషాలివి..

గుజరాత్‌లోని ఓ వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగింది. ఇది నెలసరి సమయంలో తీవ్రమైన కడుపు నొప్పిని కలిగించి, నడవడం, కూర్చోవడం, చివరికి లోదుస్తులు ధరించాలన్నా కూడా ఇబ్బంది పడేదట గీత దీనికి తోడు సింథటిక్ ప్యాడ్స్‌ను ఉపయోగించడం వల్ల ఇన్ఫెక్షన్ పెరిగేది. గీత సమస్యను అర్థం చేసుకున్న ఆమె తల్లి పాతకాలపు పద్ధతిలో కాటన్ వస్త్రాన్ని వాడమంది. మొదట దానికి నిరాకరించినా వాడిన తర్వాత నొప్పి, దద్దుర్ల నుంచి కాస్త ఉపశమనం లభించిందట. దాంతో శానిటరీ ప్యాడ్స్ వల్ల తనకే, పర్యావరణానికి కలిగే హాని తగ్గించాలనుకుంది. అప్పుడే క్లాత్‌తో రీయూజబుల్ ప్యాడ్లను తయారుచేయాలనుకుంది. సొంత గ్రామమైన వెరావాల్‌లోనే తయారీని ప్రారంభించాలనుకుంది గీత. అందులో భాగంగానే గుజరాత్‌లోని మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడ సౌకర్యాల లేమి, ఇతర సమస్యల గురించి అవగాహన తెచ్చుకుంది. ఈ అవసరాలనే అక్కడి మహిళలు నెలసరి సమయంలో పాటించే అసురక్షిత శిక్షణలు తెలుసుకుందామె. సింథటిక్ ప్యాడ్స్‌కి అంత ఖర్చుపెట్టలేక, రోజుమొత్తం ఒకే శానిటరీ నాప్కిన్స్ ఉపయోగించేవారు కొందరైతే, ప్రయాణాలప్పుడు మాత్రమే ఉపయోగించేవారు ఇంకొందరు. పైగా ధర కూడా ఎక్కువ అందుకే యూనీప్యాడ్స్ పర్యావరణహితంగానే కాక, సాధారణ మహిళలకూ అందుబాటులో ఉండాలనుకుంది. ఎన్నో రీసర్చ్‌లు చేసి తయారీ గురించి అవగాహన తెచ్చుకుంది. కానీ, ఎలాంటి అనుభవం లేని గ్రామీణ మహిళలతోనే వీటిని తయారుచేయాలి. కాబట్టి వాళ్లకి అర్థమయ్యేలా చెప్పేందుకు ఎక్కువ సమయం పట్టిందట. ఎన్నో ట్రయల్స్, టెస్టింగుల తర్వాత 2018లో మార్కెట్లోకి యూనీప్యాడ్స్ తీసుకొచ్చిందామె. గ్రామీణ మహిళలకు వీటిని కుట్టడంలో శిక్షణ ఇస్తూనే, వాడకంపై అవగాహన కల్పించే సదస్సులను ఏర్పాటుచేస్తుంది గీత. ఆ స్ఫూర్తితోనే.. యూనిప్యాడ్ మొత్తం ప్రయాణాన్ని ఒక డాక్యుమెంటరీగా రూపొందించింది. అది 'కేన్స్ క్రియేటివిటీ సిల్వర్ గ్లాస్ లయన్' అవార్డును గెలుచుకుంది. ఆ స్ఫూర్తితోనే స్కూల్ మైల్స్ పేరుతో గుజరాత్, రాజస్థాన్‌లోని 1000 మంది స్కూలు బాలికలకు బ్యాగ్స్, రీయూజబుల్ ప్యాడ్స్, సబ్బు, హాట్‌వాటర్ ప్యాక్, లోదుస్తులతో కూడిన ఓ కిటును అందిస్తోంది. పీరియడ్స్‌పై అవగాహన కల్పిస్తుంది. దీంతోపాటు కాలేజీ, స్కూళ్లలో ఆన్‌లైన్ సెమినార్లు అవగాహన సదస్సులను ఏర్పాటుచేస్తుంది గీత.

# ఆత్మహత్య వద్దు..ప్రార్థించు చాలు

అంతర్వాణి

ఇటీవల ఆత్మహత్యలు అధికం అవుతున్నాయి. వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఓ తల్లి తన ఇద్దరు టీనేజ్ పిల్లలతో ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిణి, పిల్లలు ఇంటర్ చదువుతున్నారు.



ఆర్థికపరమైన, కుటుంబపరమైన సమస్యలు ఏమీ లేవు. మరి ఎందుకని ఆత్మహత్యకు పాల్పడిందో తెలియదు. విచారణలో వాస్తవం ఎప్పుడైనా బయట పడుతుంది సరే. కారణాలు ఏవైనా ఈమధ్యకాలంలో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు సమస్యకు పరిష్కారం చావేననుకుంటున్నారు. సమస్య ఉంటే దానికి పరిష్కారం ఉంటుంది. పరిష్కారం లేని సమస్య అంటూ ఏదీ లేదు. సరే బైబిల్ 'ఆత్మహత్య'ను ఏమాత్రం సమర్థించదు. 'అధికముగా దుర్మార్గపు పనులు చేయకుము, బుద్ధిహీనముగా తిరుగవద్దు, నీ కాలమునకు ముందుగా నీ వేల చనిపోదువు?' (ప్రసంగి 7:17). దేవుడు ప్రతివారికి ఒక కచ్చితమైన ఆయుష్షును ఇస్తాడు. ఎంతవరకు బతకాలినో అంతవరకే జీవిస్తాం. కానీ మన దేహానికి మనం ఎలాంటి హాని తలపెట్టకూడదు. బైబిల్‌లో యోనా అనే ప్రవక్త ఉన్నాడు. దేవుడికి అవిధేయంగా ప్రవర్తించినప్పుడు దేవుడు సముద్రంలో తుఫానును పుట్టించాడు. యోనాకు తెలుసు ఆ తుఫాను తన అవిధేయతవల్లే వచ్చిందని. ఓడ నాయకులతో తనను ఎత్తి సముద్రంలో పడేవేయమన్నాడు (యోనా 1:12). ఎందుకని యోనా తానే ఓడ నుంచి సముద్రంలో దూకేయవచ్చు కదా? యోనాకు తెలుసు, ఆత్మహత్య చేసుకోకూడదని. అలాగే ఏలీయా కూడా చనిపోవాలను కున్నప్పుడు దేవుడికే ప్రార్థించాడు. 'ఇంతమట్టుకు చాలును, నా ప్రాణము తీసికొనుము అని ప్రార్థన చేసెను' (1 రాజులు 19:4). అని ప్రార్థించాడు. యోనా, ఏలీయా ఇద్దరూ గొప్ప ప్రవక్తలే. చనిపోవాలను కున్నప్పుడు ఆత్మహత్య చేసుకోలేదు. దేవుడికే విన్నవించుకున్నారు. కాబట్టి ప్రభువును విశ్వసించే వారు ఎవరైనా కష్టాలు, బాధలు ఎన్ని ఎదురైనా ఆత్మహత్య అనే ఆలోచన రాకుండా చూసుకోవాలి. దేవుడిపై ఆధారపడాలి. ఆత్మహత్యను యేసుప్రభువు ఎట్టిపరిస్థితులో కోరుకోడు. మరణం వరకు మనం పోరాడాల్సిందే. కష్టాలు వచ్చినప్పుడు ప్రభువుపై విశ్వాసంతో ప్రార్థించాలి. అప్పుడే మన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. చావు పరిష్కారం కాదని, యేసుక్రీస్తే మన పరిష్కారకర్తని గుర్తించి, ఆయనపై ఆధారపడి జీవిద్దాం.

-పి.వాణిపుష్ప

# 3-3-3 బ్రషింగ్



ఫ్యాషన్ నుంచి ఆరోగ్యం వరకూ ప్రతిదాంట్లోనూ వెల్నెస్ ట్రెండ్‌లు అనుసరిస్తారు కొరియన్లు. కెరటమాలు, పుయెన్సర్ల ప్రభావంతో మనమూ వాటిని అనుసరిస్తున్నాం. వాటిలో ఒకటే ఈ బ్రషింగ్ ట్రెండ్ నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి 3-3-3 పద్ధతిని అనుసరించారట కొరియన్లు. ఈ పద్ధతిలో రోజుకు మూడుసార్లు... అంటే మూడు పూటలా తిన్న తరువాత మూడు నిమిషాల బ్రష్ చేసుకుంటారు. దీనివల్లే కొరియన్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ క్రానిక్ డిసీజ్ నిర్వహించిన సర్వేలో నోటి అనారోగ్యాలు తగ్గినట్లు తేలింది. ముఖ్యంగా తరవాత నిద్రకి ముందు పళ్ల తోముకోవడం వల్ల చిగుళ్ల ఇన్‌ఫెక్షన్, వాపు నిద్ర అదుపులోకి వచ్చాయట. ఇలా రోజులో మూడుసార్లు బ్రష్ చేయడంవల్ల పంటిపై ఉంటే ఎనామిల్ పోతుందనే భయం అవసరం లేదంటున్నారు శాస్త్రవేత్తలు. మనం తినే ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి వంటివీ తీపి తాలూకా అవశేషాలూ పళ్ల మధ్యలో ఇరుక్కుంటాయి. అవి మనం ఆహారం తిన్న కొన్ని నిమిషాల్లోనే కనిపించను వృద్ధి చేస్తుంది. దాంతో పంటి నొప్పి, చిగుళ్ల వాపులు, నోటి అల్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. కాబట్టి, ఈ పాటిస్తే నోటి ఆరోగ్యం మెరుగుపడు తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

# కుంగుబాటువల్లే అధిక నొప్పి !



పీరియడ్స్ సమయంలో భరించలేని నొప్పికి డిప్రెషనే కారణం అంటోంది ఓ రాజు అధ్యయనం. రుతుక్రమ సమయంలో నొప్పి, కుంగుబాటు... ప్రపంచవ్యాప్తంగా మహిళలపైన తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కానీ వాటి మధ్య సంబంధం ఏంటో అర్థం కాకుండా ఉండేది. ఆ విషయాన్ని తెలుసుకునేందుకు యూకే, చైనాకు చెందిన శాస్త్రవేత్తల బృందం ప్రయత్నించింది. డిప్రెషన్కు కారణమయ్యే కొన్ని రకాల జన్యువులే రుతుక్రమంలో నొప్పికి కారణమవుతున్నాయా అనే కోణంలో పరిశోధన చేపట్టింది. అందుకోసం ఐరోపా, తూర్పు ఆసియాకు చెందిన ఆరు లక్షల మంది నుంచి జన్యు డేటా సేకరించారు. తర్వాత బయోఇన్ఫర్మేటిక్స్ సాయంతో డిప్రెషన్, రుతుక్రమ నొప్పికి దారితీసే నాడీకణ వ్యవస్థల్ని అన్వేషించారు. ఈ అధ్యయనంలో డిప్రెషన్కి కారణ మవు తున్న జన్యువుల్లో కొన్ని పీరియడ్స్ సమయంలో నొప్పినీ కలిగిస్తున్నట్లు గుర్తించారు. భావోద్వేగాల్లో మార్పు వచ్చినప్పుడు పొత్తుకడుపులో నొప్పి 50 శాతం పెరుగుతున్నట్లు చెబుతున్నారు. నిద్రలేమితో బాధపడే వారిలో వీటిమధ్య సంబంధం ఇంకాస్త ఎక్కువనీ తెలిపారు. తద్వారా మానసిక ఆరోగ్యం, రుతుక్రమ సమయంలో నొప్పి మధ్య సంబంధం ఉన్నట్టు తేల్చారు.

# 'నాగబంధం' పవర్ ఫుల్ ఫస్ట్ లుక్



పాన్ ఇండియా మూవీ ఖినాగబంధంఖి నుంచి అబ్దాలిగా ఫైటర్ ఫేమ్ రిషబ్ సాహ్నీ పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్ విరాట్ కర్ణ హీగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'నాగబంధం' ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నెల15న మహా శివరాత్రి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర టీజర్ విడుదల కానుంది. దీనికి ముందు, ఈ ఇతిహాస కథనంలోని మరో కీలక పాత్ర ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారుబాలీవుడ్ 'ఫైటర్'లో తన అద్భుత మైన ప్రజెన్స్‌తో ఆకట్టుకున్న రిషబ్ సాహ్నీ నాగబంధంలో ఆఫ్ఘన్ సుల్తాన్ అబ్దాలి పాత్రను పోషించాడు. 1750లో బ్యాక్ డ్రాప్ లోని ఈ చిత్రంలో భారత్‌లో అబ్దాలీ చేసిన దండయాత్రలు, దేవాలయాల దోపిడీ, అపార సంపద కోసం అతడు చేసిన క్రూర ప్రయత్నాలను చూపించబోతున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ పవర్ ఫుల్ గా వుంది. మంచుతో కప్పబడిన యుద్ధభూమిలో తుఫాన్ వాతావరణం మధ్య, భారీ రక్తంతో మచ్చలపడ్డ గొడ్డలిని చేతబట్టి యుద్ధానికి దూసుకెళ్తున్న అబ్దాలీగా రిషభ్ కనిపిస్తారు. అతని వెనుక భారీ సైన్యం, 'నాగబంధం'లో అబ్దాలీని ఆశ, క్రూరత్వంతో నడిచే వ్యక్తిగా కనిపించనున్నారు. హిమాలయాల్లో దాగి ఉన్న మిథికల్ నాగబంధాన్ని స్వాధీనం చేసుకోవడానికి, బ్రాహ్మణులు, పిల్లలు సహా ఎందరి ప్రాణాలనైనా బలి చేయడానికి వెనుకాడని వ్యక్తిగా ఈ పాత్ర ఉండబోతోంది. రిషభ్ నటనపై దర్శకుడు అభిషేక్ నామా ప్రశంసలు కురిపించారు."రిషభ్ చేసిన నటన చూస్తే, అబ్దాలీనే తెరపై జీవించినట్టుగా అనిపిస్తుంది. ఈ క్లిష్టమైన పాత్రలో అతడు అద్భుతంగా నటించారు"

# 'శ్రీ చిదంబరం గారు' హృదయాలకు హత్తుకుంటుంది: ఆనందం వ్యక్తం చేసిన టీమ్




శ్రీమతి. చింతా వరలక్ష్మీ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన 'శ్రీ చిదంబరం' వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం అందరి హృదయాలను హత్తుకుంటూ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఈసందర్భంగా చిత్ర యూనిట్ బ్లాక్‌బస్టర్ థ్యాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు వినయ్ రత్నం మాట్లాడుతూ ఈ రోజు నా సక్సెస్‌కు కారణం నా టీమ్. ఈ వేదికపై ఈ రోజు నేను ఉండటానికి, సినిమా జనాల్లో రావడానికి ప్రధాన కారణం మా నిర్మాత గోపాల కృష్ణారెడ్డి గారు. ఈసినిమాకు ప్రీమియర్స్ దగ్గర నుంచే మంచి ఫీడ్‌బ్యాక్ వస్తుంది. ఇప్పుడు సినిమా విడుదల తరువాత అందరి నుంచి మంచి స్పందన వస్తోంది. కానీ ఇంకా ఆడియన్స్ నుంచి మరింత సపోర్ట్ కావాలి. ఈ సినిమా చూసి మలయాళం నుంచి అప్రిషియేషన్ వస్తుంది. ఇంతకు ముందు తెలుగు నుంచి మలయాళ వాళ్లకు ప్రశంసలు వచ్చేవి. ఇప్పుడు మా సినిమాకు మలయాళం నుంచి ఫోన్స్ వస్తున్నాయి. సినిమా చూసిన వాళ్లు మీ మౌత్‌టాక్‌తో మరింత మందికి చెప్పండి. ఈ సినిమా ఈరోజు ఇంత అప్రిషియేషన్ వస్తుందంటే మా టెక్నిషియన్స్ కూడా కారణం. వాళ్లకు నా కృతజ్ఞతలు అన్నారు.చింత గోపాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొత్త టీమ్‌తో చేసిన సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తే నాకే ఆశ్చర్యమేసింది. సినిమా చూసిన వాళ్లు బాగుందని ఫోన్ చేస్తున్నారు. కొత్త టీమ్ అంతా ఎంతో కష్టపడి ఈ సినిమా చేశారు. ఈ విజయానికి కారణమైన అందరికి థ్యాంక్స్. నిర్మాతగా ఈ సినిమా కమర్షియల్‌గా కూడా హ్యాపీగా ఉన్నాను. మా ప్రయత్నంలో ఉన్న నిజయితీని గుర్తించారు. త్వరలో మరో కొత్త దర్శకుడితో మరో సినిమాతో మీ ముందుకు వస్తాను అన్నారు.


## తెర

# 'యుఫోరియా'ను ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు: డైరెక్టర్ గుణశేఖర్



భూమిక ప్రధాన పాత్రలో సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రం'యుఫోరియా. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మాతలుగా సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో.. .డైరెక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ 'యుఫోరియా' మూవీ సినిమాకు మార్నింగ్ షో నుంచే మంచి ప్రశంసలు వస్తు న్నాయి. ఈ టైటిల్ చూసి యూత్ వస్తారని అనుకు న్నాను. అయితే ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా వస్తున్నారు. అన్నారు.పృథ్వీ అడ్డాల మాట్లాడుతూ ఉదయం నుంచి 'యుఫోరియా' మూవీకి వస్తోన్న రెస్పాన్స్ చూసి చాలా చూసిన ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్ అందరూ సినిమాను ఎంజాయ్ చేస్తున్నామని అప్రిషియేట్ చేస్తు న్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ 'యుఫోరియా' సినిమా చూసిన తర్వాత ఆడియెన్స్ నాకు చేస్తోన్న ఫోన్స్ చూసి చాలా హ్యాపీగా అనిపిస్తుంది. అన్నారు.

# 'గాయపడ్డ సింహం' టీజర్ 9న రిలీజ్



డిఫరెంట్ ఎంటర్టైనర్స్‌తో అలరిస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి మరో యూనిక్ మూవీతో రాబోతున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న పవన్ సాదినేని సమర్పి స్తున్న ఈ చిత్రాన్ని కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిటివి స్టోరీస్ , జీ స్టూడియోస్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. గాయపడ్డ సింహం అనే టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం ఆకట్టుకునే పోస్టర్ ద్వారా సినిమా మూడ్ , నేపథ్యాన్ని ప్రజెంట్ చేస్తోంది. రివాల్వర్, డొనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉన్న క్యారికేచర్, నటరాజ కాంపస్ బాక్స్ ఇవన్నీ ఆసక్తికరంగా వున్నాయి. ఈ అంశాలు పొలిటికల్ సెటైర్, క్రైమ్, హాస్యం కలగలిసిన ఎంటర్టైనర్ ని సూచిస్తున్నాయి. "నవ్వకండి! ఇది చాలా సీరియస్ మేటర్!"అనే ట్యాగ్‌లైన్ మరింత హిలేరియస్ గా వుంది. టీజర్ ఫిబ్రవరి 9న విడుదల కానుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటిస్తుండగా, విష్ణు ఓయి, హర్షవర్ధన్ ,శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.విద్యా సాగర్ చింత సినిమాటోగ్రఫీని, స్వీకర్ అగస్తి సంగీతాన్ని అందిస్తున్నారు, విప్లవ్ నైషధం ఎడిటర్ ప్రొడక్షన్ డిజైన్ చంద్రిక గొర్రెపాటి, కథను సూర్య ప్రకాష్ జోస్యుల అందించారు.

# 'అమరావతికి ఆహ్వానం' పాట విడుదల




అమరావతికి ఆహ్వానం సినిమా నుండి డుం డుం డియ్యాల పాట విడుదల లుంబిని పార్క్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సాంగ్ రిలీజ్ చేసిన చిత్ర యూనిట్ శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా 'అమరావతికి ఆహ్వానం' ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణ లో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మిం చారు. 'అమరావతికి ఆహ్వానం' సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల Exactly రాబోతుంది.జెమినీ సురేష్ మాట్లాడుతూ "అమరావతికి ఆహ్వానం మూవీలో ఫస్ట్ టైమ్ ఒక డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ఈ సినిమాలో ఒక పిచ్చివాడి పాత్రలో నేను కనిపిస్తాను..మ్యూజిక్ డైరెక్టర్ పద్మనాబ్ భరద్వాజ్ మాట్లాడుతూ ఈ సినిమాలో డుం డుం డియ్యాల సాంగ్ ఒక సెలబ్రేషన్ మోడ్‌లో వచ్చే పాట...లిరిసిస్ట్ ఉమా వంగూరి యూఎస్ లో ఉంటారు. అమరావతికి ఆహ్వానం మా లైట్ హౌస్ బేనర్‌లో వస్తోన్న ఆరవ చిత్రం..దర్శకుడు జీవీకె చెప్పిన బడ్జెట్‌లో సినిమా కంప్లీట్ చేశారు.

# 'ఇట్లు అర్జున' స్పెషల్ పోస్టర్ రిలీజ్



స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల ఖిఇట్లు అర్జునఖితో నిర్మాణంలోకి అడుగుపెడుతున్నారు, వాట్ నెక్స్ట్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఇది అతని మొదటి వెంచర్. 'న్యూ గై ఇన్ టౌన్' అనిష్ హీరోగా మహేష్ ఉప్పల దర్శకత్వంలో, అనస్వర రాజన్ హీరోయిన్ గా ఈ సినిమా రూపొందుతోంది. అక్కినేని నాగార్జున వాయిస్ ఓవర్ ఇచ్చిన టైటిల్ గ్లింప్స్‌తో ఈ చిత్రం ఇప్పటికే సంచలనం సృష్టించింది. అనిష్ పుట్టిన సందర్భంగా ఒక ప్రత్యేక పోస్టర్, వీడియో విడుదల చేశారు.పోస్టర్‌లో అనీష్ కూల్ అండ్ చార్మింగ్‌గా కనిపించారు. కొత్తగా విడుదలైన వీడియోతో మేకర్స్ ఆ పాత్ర వెనుక ఉన్న యాక్టర్ పై ఫోకస్ చేశారు. ఫైండింగ్ అర్జున వాల్యూమ్ 1 వీడియో ఒక క్యారెక్టర్‌ను పరిచయం చేయడమే కాదు ఆ క్యారెక్టర్‌లోకి వెళ్ళడానికి అనీష్ చూపించిన కమిట్మెంట్ మైండ్‌సెట్‌ను ఆవిష్కరిస్తుంది. ఫైండింగ్ అర్జున వాల్యూమ్ 1 అనీష్‌ను మరో డెబ్యూ నటుడిగా మాత్రమే కాదు తన కళపై ఉన్న నిజాయితీని, నటన ద్వారానే తనను తాను నిరూపించుకోవాలనే తపనను ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రానికి ఎస్ తమన్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రఫీని రాజా మహదేవన్ నిర్వహిస్తున్నారు, అనీష్ కేవలం అర్జున్ పాత్రలో నటించలేదు, అర్జున్‌గా మారేందుకు పూర్తిగా తనను తాను సిద్ధం చేసుకున్నాడని అర్జున వాల్యూమ్ 1 వీడియో స్పష్టం చేస్తోంది.

# టెన్నిస్ ఆసియా కప్‌లో ఆకాష్ ఓటమి

**న్యూఢిల్లీ:** 2026 ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటిటిఎఫ్), ఆసియన్ టేబుల్ టెన్నిస్ యూనియన్ (ఎటిటియు) ఆసియా కప్‌లో నాకౌట్ దశలో ఉన్న భారత ఏకైక ప్యాడ్లర్ ఆకాష్ పాల్ 16వ రౌండ్‌లోనే నిష్క్రమించాడు. దీంతో ఆసియా కప్ నుండి భారత్ నిష్క్రమించినట్లయింది. శనివారం



చైనాలోని హైకౌలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఆకాష్ చైనాకు చెందిన ప్రపంచ నంబర్ 2 ఆటగాడు లిన్ షిడాంగ్ చేతిలో 9-11, 5-11, 9-11 తేడాతో వరుస గేమ్‌లతో ఓటమి పాలయ్యాడు. దీంతో వరుసగా రెండో ఎడిషన్‌లో భారతదేశం పతకం సాధించలేకపోయింది. ఖండాంతర పోటీలో భారత్ ప్లేయర్ల ప్రదర్శన ఖండాంతర పోటీలో భారత్ ప్లేయర్లు అంత ఆశాజనకమైన ప్రదర్శన ఇవ్వలేకపోతున్నారు. చేతన్ బాబూర్ (1997, 2000), మానికా బాత్రా (2022) మాత్రమే పతకాలు గెలుచుకున్నారు. దీనికి తగినట్లుగా ఈ సంవత్సరం భారతదేశం తమ అత్యుత్తమ జట్టును ఈ ఈవెంట్‌కు పంపలేదు. ఆకాష్ పాల్ వంటి యువకులకు అవకాశం ఇచ్చింది. ఆకాష్ టోర్నమెంట్‌లో మంచి ప్రదర్శన ఇచ్చాడు, గ్రూప్ దశలో ప్రపంచ 55వ ర్యాంకర్ చైనీస్ తైపీకి చెందిన ఫెంగ్ యిషిన్‌పై 3-2 తేడాతో విజయం సాధించి నాకౌట్ దశకు అర్హత సాధించాడు. చివరి గ్రూప్ మ్యాచ్‌లో ప్రపంచ 27వ ర్యాంకర్ చెన్ యువాన్యుపై అంకుర్ భట్టాచార్జీ అద్భుతమైన విజయం సాధించడం భారతదేశానికి మరో ప్రకాశవంతమైన అంశం, అయినప్పటికీ అతను గ్రూప్ దశ దాటి ముందుకు సాగలేకపోయాడు. మానికా బాత్రా, స్వస్తిక ఘోష్, స్నేహిత్ సురవాజ్జుల్లా కూడా గ్రూప్ దశ నుంచే నిష్క్రమించారు.



# విండీ సిటీ ఓపెన్‌లో.. అనహత్, అభయ్ ఓటమి

**న్యూఢిల్లీ:** విండీ సిటీ ఓపెన్‌లో భారతదేశపు ప్రముఖ సింగిల్స్ ఆటగాళ్ళు అనహత్ సింగ్ మరియు అభయ్ సింగ్ రెండో రౌండ్‌లో నిష్క్రమించారు. భారత్ టీనేజ్ సంచలనం, 17 ఏళ్ల అనాహత్ బెల్జియంకు చెందిన ఏడో సీడ్, ప్రపంచ 10వ ర్యాంక్ క్రీడాకారిణి టిన్నే గిలిస్ చేతిలో ఐదు గేమ్‌ల ఉత్కంఠభరితమైన పోరాటంలో ఓడిపోయింది. బెల్జియన్ నంబర్ 1 ప్లేయర్ 49 నిమిషాల్లో 3-2 (6-11, 9-11, 11-4, 11-6, 11-4) తేడాతో ఓడించే సమయానికి అనాహత్ 2-0 ఆధిక్యంలో ఉంది. తొలి రౌండ్‌లో అనాహత్ 3-1 తేడాతో ఈజిప్టుకు చెందిన జీనా మికావీపై విజయం సాధించింది. గత వారం, అనాహత్ వాషింగ్టన్‌లో జరిగిన స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్ 2026ను గెలుచుకుంది, ఇది ఆమె తొలి పిఎస్ఎ స్క్వాష్ టూర్ కాంస్య స్థాయి టోర్నమెంట్. ఆమె మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 19వ ర్యాంక్‌ను సాధించి కెరీర్‌లో అత్యధిక ర్యాంక్‌ను కూడా సాధించింది. మరోపక్క ప్రపంచ 29వ ర్యాంకర్ అభయ్ సింగ్ 0-3 తేడాతో ఈజిప్ట్‌కు చెందిన ప్రపంచ నం.1 ముస్తఫా అసల్ చేతిలో 8-11, 5-11, 7-11 తేడాతో 43 నిమిషాల పాటు జరిగిన పోటీలో పరాజయంపాలయ్యాడు. తొలి రౌండ్‌లో, అభయ్ ఈజిప్ట్‌కు చెందిన ఫేర్స్ డెస్సౌకీని 3-1 తేడాతో ఓడించాడు. చికాగోలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న భారతీయులు అనహత్ మరియు అభయ్ మాత్రమే. అయితే ఈ ఇరువురు ఓటమితో నిష్క్రమించడంతో ఈ టోర్నీలో భారత్ ప్రచారం ముగిసినట్లయింది.

# బాక్సమ్ ఎలైట్‌లో ఫైనల్స్‌కు భారత్

## స్వర్ణం కోసం 12 మంది పోటీ

**న్యూఢిల్లీ:** స్పెయిన్), ఫిబ్రవరి 7, 2026 బాక్సమ్ ఎలైట్ ఇంటర్నేషనల్ 2026 చివరి రోజున భారత్‌కు చెందిన ఎనిమిది మంది మహిళా బాక్సర్లు, మరో నలుగురు పురుషులతో సహా 12 మంది ఫైనల్ పోరుకు అర్హత సాధించి, స్వర్ణ పతకాల కోసం పోటీపడతారు. స్పెయిన్‌లోని అలికాంటేలోని లా నుసియాలో శనివారం జరిగిన పురుషుల విభాగంలో సచిన్ సివాచ్ (60 కిలోలు) ఇంగ్లాండ్‌కు చెందిన జాక్ డ్రైడెన్‌పై మరో ఆధిపత్య విజయంతో తన అద్భుతమైన ప్రదర్శన కొనసాగించాడు. మహిళల విభాగంలో, ఒలింపిక్ పతక విజేత లవ్లినా బోర్గోహైన్ (75) వేల్స్‌కు చెందిన రోజీ ఎక్లెస్‌పై ఏకగ్రీవ విజయంతో



ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఇక భారత మహిళలు అన్ని విభాగాలలో సెమీఫైనల్ విజయాలతో అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించారు, ప్రీతి, పూనమ్ (5) విభాగంలో స్వర్ణం నిర్ధారించడంతో పాటు, టైటిల్ కోసం తలపడనున్నారు. మిగతా చోట్ల, మంజు రాణి (48), నీతు (51), ప్రియ (60), అరుంధతి చౌదరి (70), నైనా (80 కిలోలు) అందరూ అద్భుతమైన విజయాలతో ఫైనల్స్‌కు చేరుకున్నారు. అలాగే పురుషుల పోటీలో, దీపక్ (70), ఆకాష్ (75), అంకుష్ (80)



ఆధిపత్య ప్రదర్శనల ద్వారా ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఇక కజకిస్తాన్ ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ రజత పతక విజేత నూర్బెక్ ముర్సల్‌పై మొదటి రౌండ్‌లో ఆర్ఎస్‌సిని ఓడించడం ద్వారా దీపక్ సెషన్‌లో అత్యుత్తమ క్షణాలలో ఒకటి సృష్టించాడు.



# హిస్టరీలో 3 రికార్డులు

## టి 20 ప్రపంచకప్‌లో 172 రన్స్ తేడాతో భారీ గెలుపు

**న్యూఢిల్లీ:** అందరూ ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న టీ20 ప్రపంచకప్-2026 ప్రారంభమైంది. ఈ మెగా టోర్నీ కోసం భారత జట్టు డిపెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతుంది. ఈ పొట్టి ఫార్మాట్ లో ఒక్క ఇన్నింగ్స్, ఒక చిన్న స్పెల్, లేదా కేవలం ఒకే ఒక్క ఓవర్ కూడా రికార్డులను శాశ్వతంగా మార్చేయగలవనే సంగతి తెలిసిందే. అయితే, ఈ క్రమంలో ప్రస్తుతం అందరి చూపు టీ20 వరల్డ్ కప్‌లో ఇప్పటి వరకూ బద్దలు కాని కొన్ని స్పెషల్ రికార్డులు ఉన్నాయి. తొలి ఐసీసీ టీ20ఐ ప్రపంచకప్ 2007లో జరిగింది. ఈ సమయంలో శ్రీలంక జట్టు కెన్యాపై 172 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. టీ20 చరిత్రలోనే అత్యంత ఏకపక్ష విజయాన్ని నమోదు చేసి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 6 వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసింది. ఈమ్యాచ్ లో సనత్ జయసూర్య 44 బంతుల్లో 88 పరుగులతో విశ్వరూపం చూపించగా, మహేల జయవర్ధనే కేవలం 27 బంతుల్లో 65 పరుగులు సాధించాడు. చివర్లో జెహాన్ ముబారక్ 13 బంతుల్లోనే 46 పరుగులు చేసి స్కోరును మరింత పెంచాడు. అనంతరం లక్ష్య ఛేదనలో కెన్యా జట్టు శ్రీలంక బౌలర్ల ధాటికి తట్టుకోలేక 88 పరుగులకే కుప్పకూలింది. చమిందా వాస్, లసిత్ మలింగ, తిలకరత్నే దిల్షాన్ తలో రెండు వికెట్లు తీశారు. అలాగే మరో రికార్డ్ గురించి చెప్పాలంటే అదే సంవత్సరం అంటే 2007లో జరిగిన టీ20ఐ ప్రపంచకప్‌లో టీమిండియా స్టైలిష్ ప్లేయర్ యువరాజ్ సింగ్ చరిత్ర సృష్టించాడు. దర్బన్ వేదికగా టీ20 ప్రపంచకప్ హిస్టరీలో భారీ రికార్డ్ నమోదు చేశాడు. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే స్పష్టమైన ఉద్దేశంతో ఆడిన యువరాజ్, కేవలం 12 బంతుల్లోనే తన అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఈ రికార్డు నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. స్టువర్ట్ బ్రాడ్ వేసిన ఒకే ఓవర్‌లో వరుసగా 6 సిక్సర్లు బాదడం ఈ ఇన్నింగ్స్‌ను క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిపివేసింది. ఇక టీ20 క్రికెట్ అంటేనే పరుగుల వరద, భారీ సిక్సర్లు అని అందరూ అనుకుంటారు. కానీ, వీటికి భిన్నంగా న్యూజిలాండ్ పేసర్ లాకీ ఫెర్గూసన్ 2024 టీ20 ప్రపంచ కప్‌లో పపువా న్యూ గినియాతో జరిగిన మ్యాచ్‌లో ఒక అసాధ్యమైన రికార్డును నెలకొల్పాడు. తన కోటాలోని 4 ఓవర్లను వరుసగా మెయిడిన్లుగా వేసి ఆశ్చర్యపరిచాడు. అలాగే అసద్ వాలా, చార్లెస్ అమినీ, చాద్ సోపర్ల వికెట్లను పడగొట్టిన ఫెర్గూసన్, ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మ్యాచ్ ముగించాడు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో ఇలా నాలుగు ఓవర్లు వేసి ఒక్క పరుగు కూడా ఇవ్వని తొలి బౌలర్‌గా అతను చరిత్ర సృష్టించాడు.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# వలరివన్‌కు మహిళల రైఫిల్ కిరీటం

## టీమ్ విభాగంలో మరో స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ 2026, మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ కిరీటాన్ని ఎలావెనిల్ వలరివన్ గెలుచుకుంది. శనివారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్వర్ణంలో ఎలావెనిల్ వలరివన్, మేఘనా సజ్జనార్ డబుల్ పోడియంను సాధించారు. ఫైనల్‌లో ఎలావెనిల్ 252.0 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలవగా, మేఘన 229.5 పాయింట్లు సాధించి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. జపాన్‌కు చెందిన మిసాకి నోబాటా 251.5 పాయింట్లతో రజతం గెలుచుకుంది. ఫైనల్‌లో మరో భారతీయుడు ఆర్య బోర్సే 209.0 పాయింట్లతో నాల్గవ స్థానంలో నిలిచాడు. ఎలావెనిల్, మేఘన, ఆర్య కలిసి జట్టు స్వర్ణం గెలుచుకున్నారు. సీనియర్ ఈవెంట్‌లో ఇషా సింగ్ (ఎయిర్ పిస్టల్) మరియు రుద్రాంక్ష పాటిల్ (ఎయిర్ రైఫిల్) తర్వాత ఎలావానిల్ భారతదేశానికి మూడవ వ్యక్తిగత బంగారు పతక విజేతగా నిలిచింది.

# అతి కష్టంపై పాకిస్థాన్ గెలుపు

**న్యూఢిల్లీ:** పసికూన నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 3 వికెట్ల తేడాతో అతికష్టం మీద విజయం సాధించింది. ఒకానొక దశలో నెదర్లాండ్స్ విజయం ఖాయమని భావించినా, పాక్ లోయర్ ఆర్డర్ బ్యాటర్ అద్భుతం చేయడంతో కథ అడ్డం తిరిగింది. కొలంబోలో శనివారం 148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ 18వ ఓవర్ ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి కేవలం 119 పరుగులు మాత్రమే చేసింది. చేతిలో కేవలం 3 వికెట్లు మాత్రమే ఉండటం, క్రీజులో స్పెషలిస్ట్ బ్యాటర్లు లేకపోవడంతో పాక్ ఓటమి ఖాయమని అంతా అనుకున్నారు. అయితే 8వ నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ఫహీమ్ అష్రఫ్ కేవలం 11 బంతుల్లో 29 పరుగులు బాది పాక్‌ను గట్టెక్కించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ 19.5 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (37) ఒంటరి పోరాటం చేశాడు. పాక్ బౌలర్లలో సల్మాన్ మీర్జా 3, మొహమ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్, సయ్యద్ అయూబ్ తలో 2 వికెట్లు పడగొట్టారు. స్టార్ పేసర్ షాహీన్ అఫ్రిదికి ఒక వికెట్ దక్కింది. లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (47), సయ్యద్ అయూబ్(24) ధాటిగా ఆడినప్పటికీ మిడిలార్డర్ కుప్పకూలింది. కెప్టెన్ బాబర్ ఆజం (15) మరోసారి నిరాశపరిచాడు. 114 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న పాకిస్థాన్‌ను ఫహీమ్ అష్రఫ్ తన మెరుపు ఇన్నింగ్స్‌తో గట్టెక్కించాడు. మూడు బంతులు మిగిలి ఉండగానే పాక్ లక్ష్యాన్ని ఛేదించింది.



కిలో వెండి రూ.20 వేలు పెంపు



# పసిడి ప్రియులకు ధరల షాక్

**ముంబయి, ఫిబ్రవరి 7:** పసిడి ప్రియులకు ధరలు మళ్లీ షాకిచ్చాయి. బంగారం, వెండి ధరలు రోజుకోలాగా హెచ్చు తగ్గులు అవుతున్నాయి. ఒకరోజు పెరుగుతుంటే ఇంకోరోజు తగ్గుతున్నాయి. ఇలా ధరలు దోబూచులాడుతున్నాయి. ఈరోజు మరోసారి భారీగా పుత్తడి ధరలు పెరిగిపోయాయి. శనివారం తులం గోల్డ్‌పై రూ.2,890 పెరిగితే కిలో వెండిపై రూ.10,000 పెరిగింది. దీంతో కొనుగోలుదారులు హడలెత్తిపోతున్నారు. తులం గోల్డ్‌పై రూ.3,150 పెరగడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,61,150దగ్గర ట్రేడ్ అయింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.2,650 పెరగడంతో రూ.1,43,550 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.2,170 పెరగడంతో రూ.1,17,450 దగ్గర ట్రేడ్ అవుతోంది. వెండి ధర కూడా భారీ షాకిచ్చింది. కిలో వెండిపై ఏకంగా బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.80 లక్షల దగ్గర అమ్ముడవుతోంది. ఒకే రోజు రూ.20వేలు పెరిగింది. దేశంలోని ఇతర మార్కెట్లలో కూడా ఇవే ధరలు కొనసాగాయి. హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో కూడా కిలో వెండి ధర రూ.2. 80లక్షలుగానే ట్రేడ్ అవుతోంది.

వాణిజ్యం

# ఎస్‌బిఐ నికరలాభం రూ.21,876.04 కోట్లు!

**ముంబయి, ఫిబ్రవరి 7:** దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్బీఐ అక్టోబర్ డిసెంబర్ త్రైమాసికం ఫలితాల్ని వెల్లడించింది. శనివారం రోజు ఫలితాల్ని ప్రకటించగా ఏకీకృత ప్రాతిపదికన చూస్తే ఎస్బీఐ లాభం 14.08 శాతం పెరిగి రూ. 21,876.04 కోట్లుగా వచ్చింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఇది కేవలం రూ. 19,175.35 కోట్లుగా ఉంది. ఇక్కడ ఏకీకృత ప్రాతిపదికన ఆదాయం 10.60 శాతం మేర పెరిగి రూ. 1,85,648.33 కోట్లుగా నమోదైంది. ఇక స్టాండలోన్




ప్రాతిపదికన ఎస్బీఐ నికర లాభం ఏకంగా రూ. 21,028 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే లాభం ఏకంగా 24 శాతం పెరిగింది. అప్పుడు లాభం కేవలం రూ. 16,891.44 కోట్లుగానే ఉండేది. ఇక ఎస్బీఐకి ఒక త్రైమాసికంలో ఇదే అత్యధిక లాభం కావడం విశేషం. ఎస్బీఐ మొత్తం ఆదాయం ఈ సమీక్షా త్రైమాసికంలో 9.7 శాతం పెరిగి రూ. 1,40,914.65 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఆదాయం కేవలం రూ. 1,28,46739 కోట్లుగానే ఉండేది. ఇతర ఆదాయాల విషయానికి వస్తే ఎస్బీఐ నికర వడ్డీ ఆదాయం (వి॥) క్యూ3లో రూ. 45,190 కోట్లుగా నమోదైంది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 9 శాతం పెరిగింది. ఇక ఆపరేటింగ్ ప్రాఫిట్ 39.54 శాతం మేర పెరిగి రూ. 32,862 కోట్లుగా వచ్చింది. ఎస్బీఐ డిపాజిట్లు రూ. 57 లక్షల కోట్లకు చేరగా అడ్వాన్సెస్ రూ. 46 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇలా మొత్తం బిజినెస్ రూ. 103 లక్షల కోట్ల మార్కును దాటింది. ఎస్బీఐ షేరు విషయానికి వస్తే కొంత కాలంగా రాణిస్తూ వస్తోంది. మార్కెట్ ఒడుదొడుకులతో సంబంధం లేకుండా దూసుకెళ్తోంది. ఇటీవల ఫిబ్రవరి 3నే ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధరను రూ. 1089.80 వద్ద నమోదు చేసింది. ప్రస్తుతం షేరు ధర రూ. 1066 వద్ద ఉంది. స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర చూస్తే రూ. 680 గా ఉంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 9.84 లక్షల కోట్లుగా ఉంది. 6 నెలల్లోనే ఈ స్టాక్ ధర 32 శాతానికిపైగా పెరిగింది. ఏడాది వ్యవధిలో 45 శాతం పెరిగింది. ఈ క్రమంలోనే ఇన్వెస్టర్లకు మంచి లాభాలు వచ్చాయని చెప్పొచ్చు.



### ఇండో- యుఎస్ డీల్..

# రెపోరేట్ ఎఫెక్ట్

## లాభాల్లోనే ఈ వారం మార్కెట్లు

**ముంబయి,ఫిబ్రవరి 7:** భారత స్టాక్‌మార్కెట్లు ఈవారం తీవ్ర ఒడిదొడుకులకు లోనైనప్పటికీ, చివరికి మంచి లాభాలతో ముగిశాయి. 2026-27 బడ్జెట్‌లో డెరివేటివ్‌లపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పెంపుతో ఆరంభంలో బలహీనపడిన సూచీలు, అమెరికా భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ప్రకటనతో అనూహ్యంగా పుంజుకున్నాయి. దేశీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాలు బడ్జెట్ భయాలను అధిగమించడంతో మదుపర్లలో విశ్వాసం పెరిగింది. ఫలితంగా వారం ముగిసేసరికి సెన్సెక్స్ 83,580.40 వద్ద, నిఫ్టీ 25,693.70 వద్ద స్థిరపడ్డాయి. అమెరికాభారత్ మధ్య ఉన్నత స్థాయి చర్చల అనంతరం భారత వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరిగింది. దీనికి తోడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 5.25%వద్ద యథాతథంగా ఉంచుతూ, జీడీపీ వృద్ధి అంచనాలను పెంచడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచిందని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్వీపీ అజిత్ మిశ్రా తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేయడం కూడా మార్కెట్లకు కలిసొచ్చింది. దేశీయంగా కూడా సానుకూల సంకేతాలు అందాయి. జనవరి జీఎస్టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం పెరిగి రూ.1.93 లక్షల కోట్లకు చేరాయి. మరోవైపు 2025లో భారత్‌చైనా ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 155బిలియన్ డాలర్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. రంగాల వారీగా చూస్తే, ధరల ప్రభావిత రంగాలు రియల్టీ, ఎనర్జీ, ఆటో షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. అయితే, ఐటీ రంగం మాత్రం ఈ వారంలో తీవ్రంగా నష్టపోయి మార్కెట్ కంటే బలహీనంగా నిలిచింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం నిఫ్టీ 25,400 స్థాయి పైన ఉన్నంతవరకు సానుకూలంగానే కదలాడవచ్చు. ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 25,100 వరకు దిగివచ్చే అవకాశం ఉంది. పైకి వెళ్తే, 26,000 స్థాయిని నిర్ణయాత్మకంగా అధిగమిస్తే 26,400 వద్ద ఉన్న రికార్డు గరిష్ఠాల వైపు పయనించవచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఇక రానున్న రోజుల్లో, 2024ను బేస్ ఇయర్‌గా సవరించిన తర్వాత విడుదల కానున్న జనవరి వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) గణాంకాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు.

# సావరిన్ గోల్డ్‌బాండ్స్‌కు విమోచన ధరలు: ఆర్బీఐ



**ముంబయి, ఫిబ్రవరి 7:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సావరిన్ గోల్డ్ బాండ్స్ 2020-21 సిరీస్ ఎలెవెన్ బాండ్లకు ముందస్తు విమోచన ధర ప్రకటించింది. ఈ గోల్డ్ బాండ్లను 2021, ఫిబ్రవరి 9న జారీ చేయగా ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ముందస్తుగా విత్‌డ్రా చేసుకునే వారికి ఈ ధరల్ని ప్రకటించిందన్నమాట. సాధారణంగా గోల్డ్ బాండ్ స్కీమ్ కాల పరిమితి 8 సంవత్సరాలు అయినప్పటికీ ఐదేళ్ల తర్వాత ముందుగానే డబ్బులు తీసుకునేందుకు వీలు కల్పిస్తోంది. ఈ గోల్డ్ బాండ్లను కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్బీఐ జారీ చేస్తుంటుంది. ఇప్పుడు ఆ గోల్డ్ బాండ్లను రిడీమ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఇక్కడ బంగారం ధర ఈ కాల పరిమితిలో భారీగా పెరగ్గా ఆ మేరకు రిటర్న్లు వస్తాయని చెప్పొచ్చు. 2020-21లో ఈ సిరీస్ జారీ చేసినప్పుడు గోల్డ్ బాండ్ల ఇష్యూ ధర గ్రాముకు రూ. 4,912 గా ఉండేది. ఇక ఆన్‌లైన్‌లో అప్లై చేసి డిజిటల్ పేమెంట్ చేసిన వారికి గ్రాముపై రూ. 50 డిస్కౌంట్ లభిస్తుంది. ఈ లెక్కన గ్రాముకు రూ. 4,862 కే లభించింది. ఇప్పుడు ముందస్తు విమోచన ధరను గ్రాముకు రూ. 15,374 గా నిర్ణయించింది ఆర్బీఐ. ఇది మూడు రోజుల సగటు ధర ఆధారణంగా నిర్ణయిస్తుంటుంది.

ఇందుకోసం ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ ఐబిజెఎధరల్ని ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ క్రమంలో గ్రాముపైనే రూ. 15,374 రూ. 4,862, రూ. 10,510 చొప్పున లాభం పొందారు. ఇది శాతం పరంగా చూస్తే ఏకంగా 216.2 శాతంగా ఉంటుంది. కనిష్ట ంగాగ్రాము నుంచే గోల్డ్ బాండ్లను కొనుగోలు చేసేందుకు వీలుంటుంది. అంటే అప్పట్లో రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి ఈ క్రమంలో రూ. 3.16 లక్షలు వచ్చాయని చెప్పొచ్చు. ఇక్కడ ఇంకా వడ్డీని ప్రాతిపదికలోకి తీసుకోలేదు. అప్పట్లో ఈ గోల్డ్ బాండ్లపై వార్షిక ప్రాతిపదికన 2.50 శాతంగా వడ్డీ రేటును నిర్ణయించింది. ఈ లెక్కన రూ. 1 లక్షపై ఏటా రూ. 2500 వరకు వడ్డీ వస్తుంది. ఈ లెక్కన 5 సంవత్సరాలలో రూ. 12,500 కుపైనే వడ్డీ వచ్చింది. లక్ష పెట్టుబడిపై మొత్తంగా రూ. 3.30 లక్షలకుపైనే అందుకున్నారని చెప్పొచ్చు.




# ఈ వారంలో ఐపిఒకు 2 కంపెనీలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ఐపిఒల్లో ప్రైమరీ మార్కెట్‌లో రెండుమెయిన్ బోర్డు ఐపిఒలు వస్తున్నాయి. ఫ్రాక్టల్ అనలిటిక్స్ రూ.2833.9 కోట్ల ఐపిఒకు వస్తోంది. ఆయేఫైనాన్స్ కూడా రూ.1010 కోట్లు నిధుల సమీకరించాలని నిర్ణయించింది. సోమ వారం నుంచి మార్కెట్లకు రావచ్చని అంచనా. వచ్చేవారం ఈ మెయిన్‌బోర్డు ఐపిఒలపైనే ఇన్వెస్టర్ల నజర్‌పడింది. ఇకె ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో మరికొన్ని ఐపిఒలు మార్కెట్లకు వస్తున్నాయి. ప్రైమరీ మార్కెట్‌లో ఫ్రాక్టాల్ ఇష్యూదర రూ.857నుంచి రూ.900గా నిర్ణయించారు. కనీసంగా 16 షేర్లకొనుగోలుచేయాలి. కనిష్టంగా రూ.14,400 పెట్టుబడులుపెట్టాలి. 12వ తేదీ షేర్లకేటాయింపులు జరుగుతుంది. 16వ తేదీ ఎక్ఛేంజిల్లో లిస్ట్ అవుతుంది. ఆయే ఫైనాన్స్ ఐపిఒపరంగా చూస్తే తొమ్మిదో తేదా ఇష్యూ ముగుస్తుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌లో 23.3 మిలియన్ షేర్లు జారీచేస్తోంది. కొత్త ఇష్యూలో 55 మిలియన్ ఈక్విటీషేర్లుజారీచేస్తుంది. ఇష్యూదర రూ.122నుంచి రూ.129గా నిర్ణయించింది. కనిష్టంగా 116 షేర్లుకొనుగోలుచేయాలి. అంటే ఇన్వెస్టర్లు రూ.14,964 కనీసమొత్తం పెట్టుబడితో ఉండాలి. ఎస్ఎంఇ విభాగంలో మరుషికా టెక్నాలజీ రూ.26.97 కోట్లు ఇష్యూజారీ చేస్తోంది. ఎన్ఎస్ఇ ఎస్ఎంఇ లిస్టింగ్స్‌లోగ్రోవర్ జ్యూయెల్స్, బ్రాండ్‌మాన్ రిటైల్, బయోపాల్ కెమికల్స్ వస్తుంటే బిఎస్ఇలో పాన్ హెచ్ఆర్ సొల్యూషన్స్ వారాంతంలోనే ఎక్ఛేంజిల్లో లిస్ట్ అయింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.